సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక

RNI No. APTEL 2015/ 66622

రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి మార్చి సోమవారం 27 - ఆదివారం 2 ఏప్రిల్, 2017 సంపుటి : 2 సంచిక 27 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 | వెల : రూ. 5.00

వివరాలు2లో...

పోరులు-చట్టాలు

వివరాలు3లో...

ముస్లిం మహిళాసాధికారతే ధ్యేయం

వివరాలు4లో...

ఎన్. గోపి 'జలగీతం' మానవీయ మహాకావ్యం

వివరాలు6లో...

ఓటు రూ.2000

వివరాలు7లో...

ప్రమాదంలో లౌకికవాదం

అమెరికా తల్లీకొడుకుల హత్యల కేసులో కొత్త కోణం

రా.వా.ప్రతినిధి, విజయవాడ : అమెరికాలో జంట హత్యల కేసులో కొత్త కోణం బయటపడింది. మృతురాలు శశికళ పంపిన ఈ మెయిల్స్‌ను ఆమె కుటుంబ సభ్యులు శనివారం బయటపెట్టారు. తన భర్త నర్రా హనుమంతరావుకు ఓ కేరళ మహిళతో అక్రమ సంబంధం ఉందంటూ శశికళ తన సోదరుడు వేణుకు మెయిల్ లో తెలిపింది. శశికళ మెయిల్ తో తెలిపిన విషయాలు...'సీటీఎస్‌లో పని చేసే దీపా అజిత్‌తో హన్మంత్‌కు సంబంధం ఉంది. రోజు దీపాతో హన్మంత్ ఫోన్లు, చాట్‌లు చేస్తున్నాడు. మొబైల్‌లో వీటిని చూసి హన్మంత్‌ను నిలదీశా. నేనేం తప్పు చేయలేదని బుకాయించాడు. హన్మంత్‌లో ఎలాంటి పశ్చాత్తాపం కనిపించడం లేదు. కొన్నిసార్లు నాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. ఏమైనా చేసుకో పో అంటూ తిరగబడుతున్నాడు. ఐదేళ్ల కొడుకు ఉండికూడా మరో మహిళతో సంబంధం ఘోరం. హన్మంతరావును నేనెంతో నమ్మా. ప్రేమించి పెళ్లి చేసుకున్న నాకు ఇలాంటి మోసం జరగుతుందనుకోలేదు. వాళ్ల తల్లిదండ్రులు, అక్కా బావా అందరూ కుట్రదారులే. ఒక్క విషయం కూడా పంచుకోరు, పైగా ప్రమాదకారులు. ముఖ్యంగా మా అత్తమ్య చాలా చాలా ప్రమాదకారి. కొడుకును ఎలా వాడుకోవాలో బాగా తెలిసిన వ్యక్తి.

ఈ విషయాలన్నీ అమ్మకు చెబితే బాధ పడుతుంది. ఇన్ని బాధలున్నా బతుకుతున్నానంటే కేవలం హనీష్ (కొడుకు) కోసమే.' అని మెయిల్‌లో పేర్కొంది. అలాగే భార్యాభర్తల మధ్య జరిగిన వాట్సప్ సంభాషణలుతో పాటు భర్త వేధింపులకు సంబంధించిన సోదరుడు వేణుకు పంపిన మెయిల్‌లను మృతురాలు తల్లిదండ్రులు మీడియాకు చూపించారు. తమ కూతురు, మనవడిని దారుణంగా హతమార్చిన హనుమంతరావును కఠినంగా శిక్షించాలని మృతురాలి తల్లిదండ్రులు వెంకటేశ్వరరావు, కృష్ణకుమారిలు డిమాండ్ చేశారు. ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కనీస సహకారం కూడా అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లి అయినప్పటినుంచే భర్త వేధింపులకు గురిచేస్తున్నడంటూ తమ కుమార్తె పలుమార్లు చెప్పినా తామే సర్దుకుపొమ్మని చెప్పామని, అయితే అల్లుడు ఇంత ఘాతుకానికి పాల్పడతాడని తాము ఊహించలేదని అన్నారు. మరోవైపు జంట హత్యల కేసులో హనుమంతరావును అక్కడ పోలీసులు విచారణ జరిపారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం అతడిని విడుదల చేశారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో గవర్నర్ పేట

రా.వా.ప్రతినిధి,విజయవాడ : గుంటూరు, విజయవాడ నగరాలు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో కొట్టు మిట్టాడుతున్నాయి.

రోజురోజుకు పెరుగుతున్న ప్రజల తాకిడితోపాటు ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవడం కూడా సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. విజయవాడ 21వ డివిజన్ లోని గవర్నరు పేట, సూర్యారావు పేటల్లో ప్రభుత్వ, ప్రైవేటు వ్యాపార సముదాయాలతోపాటు కలెక్టరు క్యాంపు కార్యాలయం, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, కోర్టు ఆవరణ ఉండటంతో రోడ్లువిస్తరించారు. నగరంలో ఇతర చోట్ల వ్యాపార భవనాలు రోడ్లపైకి ఆక్రమించటంలో రోడ్ల పరిమాణం కుచించుకు పోయింది. స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తుందన్న ఆలోచనలతో మున్సిపల్, రెవెన్యూ శాఖాధికారులు చొరవ చూపకపోవడం వాహనదారుల పాలిట శాపంగా మారింది. ప్రతిరోజు ఈ ప్రాంతం నుంచి ప్రయాణించేవారు ట్రాఫిక్‌లో నిత్యం నరకం చూస్తున్నారు. నవరంగ్ థియేటర్, జంక్షన్, కాలేశ్వరరావు రోడ్డు, ప్రకాశం రోడ్లు కూడలిలో నడవటం కూడా కష్టమని స్థానిక కార్పోరేటర్ బాలస్వామి ట్రాఫిక్ పోలీసులకు తెలిపారు. ముఖ్యంగా పుష్పాసెంటర్, బిసెంట్ రోడ్‌లలో పాదాచారులు, వాహన దారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల మ్యాన్‌హోల నుంచి డ్రైనేజి బయటకు రావడం జరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. రాఘవయ్య పార్కులో పిల్లలు ఆడుకుంటానికి కాదుకదా.. వెళ్లడానికి కూడా బయపడవలసి వస్తోంది. ఎందుకంటే పార్కు నిండా చెత్త పేరుకొని ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.

900 ఎకరాల్లో ఏపీ పరిపాలనా నగరం

రా.వా. ప్రతినిధి-అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో 900 ఎకరాలల్లో పరిపాలన నగరాన్ని నిర్మిస్తున్నారు. దీనిలో అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు ఉండబోతున్నాయి. నదీ అభిముఖంగా అమరావతి నగరం 27 కిలోమిటర్ల పరిధిలో ఉంటుందని ప్రకటించింది. నార్మన్ ఫోస్టర్ సంస్థ రూపొందించిన డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రదర్శించింది. డిజైన్ల కోసం రకరకాల సంస్థల సేవలు ఉపయోగించుకుంటునే ఆలోచనలో ఉంది. రాజధాని పరిధిలో మొత్తం తొమ్మిది థీమ్ సిటీల నిర్మాణం చేపడుతామని ప్రకటించింది. అలాగే రాజధానికి దారితీసే ఏడు ప్రధాన్య రహదారులకు ఉగాది రోజున సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి తుది ప్రణాళిక ఖరారు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. 2018 డిసెంబర్ నాటికి ఐకానిక్ భవంతుల నిర్మాణానికి ప్రణళిక సిద్ధం చేసినట్లు తెలిపింది. ఫోస్టర్ ప్రతినిధితో పాటు ఐఏఎస్ అధికారి శ్రీధర్‌కు ఎమ్మెల్యేలు ప్రశ్నలు సంధించారు. కొత్త రాజధాని డిజైన్‌లో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అనగా, క్యాపిటర్ వాటర్ బాడీస్‌కు నీళ్లు ఎక్కడ నుండి తెస్తారని అధికారపార్టీ సభ్యుడు వేణుగోపాల్ రెడ్డి ప్రశ్నించారు. హైకోర్టుసరే, న్యాయమూర్తులు ఉండే ప్రాంతానికి డిజైన్ ఎలా ఉంటుందని వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ అడిగారు. ఎమ్మెల్యేల ప్రశ్నల పరంపర కొనసాగండతో చంద్రబాబు జోక్యం చేసుకుని ఇది తొలి కాపీ మాత్రమే అని చెప్పారు. ఇందులో చాలా మార్పులు ఉన్నాయని, ఎవరైనా సూచనలు ఇస్తే మార్పులు చేస్తామన్నారు.

జల వనరుల నిర్వహణ

రాజధాని అమరావతిలో 900 ఎకరాల్లో నిర్మించే ప్రభుత్వ భవనాల సముదాయంలో జలాశయాలు, కాలువల నిర్వహణ ఎలా? ఏడాది పొడవునా ఈ జలవనరులు స్వఛరేగా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండాలంటే ఏం చేయాలి? అన్న కోణంపై మథనం సాగుతోంది. ప్రభుత్వ భవనాల సముదాయానికి సంబంధించి లండన్‌కు చెందిన నార్మన్ ఫోస్టర్ అండ్ పార్ట్‌నర్స్ సంస్థ అందజేసిన స్థూల ప్రాథమిక ప్రణాళికపై శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మరోసారి విస్తృతంగా చర్చ జరిగింది. రాజధాని సలహా కమిటీ

సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రధానంగా జల వనరుల నిర్వహణ, వాస్తుకి అనుగుణంగా భవనాల నిర్మాణం ఏవిధంగా ఉండాలి? అన్న కోణంలోనే చర్చ జరిగింది. శాసనసభ, సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు వంటి ప్రధాన ప్రభుత్వ భవనాలను నార్మన్ ఫోస్టర్ సంస్థ దక్షిణ భాగంలో ప్రతిపాదించింది. కానీ చివరకు వాటిని మొదట ప్రతిపాదించినట్టుగా దక్షిణ భాగంలోనే ఉంచాలని, నదిని ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ప్రజల విహార, వినోద అవసరాల కోసమే కేటాయించాలని ముఖ్యమంత్రి సూచించారు.

జలవనరులపై పక్కా ప్రణాళిక..!

నార్మన్ ఫోస్టర్ సంస్థ 10 శాతం ప్రాంతంలో జలవనరులు ఉండాలని ప్రతిపాదించింది. అంటే 900 ఎకరాలకుగాను, 90 ఎకరాల విస్తీర్ణంలో జలాశయాలు, కాలువలు ఉంటాయి. కాలువల పొడవు సుమారు 7 కి.మీ. ఉంటుంది. కాలువల లోతు 2 మీటర్లుంటుంది. వీటిని నింపడానికి 0.2 టీఎంసీల జలాలు కావాలని అంచనా. జలవనరుల నిర్వహణ బాగుంటే అద్భుతంగా ఉంటుందని, సరిగ్గా నిర్వహించలేకపోతే ఇబ్బందులు తలెత్తుతాయన్న కోణంలో చర్చ జరిగింది. పాలవాగులో సంవత్సరంలో మూడు నెలలే నీళ్లుంటాయి కాబట్టి, వాటితో పాటు, ఎత్తిపోతల ద్వారా కృష్ణా జలాలు కొంత తీసుకోవాలని, వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా కొంత నీరు వస్తుందని నిర్ణయించారు. వీటన్నిటిపై నీలి, హరిత సలహాదారు(బ్లూ, గ్రీన్ కన్సల్టెంట్)లు, నీటిపారుదల శాఖ అధికారులతోను చర్చించి తుది ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు.

వాస్తుకి అనుగుణంగానే నిర్మాణాలు

రాజధాని భవిష్యత్ జల అవసరాలు, పులిచింతల ప్రాజెక్టు దిగువ నిర్మించబోయే బ్యారేజీ నుంచి వచ్చే నీరు వంటివన్నీ దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు.

ప్రముఖుల నుంచి అభిప్రాయ సేకరణ

ప్రభుత్వ భవనాల సముదాయ స్థూల ప్రాథమిక ప్రణాళికను శనివారం ఉదయం శాసనసభ్యులకు శాసనసభ కమిటీ సమావేశమందిరంలో ప్రదర్శన(ప్రజంటేషన్) ద్వారా వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈ ప్రణాళికపై రాష్ట్రమంతా చర్చ జరగాలని, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చర్చనీయాంశం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర జాతీయ ప్రముఖులకు ప్రణాళికను చూపించి వారి అభిప్రాయాలూ తెలుసుకుందామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు అమరావతిలో ఎక్కడ చూసినా శరవేగంగా జరుగుతున్న నిర్మాణ కార్యక్రమాలే కనిపించాలని ముఖ్యమంత్రి తెలిపారు. నదీ అభిముఖ ప్రాంతంలో భారీ వినోద, సమావేశ కేంద్రం(కన్వెన్షన్ సెంటర్) నిర్మాణం జరగాలన్నారు. అత్యంత ఆధునిక, నవీన, చారిత్రక సంస్కృతి, వారసత్వాల మేలు కలయికగా రాజధాని నగరం నిర్మిస్తున్నామని, తుది ప్రణాళిక దీనికి తగ్గట్టే ఉండాలన్నారు.

ఏప్రిల్ నెలాఖరుకి తుది ప్రణాళిక

ప్రభుత్వ భవనాల సముదాయ తుది ప్రణాళికను అందజేసేందుకు నార్మన్ ఫోస్టర్ సంస్థ ఐదు వారాల గడువు అడిగింది. ఏప్రిల్ నెలాఖరుకి తుది ప్రణాళికలు అందజేస్తుంది. రాజధానిలో రూపొందించే ఆకృతులు ప్రపంచంలోని మకుటాయమాన నిర్మాణాలలో వేటినీ పోలి ఉండరాదని, అదే సమయంలో వాటికంటే అత్యుత్తమంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో పుపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఎంపీ గల్లా జయదేవ్, పారిశ్రామికవేత్త మండవ ప్రభాకర్‌రావు, ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, మౌలిక వసతుల కల్పన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ పాల్గొన్నారు

కేరళలో ఆంధ్రా అన్నదాతల భిక్షాటన : వైస్ జగన్

రా.వా ప్రతినిధి, అమరావతి: ఉపాధి హామీ నిధులను ఉపాధి సృష్టించేందుకు వాడకపోవడంతో కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ... ఉపాధి హామీ పనుల్లో లేబర్ కాంపోనెంట్‌ను (కార్మికుల వ్యయాన్ని) తగ్గించి మెటీరియల్ కాంపోనెంట్‌ను పెంచుతున్నారన్నారు. లేబర్ కాంపోనెంట్‌ను తగ్గించడం వల్ల పనులు లేక కూలీలు ఉపాధి కోసం కేరళ, కర్ణాటక, చెన్నైకి వలస పోతున్నారన్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగానే మన రాష్ట్రానికి చెందిన అన్నదాతలు కేరళలో భిక్షాటన చేస్తున్నారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 97.5

శాతం ఉపాధి హామీ నిధులను లేబర్ కాంపోనెంట్‌కే వినియోగించారని వైఎస్ జగన్ గుర్తు చేశారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు, సిమెంట్ రోడ్లు, శ్మశానాల నిర్మణానికి ఈ నిధులు ఖర్చు పెడుతోందని వైఎస్ జగన్ అన్నారు. సిమెంట్ పనులు పెరగడం వల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందని..మెటీరియల్ కాంపోనెంట్‌ను ఎక్కువ పెట్టడం వల్ల అవార్డులు వచ్చాయని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందన్నారు. కానీ పేదల గురించి మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ఒకే నెలలో తండ్రి కొడుకులు లేజిస్లేచర్‌లో ప్రవేశం



రా.వా ప్రతినిధి : 1978వ సంవత్సరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్చిలో తొలిసారి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ప్రవేశించారు. 40 సంవత్సరాల తరువాత 2017 మార్చిలో ఆయన కుమారుడు నారా లోకేష్ శాసనసభ మండలిలో ప్రవేశిస్తుండటం ఒక విశేషం.

సాధిక్‌కు విజయం చేకూర్చండి : బాబ్జీ

ఆటోనగర్ అభివృద్ధికోసం నిరంతరం పాటుపడే సాధిక్‌కే ఓటు వేద్దాం..
– శ్రీనివాసరావు

ఆటోనగర్‌ను సమస్యల వలయం నుంచి తప్పించడానికి సాధిక్‌ను గెలిపించడమే మార్గం
– మున్వర్ బేగ్

ఆటోనగర్‌ను పరిశుభ్రంగా ఉంచడం కోసం సాధిక్‌ను గెలిపిద్దాం.
– హుస్సేన్ బాబా
ఏటీఏ కోశాధికారి

త్వరలో జరగనున్న ఇండిపెండెంట్ లోకల్ అథారిటీ (ఐలా) ఎన్నికల్లో సాధిక్ పోటీ చేస్తున్నారని, ఆయనకు మద్దతునిచ్చి అధిక మెజారిటీతో గెలిపించాలని నూతనంగా ఎన్నికైన ఏటీఏ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణ రావు (బాబ్జీ) పిలుపు నిచ్చారు. గత పాలకులు ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరపకుండా ఆటోనగర్‌ను వెనుకబాటుకు గునిచేశారని ఆయన విమర్శించారు. గతపాలకులు మంచినీటి పథకాలను, అమలు చేస్తామని మూడేళ్లుగా చేసిందేమీ లేదని, ఆస్థిపన్ను తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, తగ్గించలేదు సరికదా అదినమ్మిన సభ్యులు వడ్డీతో సహా పన్నుకట్టుకోవాల్సి రావడంతో నడ్డి విరింగదన్నారు. ఆటోనగర్‌లో మురుగునీటి కాల్వలు, డ్రైనేజి అభివృద్ధికూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా ఉందన్నారు. స్వచ్ఛ ఆటోనగర్‌గా మార్చుతామన్న మాటలు నీటి మూటలుగా మారిందన్నారు. గత మూడేళ్లలో ఎన్నికైన నాయకులు అక్రమాలకు పాల్పడటం మినహా ఆటోనగర్ కార్మికులకు చేసింది ఏమీ లేదని ఆవేదన చెందారు. వీధిదీపాలు వెలగవు, రాత్రిళ్లు చీకటిలో కుక్కల స్వైర విహారం జరుగుతోందని, అనేక మంది కుక్కకాట్లకు బలవుతున్నారన్నారు. దీనిపై ఆటోనగర్‌వాసులంతా చర్చించుకొని సాధిక్‌ను గెలిపించి అనేక ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యల నుంచి విముక్తి కావాలని బాబ్జీ కోరారు.

సరికొత్త ఆటోనగర్‌కోసం ఓటు వేయండి : సాధిక్

ఆటోనగర్ కార్మికులు, ఆస్తి పన్ను చెల్లింపుదారులు,మిత్రులు, శ్రేయోభిలాషుల కొరకు మేరకు రానున్న ఐలా ఎన్నికల్లో చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని మహ్మద్ సాధిక్ తెలిపారు. కులమతాలకు అతీతంగా, వర్గవైషమ్యాలు లేకుండా ఏటీఏ అధ్యక్షుడితో కలసి నూతన ఆటోనగర్ ఆవిష్కరణకు మీ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

ఆటోనగర్ ఐలా కోసం శ్రమించే సాధిక్‌నే ఎన్నుకుందాం.
– రామచంద్రారావు

బాబ్జీ,సాధిక్ కలయికతో ఆటోనగర్ అధునాతనంగా మారనుంది.
– కె. సత్యనారాయణ
ఏటీఏ ఉపాధ్యక్షుడు

సాధిక్ విజయం మనందరి విజయంగా గుర్తించాలి
– వాడ్లని రాఘవరావు

సాధిక్ నాయకత్వంలో సమస్యలు పరిష్కార అవుతాయి.
– హాజీ ఇబ్రహీం (హెడ్)
యునైటెడ్ ముస్లీం సొసైటీ
కన్వీనర్

సాధిక్ నిబద్ధత కలిగిన వ్యక్తి తప్పకుండా సహకరిస్తాం
– షేక్ ఇమాం సాహెబ్

ఆటోనగర్ ఐలాను ప్రతిష్టాత్మకంగా తీసుకొని సాధిక్‌ను గెలిపిద్దాం
– ఎండీ. రఫీఉల్లా

సాధిక్ ఆటోనగర్‌ను ముందుకు తీసుకెళ్తాడని నమ్మకం ఉంది
– ఎస్. ఎమ్. వలీ

కులమతాలకు అతీతంగా సాధిక్‌కు ఓటేద్దాం
– శ్రీనివాసరావు
ఎ.టి.ఏ సహాయ కార్యదర్శి

యువకుడైన సాధిక్‌ను ఎన్నుకుందాం.
– యాడ్లపూడి శ్రీనివాసరావు
ఎ.టి.ఏ కార్యవర్గ సభ్యులు

అందరికీ అందుబాటులో ఉన్న సాధిక్‌ను గెలిపించడం మన కర్తవ్యం.
– రామచంద్రరావు

సాధిక్‌లో నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్నాయి.
– ఎన్. వెంకట కృష్ణాసాయి

సాధిక్‌ను గెలిస్తేనే ఆటోనగర్‌లో అధునాత మార్పులు చేకూరతాయి
– సి.హెచ్. రవి కుమార్

రాజధాని వార్తలు

కలం

అగ్రిగోల్డ్ బాధితులకు ఊరట

అగ్రిగోల్డ్ డిపాజిట్లదార్ల రెండున్నరేళ్ల పోరాటం ఫలించింది. ఎట్టకేలకు రాష్ట్రంలో వీధినపడ్డ 20 లక్షలమంది అగ్రిగోల్డ్ మదుపరులకు ప్రభుత్వం భరోసా ఇచ్చింది. చట్టం నుంచి తప్పించుకొని తిరుగుతున్న దోషులను పట్టుకున్నవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 10లక్షల బహుమతిని ప్రకటించారు. ఈసంస్థ అధిక వడ్డీరేటు ఆశచూపి రియల్ ఎస్టేట్, డిపాజిట్ల సేకరణ చేపట్టిందని ఈ కంపెనీ ఆధీనంలోని మూడు కంపెనీలు సేకరించిన ఏడువేల కోట్ల రూపాయలను 87 బోగస్ కంపెనీలకు మళ్లించారు. ఈ స్కాంతో రాష్ట్రంలోని 20 లక్షలమందిని ఆదుకోవాలని వామపక్షాలు, ఛానళు ఎప్పటినుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. 9 రాష్ట్రాలకు విస్తరించిన అగ్రిగోల్డ్‌కు 32 లక్షల మంది డిపాజిటర్లు ఉన్నారు. ఇప్పటికే అనేకమందితో నగదు కట్టించిన ఏజెంట్లు 109 మంది మృతిపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. దేశాన్ని కుదిపేసిన శారదా స్కాం కంటే పెద్దదైన ఈ కుంభకోణంలో 18 మంది నిందితులు ఉండగా, ప్రభుత్వం ఇప్పటివరకు ఇద్దర్ని అరెస్టు చేసింది. మిగతావారిని త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపింది. ఆత్మహత్యలు చేసుకున్న బాధిత కుటుంబాలకు ఐదులక్షల రూపాయలు ప్రకటించడం అభిలాషణీయం. 18 రోజులుగా విజయవాడలో జరుగుతున్న నిరవధిక నిరాహారదీక్షలు ముఖ్యమంత్రి హామీతో ముగిశాయి. నాలుగునెలల్లో బాధితుల సమస్యలు పరిష్కరిస్తామనడం ఊరట నిచ్చే అంశం..

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు రెండేళ్లుగా ఈ విషయంపై అనేకమార్లు చంద్రబాబును కలిశామని చెబుతున్నారు. రెండున్నర ఏళ్లలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం నిర్లక్ష్యం వైఖరిని అనుసరిస్తోందని, ఆసంస్థలో డిపాజిట్లదారులుగా పనిచేసిన అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడటంతో స్పందించిన హైకోర్టు ఈ కేసును విచారణకు స్వీకరించి, దీనిపై సీబీసీఐడీ దర్యాప్తుకు ఆదేశించిందన్నారు. అయితే ఈ సంస్థకూడా జాప్యం చేస్తోందంటూ కోర్టు మందలించింది. మరో ముఖ్య విషయం అగ్రిగోల్డ్‌కు సంబంధించిన 18 వేల ఎకరాలు 8 వేల కోట్ల విలువైన భూములు, 90వేల చదరపు గజాల స్థలాలు ఉన్నాయని బాధితులు పేర్కొన్నారు. వాటిని అమ్మి బాధితులకు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. అయితే వేలంలో భూములను అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా, అతితక్కువ ధరలకు కోట్ చేయడంతో కోర్టు వాటిని నిలిపివేసింది. రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షుడు కుటుంబరావు ఈ సమస్యపై స్పందిస్తూ కోర్టు మార్కెట్ ధరకు మాత్రమే అమ్మకాలకు చేపట్టాలని చెపుతుండటంతో వాటి అమ్మకాలు ఆలస్యమవుతున్నాయని కోర్టు తన ఆంక్షలను సడలిస్తే మరింత త్వరగా బాధితులకు సాంత్వన చేకూరుతుందన్నారు. అయితే వేలానికి ఇతరులను రానీయకుండా ప్రభుత్వ పెద్దలు అడ్డుపడుతూ పడుతునానయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇదే పరిస్థితి మద్యం దిగ్గజం విజయ్‌మాల్యా ఆస్తుల అమ్మకాలపై కూడా నెలకొంది. బాధితులు మాత్రం అగ్రిగోల్డ్‌కు చెందిన 18 వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తక్షణమే రూ.11 వేలకోట్లు అందిస్తే 80 శాతం మంది నిరుపేద బాధితుల వెతలు తీరతాయని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. నిజంగా చెప్పాలంటే ఇది సహేతుకమైన, ఆచరణాత్మక సూచన. వేల ఎకరాలు భూసేకరణ, సమీకరణలతో అనేక నిర్మాణాల కోసం చేపట్టిన ప్రభుత్వం ప్రజల కోసం తక్షణమే అగ్రి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని ప్రతిపక్షాలు, ప్రజలు, బాధితులు కోరుతున్నారు. ఈ సంస్థ 24 ఏళ్ల క్రితం ప్రారంభించబడిందని, అప్పటి మంత్రులు అగ్రిగోల్డ్‌కు సంబంధించిన అనేక ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొని ఈ సంస్థకు ర్యాంకింగ్‌లు ఇచ్చి మీరు నిశ్చింతగా డిపాజిట్లు పెట్టమంటేనే తాము కూలీనాలీ డబ్బులను పిల్లలకోసం జమ చేసామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే సంస్థ బోర్డు తిప్పేసిందని, ప్రభుత్వం తక్షణమే దీనిపై స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు మొరపెట్టుకుంటున్నారు. ఏది ఏమైనా అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం మరింత చొరవ తీసుకోవాలి.

25 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు

రా.వా ప్రతినిధి -విజయవాడ (వన్ టౌన్) : ఆంధ్ర హాస్పిటల్స్ హార్ట్ అండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే డాక్టర్ల బృందంతో ఈ నేల 19 నుండి 25వ తేది వరకు పిల్లల గుండె ఆపరేషన్లు నిర్వహించామని ఆంధ్ర హాస్పిటల్స్ డైరెక్టర్ పి.వి రామారావు తెలిపారు. ఆంధ్రహాస్పిటల్స్ హార్ట్ అండ్ బ్రెయిల్ ఆసుపత్రిలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 మంది ఇంగ్లండ్ డాక్టర్ల బృందంతో 25 మందికి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ విక్రమ్ కుడుముల ఆధ్వర్యంలో ఈ బృందం అతి క్లిష్టమైన గుండె జబ్బులకు ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే టీమ్ నేతృత్వంలో ఆంధ్రహాస్పిటల్స్‌లో వందకు పైగా పిల్లల గుండె ఆపరేషన్లు చేశారని చెప్పారు. ఈ సమావేశంలో హీలింగ్ లిటిల్ హార్ట్స్ యూకే టీమ్ డాక్టర్లు ప్రేమ్, గోపి, మహేష్, రాజేష్, లౌరా, సోఫి, మేరి, అను, నవీన్, ఆంధ్ర హాస్పిటల్స్ డాక్టర్ శ్రీమన్నారాయణ డాక్టర్ దిలీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

రా.వా ప్రతినిధి- విజయవాడ (గాంధీనగర్) : ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేసే సరుకులకు ఇచ్చే కమీషన్ ఏమాత్రం సరిపోవడంలేదని ప్రతి సరుకును 100 రూపాయలకు 10 శాతం కమీషన్ ఇవ్వాలని చౌక ధరల రేషన్‌దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.ఎ.వి.ఎల్.నరసింహమూర్తి కోరారు. రేషన్ డీలర్లు రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమకు గౌరవ వేతనాలు చెల్లించాలని లేదా నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నుండి సరైన స్పందన రావడం లేదన్నారు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీలకు పంపిణీ చేసే బియ్యానికి సర్వీస్ చార్జీలు కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో తామే భరాయించవలసి వస్తోందన్నారు. నిత్యావసర సరుకులు సరఫరా చేసే స్టాక్ పాయింట్ నుండి పేమెంట్ ద్వారా వచ్చే సరుకు కచ్చితంగా ఉండకపోవడంతో ఆ నష్టాన్ని తామే భరాయిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, హెల్త్‌కార్డులు కూడా మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునగ గిరిజారావు ఉపాధ్యక్షుడు ఎస్.వి.సుబ్బారెడ్డి, కె.ఎస్.సుబ్బారెడ్డి, అర్గనైజింగ్ సెక్రటరీ యం.సురేంద్రనాథ్, అంజయ్య, జాయింట్ సెక్రటరీ నాగరాజు, గౌరవ అధ్యక్షుడు పోలపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నష్టాల్లో కూరుకుపోయిన సంస్థలను ప్రైవేటు పరం చేయం : గోయల్

ముంబై : నష్టాల్లో కూరుకుపోయిన సంస్థ అమ్మకం విషయంలో ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించనుందని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష గోయల్ అన్నారు. హిందుస్థాన్ ఫొటో ఫిల్మ్స్‌ను బ్లాక్ చేసినట్లు చెప్పారు. అయితే అప్పుల్లో ఉన్న జాతీయ విమానయాన సంస్థ ఎయిరిండియాను మాత్రం ప్రైవేటీకరించేది లేదని ఆయన స్పష్టంచేవారు. ముంబైలో ఓ సమావేశంలో పాల్గొని మాట్లాడిన గోయల్ ప్రతి పెద్ద దేవానికి జాతీయ విమానయాన ప్రైవేటీకరించబోమని తెలిపారు. ఎయిరిండియా ప్రస్తుతం కార్యనిర్వహక సామర్థ్య మరింత పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. గతేడాది విమానయాన సంస్థకు ఆపరేషనల్ లాభాలు వచ్చాయని, ఇక ఫైనాన్షియల్ రీ-ఇంజనీరింగ్ విమాన మార్గాల విస్తరింపుపై దృష్టి పెట్టాలన్నారు. నష్టాల్లో ఉన్న కంపెనీల్లో వ్యూహాత్మకంగా పెట్టుబడుల ఉపసంమ రణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి నట్టు తెలిపారు. హిందూస్థాన్ ఫొటో ఫిల్మ్‌లో మొదట పెట్టుబడుల ఉపసంహరణ చేయనున్నట్లు చెప్పారు. హిందూస్థాన్ యాంటిబయాటిక్స్ పేరు ప్రస్తావించకుండా పూణెలోని ఫార్మా కంపెనీ కూడా ఈ జాబితాలో ఉందని అన్నారు. ఈ విషయాలపై ఉద్యోగ సంఘాలు, వాటాదారులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో పెట్టుబడుల ఉపసహరణ ద్వారా ప్రభుత్వం రూ.72,500 కోట్లు సేకరించగలదని విశ్వాసం వ్యక్తంచేశారు.



పౌరులు-చట్టాలు

Law-Citizen

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది
98495 68901 / 83309 68901
katuruRavindraTrivikram@gmail.com

స్వతంత్ర్య న్యాయవ్యవస్థ

కేంద్ర , రాష్ట్ర జాబితాలకు అదనంగా మూడో జాబితా ఉంటుంది. అది సంయుక్త జాబితా లేదా ఉమ్మడి జాబితా అనవచ్చు. ఉమ్మడి జాబితా అంశాల మీద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా, పూర్తి స్వేచ్ఛతో చేసే చట్టాలకు ఉమ్మడిజాబితా విరుద్ధం కానంత వరకు ఎలాంటి ఇబ్బందిలేనట్లే .

రాజ్యాంగ ఆధ్యికత

సంయుక్త లేక సమైక్య దేశంలో (Federal state)వాస్తవంగా రాజ్యంగం నుండే అధికారాలను స్వీకరించి తన ఉనికిని పొందుతుంది. అధికారాల పంపకాల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎలా జరగాలో రాజ్యాంగమే నిర్దేశిస్తుంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ అధికారానికి లోబడే ఉంటాయి. రాజ్యాంగం లిఖిత పూర్వకంగా ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికార పరిధుల్ని స్పష్టం చెయ్యాలి. భారత రాజ్యాంగం ఇందుకు అనుగుణంగా తయారు చేయబడింది.

స్వతంత్ర్య న్యాయవ్యవస్థ

సంయుక్త రాష్ట్రాలు గలదే (Federal state)స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ ఉండాలి. రాజ్యంగ రక్షణ, పవిత్రతను కాపాడేందుకు రాజ్యాంగ విశ్లేషణ,వ్యాఖ్యానాలు (INTERPRETATION) చేయడానికి స్వతంత్ర్య న్యాయవ్యవస్థ చాలా అవసరం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారి పాలనాయంత్రాంగం రాజ్యాంగ ఉల్లంఘన ద్వారా తీసుకునే చర్యలను రద్దుచేసే అధికారం కోర్టులకు ఉంటుంది. అనేక సందర్భాల్లో ఈ అధికారాన్ని హైకోర్టు,సుప్రీంకోర్టులు ఉపయోగించుకోవడం మనం చూడవచ్చు.

మన రాజ్యంగంలో స్వతంత్ర న్యాయవ్యవస్థతో బాటు, అదే తరహాలో కంట్రోలర్, ఆడిటర్ జనరల్ (CAG) అంటారు., పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ప్రభుత్వం ప్రమేయం లేకుండా అన్ని స్థాయిల్లో పని చేసే అధికారం రాజ్యాంగం ద్వారా లభిస్తోంది.

కోర్టుల స్థాయిల విషయాలకు వస్తే- సుప్రీంకోర్టు దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఇది అధికార పంపిణీ వ్యవస్థను కాపాడటంతో పాటు,రాజ్యాంగ విరుద్ధమైన అన్ని చర్యలను రద్దు చేస్తుంది. మన సంయుక్త రాష్ట్రా విధానం పైన చెప్పిన అన్ని విశిష్టతల లక్షణాలు కలిగిన దేశం.

భారతరాజ్యాంగ విశిష్టతలు

రాజ్యాంగ ఉపోద్ఘాతంలోనే మనదేశం - స్వతంత్ర, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య పునాదుల మీద నిర్మితమైనట్లు రాయబడింది. ప్రభుత్వ ప్రజాస్వామ్య విశిష్టతలను తెలిపే ఇతర అంశాలు ఈ విధంగా ఉన్నవి.

అతిపెద్ద వ్రాత పూర్వక రాజ్యాంగం : మనది లిఖిత పూర్వక అతి పెద్ద రాజ్యాంగం ఇందులో 395 అధికరణలు,పది అధ్యాయాలలో విస్తరించి ఉంది.

(సశేషం)

పి.జి.అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్

రా.వా. ప్రతినిధి-మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు.: కృష్ణా విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల, డాక్టర్,ఎం.ఆర్.అప్పారావు పి.జి.నెంబర్ నూజివీడు, కృష్ణ విశ్వవిద్యాలయం అనుబంద కళాశాలలో పి.జి అడ్మిషన్స్‌కు సంబందించిన కె.ఆర్.యు.సెట్-2017 నకరి నోటిఫికేషన్‌ను ఈ నెల 21వ తేదిన విడుదల చేశారు. దీనికి సంబందించిన కె.ఆర్.యు.సెట్-2017 గోడ పత్రికను కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య సుంకర రామకృష్ణారావు నేడు జరిగిన ఒక కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులందరూ త్వరితగతిన ఆన్‌లైన్ విధానంలో వారి వివరాలను నమోదు చేసుకుని పరీక్షకు సంసిద్ధం కావాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య డి.సూర్యచంద్రరావు మాట్లాడుతూ రాబోవు విద్యాసంవత్సరం నుంచి కృష్ణా విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాల, మచిలీపట్నంలో చేరబోవు విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్ వసతి కూడా కల్పించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్

డి.రామశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరముల బయోటెక్నాలజీ విభాగంలో కోర్సు ఫీజును పెద్ద మొత్తంలో తగ్గించినట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని సైన్స్ విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రవేశ పరీక్ష ద్వారా మాత్రమే అర్హత సాధించి సీటు పొందిన విద్యార్థులకు మాత్రమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించు ఫీజు -రియంబర్స్‌మెంట్ లభించనున్నది. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ వై.కె. సుందర కృష్ణ, డి.ఇ. భవానీ, డా.ఎం.కోటేశ్వరరావు ఆఫీస్ ఇంచార్జ్ కె.సీతాలు, కె.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది కూడా డీఎస్సీ లేదు : మంత్రి గంటా

రా.వా.ప్రతినిధి ; (అమరావతి) : ఈ ఏడాదికూడా ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించిన డిఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శాసన మండలిలో పిడిఎఫ్ సభ్యులు ఎంవిఎస్. శర్మ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయ ఖాళీలను విద్యా సంవత్సరం ప్రారంభం లోనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయుల నియామకం చేయకూడదని, తెలుగు, ఇంగ్లీషు మీడియం వేరుగా నిర్వహిస్తున్నప్పుడు ఉపాధ్యాయ నియమకాల్లో తదనుగుణంగా రేషనలైజేషన్‌లో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలో 8740 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారని, అలాగే కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ సభ్యుడు షరీఫ్ మాట్లాడుతూ ఉర్దూ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయాలని గతంలో తాను సిఎంను కోరానని, సీఎం స్పందించి స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంపై అసంతృప్తి వెలిబుచ్చారు. అన్ని స్కూళ్ళలో కంప్యూటర్లు ఉన్నాయి కానీ, కంప్యూటర్ నేర్పే సిబ్బంది లేక అవి దుమ్ము కొట్టుకు పోతున్నాయని కంప్యూటర్ శిక్షకులను నియమించాలని మహిళ సభ్యురాలు శమంతక మణి కోరారు. పై ప్రశ్నలకు మంత్రి గంటా సమాధానమిస్తూ ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలోనే రేషనలైజేషన్ నిర్వహిస్తామని, రాష్ట్రంలో రేషన్ లైజేషన్ నిబంధనల ప్రకారం తొమ్మిది వేల పాఠశాలలను మూసివేయాల్సి వచ్చినా అవసరాలను బట్టి 1436 మాత్రమే మూసామన్నారు. అలాగే ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై దృష్టి పెడతామన్నారు.

గంటాకు వెల్‌కమ్ చెప్పిన చైర్మన్ చక్రపాణి : వాసన మండలి సమావేశాలుప్రారంభమైన తరువాత మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తొలిసారిగా మండలికి వచ్చారు. గతంలో విద్యాశాఖకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చినా మంత్రి సభకు రాకపోవటంపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖకు సంబంధించిన ప్రశ్నవచ్చిన సమయంలో మంత్రి గంటా సభలో లేరు. చైర్మన్ చక్రపాణి మంత్రిగారెక్కడ అనగానే టిడిపి సభ్యుడు ఎంవివిఎస్. మూర్తి లేచి మంత్రి గారికి సభ అంటే గౌరవం లేదన్నారు. అంతలోనే గంటా సభలోకి ప్రవేశించారు. గంటాను చూసిన చైర్మన్ చక్రపాణి వెల్‌కమ్ సర్ అంటూ స్వాగతం చెప్పారు.

ఉప ఎన్నిక బరిలో నలుగురు అభ్యర్థులు

గుడివాడ : గుడివాడ పురపాలక సంఘం 19వ వార్డు ఉపఎన్నికకు నామినేషన్ పరిశీలన అనంతరం నలుగురు అభ్యర్థులు ఉన్నారని ఎన్నికల అధికారి బండి శేషన్న తెలిపారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలోని కమిషనరు ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ల పరిశీలిన అనంతరం వైకాపా తరుపున గణపతి సూర్యనారాయణ (నూర్జం), టీడీపీ అభ్యర్థిగా నండూరి వీర వెంటక ప్రసాద్, డమ్మీ అభ్యర్థిగా పంచుమర్తి శ్రీనివాసరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా కూరేటి శ్వామ్‌లు బరిలో నిలిచారని పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని శేషన్న తెలిపారు.

వేలిముద్రలు పడనివారికీ రేషన్ : పరిటాల సునీత

రా.వా.ప్రతినిధి- అమరావతి : వేలిముద్రలు పడనివారికి, నగదు చెల్లింపుల ద్వారా తీసుకునేవారికీ రేషన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి పరిటాల సునీత చెప్పారు. అసెంబ్లీల క్వశ్చన్ అవర్‌లో శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, వెలగలపూడి అనిత, గీత మీసాల, డాక్టర్ ఆకుల సత్యనారాయణ, డి.ఎ.సత్యప్రభలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈఏడాది జనవరిలో జరిగిన జన్మభూమిలో దారిద్ర్యరేఖకు దిగువన వున్న 8.75లక్షల అర్హతగల కుటుంబాలకు తెల్లరేషన్ కార్డులను జారీ చేశామని చెప్పారు. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7వ తేదీ వరకు 1,32,66,612 మందికి తెల్లరేషన్ కార్డులున్నాయని, 9,24,421 మందికి అంత్యోదయ అన్నయోజన కార్డులు, 11,858 మందికి అన్నపూర్ణ కార్డులుండగా 14,87,11 మందికి గులాబీ రంగు రేషన్‌కార్డులున్నాయని మంత్రి వివరించారు. రేషన్ పంపిణీలో ఈ-పోష్ విధానం, నగదు రహిత విధానం విజయవంతమైందని, అయితే వేలిముద్రలు పడనివారికి, నగదు చెల్లించేవారికీ రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఉపాధ్యాయులూ..జీన్సులు,టీషర్ట్‌లు వద్దు ..!

లక్నో: ఉపాధ్యాయులు ఇకపై జీన్సు, టీషర్టు ధరించి పాఠశాలలకు రావద్దని లక్నో డిస్ట్రిక్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (డీఐవొఎస్) ఉమేష్ త్రిపాఠి తెలిపారు. వృత్తి గౌరవం పెంచేలా ఉపాధ్యాయుల వస్త్రధారణ ఉండాలి... అందుకే అటువంటి దుస్తులను ధరించి పాఠశాలలకు రావొద్దంటూ ఆయన సూచించారు. దీనిపై ఉన్నతాధి కారులతో ఆయన మాట్లాడతానన్నారు. అంతేకాకుండా పనివేళల్లో మొబైల్ ఫోన్స్ వినియోగించడం మంచిది కాదన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని.. అన్ని పాఠశాలలో తప్పనిసరిగా ఉదయం పూట ప్రార్థనలు జరిగేలా చూడాలని పేర్కొన్నారు. పాఠశాలలకు సమీపంలో పాన్ మసాలా.. సిగరెట్లు విక్రయించే దుకాణాలు కనిపిస్తే వెంటనే వాటిని మూసివేయించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వాటర్ ఫౌంటేన్ పనితీరుపై ఆకస్మిక తనిఖీ.

రా.వా.ప్రతినిధి- మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు : మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ కోనేరు సెంటర్‌లో వాటర్ ఫౌంటేన్ పనితీరును ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గారు మాట్లాడుతూ వాటర్ ఫౌంటేన్ యొక్క పనితీరును, మొక్కల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మచిలీపట్నానికి తలమానిక వంటిది కోనేరు సెంటర్ అని, దానిని ఎంతో ఆకర్షణీయంగా, సుందరంగా ఉంచేందుకు ఎల్లప్పుడు కృషి చేస్తామని తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు అబ్దుల్ అజీమ్, రాజా, మహ్మద్‌బాజానీ, టిపియస్ అండ్ ఇన్‌చార్జ్ టిపిఒ నాగేంద్ర ప్రసాద్, వి.వి.సుబ్బారావు, శ్రీహరి ప్రసాద్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్స్ వసీమా, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన వీఆర్ఏలు

రా.వా.ప్రతినిధి- విజయవాడ : రాష్ట్రంలో పనిచేస్తున్న 26,700 మంది గ్రామ రెవెన్యూ సహాయకులు వేతనాల పెంపు కోసం స్థానిక రైల్వేస్టేషన్ నుంచి ధర్నా చౌక్ వరకు వీఆర్ఏలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఎన్నికల ముందు తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే వీఆర్ఏలను నాలగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.15,000 ఇస్తామని ఆనాడు చంద్రబాబునాయుడు వాగ్దానం చేశారని సంఘానాయకులు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరములు అవుతున్న ఇచ్చిన హామీ ఊసే లేదని, వీఆర్ఏల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళిన పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వీఆర్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న ఆవేదన వెలిబుచ్చారు. నిత్య అవసర ధరలు అకాశం న్నంటిన ఈ రోజుల్లో రూ.6,400 వేతనంతో వీఆర్ఏ కుటుంబాలు ఎలా జీవించాలో సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. తెలంగాణ సాధన ఇక్రిమెంట్ రూ.200 కలిపి రూ.10,700 వేతనం పెంచింది. దీనితో పాటు వీఆర్ఏలందరికీ డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లు కట్టించడంతో పాటు రిక్రూట్‌మెంట్ వీఆర్ఏలను రెగ్యులర్ చేయడానికి నిర్ణయం తీసుకుందని అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందని సభలో వక్తలు ఆవేదన చెందారు. ఇంతకు ముందున్న 010 పద్దును రద్దు చేయడం అన్యాయమని దీంతో నెలనెలా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 010 పద్దును పునరుద్ధరించాలని సీసీఎల్ఏ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపినా ఆర్థిక శాఖ మోకాలడ్డుతోందని, దీన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాము. సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకాశి మాట్లాడుతూ తెలంగాణా తరహాలో వేతనాలు పెంచాలని, పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ధైర్యం అప్పలస్వామి, సత్యనారాయణ, వీరభద్రరావు, మీసాల కృష్ణ మూర్తి, సహాయ కార్యదర్శులు వివేకానంద రాధాకృష్ణలు పాల్గొన్నారు. వీరికి సంఘీభా వంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు వి.ఉమామహేశ్వరరావు, ఎ.వినాగేశ్వరరావు, అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, కె. స్వరూపరాణి, ఎన్.సిహెచ్. శ్రీనివాసరావు పాల్గొని సంఘీభావం తెలిపారు.

రుణాల రద్దులో బ్యాంకుల వైఖరి సహేతుకమేనా?

ముంబై : 'వ్యవసాయ రుణాల రద్దు వంటి పథకాల వల్ల రుణ చెల్లింపు క్రమశిక్షణ దెబ్బతింటోందని, ఇలాంటి పథకాలు అమలు చేయవద్దని ఆర్థిక వేత్తలు, బ్యాంకర్లు తరచు ప్రకటనలు చేస్తుంటారు. అయితే వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకుని, నిస్సిగ్గునా, ఎగవేసి, పరారవుతున్న వారికి మాత్రం బ్యాంకులే 'రుణాల రద్దు'ను ప్రకటిస్తున్నాయి. అవి సాంకేతిక రద్దు మాత్రమే అని, వాస్తవానికి బకాయిదారుకు మాత్రం రుణం రద్దు చేసినట్లు అవ్వదని బ్యాంకర్లు చెబుతుంటారు. సాంకేతికంగా ఎలా చెప్పినా, రుణ రద్దు అన్నది ప్రకటించాక, వందల/వేల కోట్ల రూపాయల రుణం తీసుకున్న ఇతరులకు కూడా ఎగవేయాలన్న ఆలోచన రాదా అన్న ప్ర

ముస్లిం మహిళాసాధికారతే ధ్యేయం

ప్రపంచవ్యాప్తంగా మహిళలు వివక్షకు గురవుతూనే ఉన్నారు. మనదేశంలో అది మరింత ఎక్కువ. మహిళలు పురోభివృద్ధి సాధిస్తున్నారన్నా, రాజకీయాల్లో ముందడుగులో ఉన్నారన్నా అది కేవలం వారి కుటుంబ నేపథ్యంలోంచి వచ్చిదై ఉంటుంది కాని స్వయం సిద్ధంగా అందిపుచ్చుకోవడం దాదాపుగా జరగదు. మెట్టప్రదేశాల్లోనే ఇలా ఉంటే ఈశాన్యరాష్ట్రాల స్థితిగతులు మరింత తీవ్రంగా ఉన్నాయి. అందునా ముస్లిం మహిళల స్థితి మరింత దుర్భరంగా ఉంది. అలాంటి చీకటిలో కాంతిరేఖగా వెలుగుతున్నారు నజీమాబీబీ...పురుషుల గృహహింస నుంచి మహిళలను రక్షించడంతో పాటు ముస్లిం మహిళా సాధికారతే ధ్యేయమంటున్నారు ...

ఇంఫాల్ : మణిపూర్ ఎన్నికల్లో పోటీ చేసి అపజయం పాలైన నజీమా బీబీ తాను గెలుపొందినా, లేకున్నా మహిళలను గృహహింస నుంచి రక్షించి, మహిళాభ్యుదయానికి పాటు పడతానన్నారు. ఎన్నికల్లో పోటీ చేసినందుకు మత పెద్దల నుంచి ఫత్వా అందుకున్న బీబీ మాట్లాడుతూ 'నేను నాజీవితం కోసం బాధపడటంలేదు', ముస్లిం మహిళలకు సమాజంలో గౌరవనీయమైన జీవితం ఇవ్వడమే తన ధ్యేయమని, చిన్ననాటి నుంచి అనేక సమస్యలు ఎదుర్కోవడంతో జీవితం గురించి బెంగలేదన్నారు. ఇరోం షర్మిల పార్టీ పీపుల్స్ రీసర్జెన్స్ అండ్ జస్టిస్ (పీజేఏ పార్టీ) నుంచి ఆమె పోటీ చేశారు. భద్రతా దళాలకు కేంద్రం ఇచ్చిన అసమాన అధికారాలకు వ్యతిరేకంగా షర్మిల చేసిన 16 ఏళ్ల సుదీర్ఘ నిరాహార దీక్ష తనకు నచ్చి ఆమె పార్టీలో చేరానన్నారు. మణిపూర్ మహిళలు మానసికంగా ఎంత ధృడంగా ఉంటారో షర్మిలాను బట్టి తెలుసుకోవచ్చన్నారు. ఎప్పుడైతే ఆమె రాజకీయాల్లోకి వస్తానన్నారో అప్పుడే ఆమెకు బాసటగా నిలవాలని నిర్ణయించుకున్నానని, ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికైతే మహిళా విద్య, సాధికారత, వారికోసం చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పి సమాజంలో గౌరవనీయమైన స్థానాన్ని చేరుకునేందుకు కృషి చేస్తానన్నారు అయితే ఆమె ఓటమితో కోర్కెలు నెరవేరలేదు. బీబీ ఎన్నికల్లో పాల్గొంటాననడం అక్కడ మత పెద్దలకు నచ్చలేదు. దీంతో చనిపోయిన తర్వాత ముస్లిం స్మశానంలో ఆమెకు స్థానంలేదని ఆమె నియోజకవర్గం వబగాయ్‌లోని మత పెద్దలు సెంథెల్ మమంగ్ లీకాయ్ బహిరంగ ప్రకటన చేశారు. స్వగ్రామంలోని ప్రజలు కూడా ఆమెను నిరుత్సాహపరిచారు. నా జీవితకాలంలో ముస్లిం మహిళలు అభ్యున్నతికి పాటుపడటమే నాకు ముఖ్యం. చనిపోయిన తర్వాత ఏం జరిగినా నాకు తెలియదుకదా అన్నారు బీబీ... ఏపనికి ముందుకు వచ్చినా సమాజంలోని కొందరు ఛాందసవాదులు తన దారికి

ఫత్వాలకు భయపడను : నజీమాబీబీ

అడ్డువస్తుంటారన్నారు. సైకిలుపై సదస్సులకు వెళుతుంటే కొందరు గేలిచేస్తుంటారని, నేను ఏం చేసినా వారు నవ్వుతూనే ఉంటారన్నారు.

కుటుంబంలో ఒక్కతే ఆడపిల్లకావడంతో పదోతరగతివరకు చదివించారు. అయితే స్కూల్లో కూడా ఒక్కతే కావడంతో చాలా వేధింపులకు గురయ్యానన్నారు. 10వ తరగతి పూర్తవ్వగానే పెళ్లికోసం ఇంట్లో ఒత్తిడిచేయడంతో ఇంట్లోనుంచి పారిపోయి అంతకుముందు రెండు సార్లు మాత్రమే మాట్లాడిన ఒక వ్యక్తిని పెళ్లి చేసుకుంది. కాని ఆది కాస్తా పెద్ద విషాదంగా మారింది. అతని హింస భరించలేక ఆరు నెలల్లో బయటికి వచ్చేసింది. విడాకుల తర్వాతే ఆమె ఆర్థికంగా స్వశక్తిపై నిలవాల్సిన అవసరాన్ని గుర్తించింది. స్థానిక యువతుల కోసం బియ్యం పొదుపు కార్యక్రమం 'చెంగ్ మరుప్'ను పారంభించారు. ప్రతిరోజు వంట చేసే మహిళలు గుప్పెడు బియ్యాన్ని బీబీ దగ్గర దాస్తారు. వాటిని నెలకు ఒకసారి అమ్మి వంతుల వారీగా డబ్బును తీసుకుంటారు. అలా దొంగతనంతో మా ఆర్థిక అవసరాలు తీరాయన్నారు. ప్రస్తుతం 40ల్లో ఉన్న జీబీ సాయం చేయడంలో ముందుంటూ, మహిళా హక్కులు, లింగ సమానత్వంపై అవగాహన కలిగిస్తున్నారు. మహిళలపై హింస, ఒదిలివేయబడటం, వేధింపులు లేని సమాజం కోసం శ్రమిస్తానన్న బీబీ 2006లో మతపెద్దల ఆగ్రహానికి గురయ్యారు. ఆ గ్రామం మంచినీటి చెరువు నుంచి తాగునీరు తెచ్చుకోకుండా, దుకాణాల నుంచి కొనుగోళ్లు జరపకుండా ఫత్వా జారీ చేశారు. దీంతో ఆమె ఏ మాత్రం వెనక్కు తగ్గలేదు, నాకు మహిళాసాధికారతే ముఖ్యమంటారు. ఎన్నికల్లో గెలిచినా ఓడినా మహిళలకోసం నా కృషి చేయడం మాత్రం ఆపనని బీబీ స్పష్టం చేయడం ఆమె నిబద్ధతకు దర్శనం. ఆమె ఆశయం నెరవేర్చడం కోసం మహిళలంతా ఆమెకు చేదోడువాదోడుగా ఉంటారని ఆశిద్దాం...

హిజాబ్ విమర్శకులకు తిరుగులేని జవాబు

న్యూయార్క్ : ముస్లిం మహిళలు ధరించే ఇస్లామిక్ సాంప్రదాయ వస్త్రధారణ గురించి విమర్శించేవారికి ఒక తిరుగులేని సమాధానాన్ని ధలియా ముజాహిద్ ఇచ్చారు. అమెరికాలో గత అధ్యక్షుడు ఒబామాకు ఆమె సలహాదారుగా పనిచేశారు. ఆ సమయంలో ఒక జర్నలిస్టు ఆమెను విమర్శిస్తూ మీరు చేస్తున్న పనికి, మీ తెలివితేటలకీ, మీ వస్త్రధారణకు పొంతన కుదరడం లేదు అంటూ పరోక్షంగా హిజాబ్‌పై విమర్శలు గుప్పించారు. హిజాబ్ అనేది వివక్షకు ప్రతిరూపంగా అతను భావించాడు. కానీ ధలియా అతని దిమ్మతిరిగి మైండ్‌బ్లాకయ్యే సమాధానం ఇచ్చింది. " పూర్వకాలంలో బట్టలు లేకుండా తిరగడం అనాగరికతకు చిహ్నంగా మనం భావించేవాళ్లం. ఎప్పుడైతే మానవుడు వస్త్రధారణ చేయడం మొదలుపెట్టాడో అతని నాగరికత పెరుగుతున్నట్లుగా మనం చదువుతున్నాం. ప్రస్తుతం నేను నాగరికతకు తారాస్థాయి అయిన బట్టల్ని ధరించారు. ఇది ఉన్నతమైన స్థితికి చేరుకోవడమే తప్ప వెనుకబాటుతనం కాదు. దిగంబరత్వం అనేది అనారికతకు చిహ్నంగా ఉండేది.ఒకవేళ నగ్నత్వం అనేది నాగరికతకు చిహ్నమైతే మనుషుల కన్నా జంతువులు ఎక్కువ నాగరికత కలిగినవే కదా" అంటూ సమాధానం ఇచ్చింది. ఈ సమాధానానికి అటువైపు నుండి తిరిగి ప్రశ్న ఉదయించి ఉండవు కదా!

ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్‌కు అరెస్టు వారెంట్

రా.వా.ప్రతినిధి,మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు : రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ బి.సుభాషణ్ రెడ్డి ముందు హాజరై, లోకాయుక్త కేసులో సరైన వివరణ, నివేదిక సమర్పించనందుకు గాను, మచిలీపట్నం ఎస్.సి కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు లోకాయుక్త అరెస్టు వారెంటును జారీ చేసింది. 27-02-2017న లోకాయుక్త ఈ వారెంట్లను జారీ చేస్తూ కృష్ణాజిల్లా పోలీసు సూపరిండెంట్‌ను అమలుపర్చవలసిందిగా ఆ ఆదేశాలలో పేర్కొన్నారు. ఏప్రిల్ 4వ తేదిన జిల్లా పోలీసు అధికారులు ఈ వారెంటును అమలుపర్చి ఎస్.సి. కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరును రాష్ట్ర లోకాయుక్త ముందు హాజరు పర్చవలసివుంది. స.హ. చట్టం కార్యకర్త బేతపూడి జోగేశ్వరరావుకు ఎస్‌సి కార్పోరేషన్ నుండి ఋణం మంజూరు విషయములో అధికారుల నిర్లక్ష్యంగా వున్నందుకు గాను రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ బి.సుభాషణ్ రెడ్డి ఈ అరెస్టు వారెంటును జారీ చేశారు.

డి.వై.ఇ.ఓలకు లోకాయుక్త సమన్లు

రా.వా. ప్రతినిధి,మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు : మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కార్యలయంలో వున్న బాలభవన్ సిబ్బంది విధులకు హాజరు కాకుండా, లక్షలాది రూపాయల నిధులను అక్రమంగా డ్రా చేసిన విషయమై రాష్ట్ర లోకాయుక్త ఇన్‌స్పెక్షన్ డిప్యూటీ డైరెక్టర్ స్వయంగా విచారణ జరిపి సమర్పించిన నివేదిక మేరకు రాష్ట్ర లోకాయుక్త ముగ్గురు డి.వై.ఇ.ఓ లకు, బాలభవన్ మాజీ సూపరిండెంట్‌కు సమన్లను జారీ చేసింది. కె.ఇ శ్రీనివాసరెడ్డి, డి.వై.ఇ.ఓ, (గుంటురూ ఆర్.జె.డి), పి.వి. ప్రేమానందం, డి.వై.ఇ.ఓ,(రిటైర్డ్ డి.ఇ.ఓ), బి.ప్రభాకర్, డి.వై.ఇ.ఓ,(రిటైర్డ్ సూపరిండెంట్, బాలభవన్, మచిలీపట్నం). పై అధికారులు అందరూ రాష్ట్రలోకాయుక్త ముందు ఏప్రిల్ 12వ తేదిన స్వయంగా హాజరు కావలసివుంది.

ఎల్ఐసీ డివిజన్ కార్యాలయంలో సోలార్ పవర్ ప్లాంటు ప్రారంభం

రా.వా. ప్రతినిధి-మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు : పట్టణంలోని ఎల్ఐసి డివిజన్ కార్యలయంలో రూఫ్ టాప్ 30కెడబ్ల్యూపి సోలార్ పవర్ ప్లాంటును ఎల్ఐసి సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ ఇంజనీర్ పి.కె. సంగం ప్రారంభించినారు. ఈ ప్లాంటు రోజుకు 120 కెడబ్ల్యూహెచ్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. అనగా నెలకు 3600 కెడబ్ల్యూహెచ్ సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేయుటకు అవకాశం ఏర్పడడమే కాక దీని ద్వారా పర్యావరణ పరిరక్షణకు వీలు కలిగుతుంది. ఇంచుమించు నెలకు 2నుండి 3టన్నుల బొగ్గు ఆదా అవుతుంది అని సంగం తెలియజేశారు. ఈ ప్లాంటు ప్రారంభ సభకు మచిలీపట్నం సీనియర్ డివిజనల్ మేనేజర్ సి.బాలయ్య చౌదరి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో ఇటువంటి సోలార్ ప్లాంట్లను మరిన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. కన్నుల పండువగా జరిగిన ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు ఆర్.సి.పళని, ఎ.వెంకట్రావు, ఎన్.మదనాచారి, ఆక్సెస్ సోలార్ పవర్ ప్రాజెక్ట్ హెడ్ బి.శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. జరిగిన కార్యక్రమంలో వేద పండితుల ఆశీర్వచనాలతో చీఫ్ ఇంజనీర్ సంగం సంస్థ అధికారులు, ఉద్యోగులు తదితరులు ఘన స్వాగతం పలికారు. ఓఎస్ మేనేజర్ ఎస్ రామనాథ్‌బాబు వందన సమర్పణతో సభ ముగిసింది.

రాజధాని ప్రాంతంలో అద్దె నియంత్రణ చట్టం

మున్సిపల్ మంత్రి నారాయణ

రా.వా. ప్రతినిధి- అమరావతి : రాజధాని వెలగపూడికి ఇరువైపులా ఉన్న విజయవాడ- గుంటూరు నగరాల్లో ఇంటి అద్దెలు చుక్కలను అంటుతున్నాయని, ప్రభుత్వం అద్దెలను నియంత్రించాలని లేకుంటే సామాన్య ఉద్యోగులు మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని శాసన మండలిలో పలువురు సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ తిప్పేస్వామి విజయవాడలో ఇంటి అద్దెలు పెరిగాయన్నారు. ఈ అద్దెలను నియంత్రించాలని కోరారు. ఇదే అంశంపై ఎమ్మెల్సీ శమంతకమణి మాట్లాడుతూ విజయవాడ- గుంటూరులో డబుల్ బెడ్‌రూమ్ 15వేలు, త్రిబుల్ బెడ్‌రూమ్ ఇల్లు 30వేలు అద్దెలతో చుక్కలను అంటుతున్నాయని, దోమల ప్రజలను కుట్టి రోగాలపాలు చేస్తున్నాయని ఈ అద్దెలు, దోమలు వల్ల ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీరితో పాటు సామాన్యులకు ఇళ్ళు దొరకటమే గగనంగా మారిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితూ హైదరాబాద్ నుండి ఉద్యోగులను వెలగపూడికి రప్పించిన చంద్రబాబు లక్ష్యానికి ఇబ్బందికరంగా మారిందని ఆమె అన్నారు. అద్దెలు చుక్కలను అంటుతున్నాయి, దోమలు నాలా ఉన్నాయి అంటూ వాఖ్యానించారు. సిపిఐ సభ్యుడు పి.జె చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ పై నగరాల్లో దోమలు అన్ని పక్షాల వారిని కూడా ఇబ్బంది పెడుతున్నాయని వాఖ్యానించారు. ఈ ప్రశ్నకు మున్సిపల్ మంత్రి నారాయణ సమాధానమిస్తూ ఏపి అద్దె నియంత్రణ చట్టంను 1960లో రూపొందించారని, అదే చట్టం కొనసాగుతుండగా 2015లో కేంద్రం కొత్త చట్టాన్ని రూపొందించిదని, ప్రస్తుతం డ్రాఫ్ట్ దశలో ఉందని,త్వరలోనే బిల్లును సభలో ప్రవేశపెట్టి అద్దె నియంత్రణ చట్టాన్ని అమలు చేస్తామని చెప్పారు. దోమలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రాజధానిలో పేదల దయనీయ జీవితం

వైసీపీ తాడికొండనియోజకవర్గ కన్వీనర్ హెనీక్రిస్టీనా

రా.వా. ప్రతినిధి - తుళ్ళూరు : రాయపూడిలో పేదల జీవితం దయనీయంగామారిందని వైసీపీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ కత్తెరహెనీక్రిస్టీనా అన్నారు. మూడురోజులు రాయపూడిలో జరిగిన వైసీపీ గడప-గడపకు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రోడ్డ విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయే వారితో ఆమె మాట్లాడారు. మత్స్యకారుల కాలనీలో ఆమె పర్యటించారు.ఇళ్లు కోల్పోయే వారితో నేరుగా మాట్లాడకుండా అధికారులు ప్రకటనలు ఇచ్చి ఊరుకున్నారని బాధితులు వాపోయారు. ఫిషర్‌మెన్ కాలనీలోరోడ్లు సరిగాలేవని వర్షం పడితే నడవలేని దుస్థితి లో ఉన్నామని ఆమెకు తెలిపారు. డ్రైనేజీ సదుపాయం లేదని, రాజధానిలోని పేదల జీవితాలు చూస్తే బాధ కలుగుతుందని క్రిస్టీనా ఈసందర్భంగా అన్నారు. ఎంతో అభివృద్ధి చేస్తామని అధికార పార్టీ పెద్దలు ప్రచారం చేసుకోవటం కాదని, పేదల వద్దకు ఒకసారి వెళ్ళివారి జీవితాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలన్నారు.కార్యక్రమంలో మండల వైసీపి అధ్యక్షుడ బత్తుల కిషోర్, నాయకులు కొప్పులశేషగిరి, రత్తయ్య గుర్నాధం, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీకి నో

న్యూఢిల్లీ : అన్ని రాష్ట్రాల్లోని రైతులకు రుణమాఫీ ఇవ్వడం కుదరదని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ స్పష్టంచేశారు. ఈ ప్రతిపాదనను ఆయన తోసిపుచ్చారు. ఇందుకోసం రాష్ట్రాలు తమ వనరులను వాడుకోవచ్చునన్నారు. ఒక రాష్ట్రానికి ఇచ్చి మరొక రాష్ట్రానికి ఇవ్వకపోవడం కుదరదని జైట్లీ తెలిపారు. 'ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో రుణమాఫీ అంశం చర్చనీయాంశంగా ఉంది. వ్యవసాయ రంగానికి సంబంధించి కేంద్రానికి కొన్ని విధానాలు ఉంటాయి. వాటి ప్రకారమే అవసరమైన మద్దతు అందిస్తాం. అది కొనసాగుతుంది. కానీ రుణమాఫీ కుదరదు ' అని ఆయన చెప్పారు.

2 రోజుల్లో గ్యాస్ కనెక్షన్

రా.వా. ప్రతినిధి- రాయపూడి : దరఖాస్తు చేసుకున్న 2 రోజుల్లో గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయటం జరుగుతుందని ఎంపీడీవో మోహన్‌రావు అన్నారు. రాయపూడిలో 94 మంది పేద కుటుంబాల వారికి పంచాయతీ కార్యాలయంలో గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, అర్హులైన పేద కుటుంబాల వారికి దరఖాస్తు చేసుకున్న వెంటనే గ్యాస్ మంజూరు చేస్తామన్నారు. ఆయా పంచాయతీ ఆఫీసుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. దీపం పథకం కింద ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టినట్టు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పుల్లల పొయ్యి అనేది లేకుండా చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీ జిల్లా నోడల్ ఆఫీసర్ నవీన్‌కుమార్, డి. నితిన్‌కుమార్ గ్రామ వార్డు సభ్యులు ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి, గాదె వెంకటప్పయ్య లబ్దిదారులు పాల్గొన్నారు.

పేదలకు చదువు దూరం

నూజివీడుటౌన్ : వచ్చే ఏడాదొ 23 సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు మూసివేయనున్నట్లు జిల్లా జాయింట్ డైరెక్టర్, ఇన్‌ఛార్జి డీపీఓ పి.ఎస్. ప్రసాద్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 84 సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లు ఉండగా వాటిల్లో 23 హాస్టళ్లను మూసి వేస్తున్నామన్నారు.సంబంధిత విద్యార్థులను గురుకులాలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే జిల్లాలో ఈ ఏడాది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ట్యూషన్ ఫీజు తదితర ఫీజులకు రూ. 60కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ట్యూటర్లను నియమించామన్నారు. పంచాయతీల్లో ఉన్న 14వ ఆర్థిక సంఘం నిధుల నుండి శాశ్వత భవనాలు ఉన్న ఒక్కొక్క అంగన్‌వాడీ కేంద్రానికి మౌలిక వసతుల నిమిత్తం రూ. 50 వేలు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల , మంచి నీటి వసతులు కల్పించేందుకు ఉపయోగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీకు రూ. 90 లక్షలు కేటాయించా మన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 14వ ఆర్థిక సంఘం నుండి రూ. 104 కోట్లు , 13వ ఆర్థిక సంఘం నుండి రూ.17 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు.

స్వచ్ఛ భారత్‌లో అమలాపురం ఫస్ట్

రా.వా. ప్రతినిధి,అమలాపురం, -ఏ.తేజ : రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛభారత్‌పై నిర్వహించిన ఫెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్ 71.43 పాయింట్లు సాధించి అమలాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు కృషిచేసిన మున్సిపల్ ఛైర్మన్ చిక్కాల వినాయకరావును బులియన్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ ఛైర్మన్ ఛాంబర్‌లో బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సన్మాన కార్యక్రమంలో ఛైర్మన్‌ను దుశ్శాలువాలతో సన్మానించి పూలమాలలతో ముంచెత్తి అభినందనలు తెలిపారు. ఛైర్మన్ కృషి, పట్టుదల వల్లే అమలాపురం మున్సిపాలిటీ ఈ రోజు ప్రథమ స్థానంలో నిలిచిందని బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు గోకరకొండ హరిబాబు, బులియన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రేకపల్లి సూరిబాబు, కార్యదర్శి దుర్గాప్రసాద్ గైక్వాడ్, ఉపాధ్యక్షుడు చింతలపూడి సత్తిబాబు, కట్టోజు దాసు, మానే ప్రకాష్, ద్వారంపూడి రెడ్డి, శేఠ్ తానాజీ, వాసిరెడ్డి ఈసు, వాసిరెడ్డి నాయుడు, శేఠ్ శరత్‌తో పాటు వర్తక సంఘాల ప్రతినిధులు దామిశెట్టి గోవిందు, దొమ్మేటి సాయి, పిలకా సత్యనారాయణ, కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీకి కేబినేట్ ఆమోదం

న్యూఢిల్లీ : వస్తు, సేవా పన్ను (జీఎస్‌టీ) బిల్లుకు సంబంధించి నాలుగు చట్టాలకు కేంద్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. జులై ఒకటో తేదీ నుంచి పన్ను సంస్కరణలను చేపట్టేందుకు వీలుగా ఈ బిల్లులను ఈ వారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ఒక దేశం ఒక పన్ను అనే విధానాన్ని అమలు చేసే ప్రక్రియలో కేంద్ర, రాష్ట్రాల పన్నులను ఒకే చట్టం కిందకు తెచ్చే ప్రక్రియలో భాగంగా ఈ పన్నుల సంస్కరణలు తల పెట్టారు.ఎక్సైజ్ సుంకం, సేవా పన్నులను వంటి కేంద్ర పన్నులను, రాష్ట్రాల లెవీలైన వ్యాట్ పన్నును ఏకీకృతం చేసి దేశమంతా ఒకే పన్ను విధానాన్ని ప్రవేశపెడతారు. ఇప్పటికే నాలుగు అంచెం పన్ను విధానాన్ని జీఎస్‌టీ మండలి ఆమోదించింది. ఈ నాలుగు అంచెల్లో ఐదు, పన్నెండు, పద్దెనిమిది, ఇరవై నాలుగు శాతం పన్ను ఉండేందుకు వీలుగా ఈ నాలుగు చట్టాలని రూపొందించారు. ఈ బిల్లుల ప్రకారం అయోగ్య వస్తువులైన విలాసవంతమైన కార్లు, శీతల పానీయాలు, పొగాకు సంబంధిత ఉత్పత్తులపై అదనపు సెస్సు విధించడానికి కూడా జీఎస్‌టీ మండలి ఆమోదం పలికింది.

ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షత వహించిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో జీఎస్‌టీకి చెందిన నాలుగు బిల్లులైన - కేంద్ర వస్తు, సేవా పన్ను బిల్లు 2017 (సీజీఎస్‌టీ బిల్లు), సమగ్ర వస్తు, సేవా పన్ను బిల్లు 2017 (ఐజీఎస్‌టీ బిల్లు), కేంద్ర పాలిత వస్తు, సేవా పన్ను బిల్లు 2017 (యూఈజీఎస్‌టీ బిల్లు),వస్తు సేవా బిల్లు (రాష్ట్రాలకు పరిహారం) బిల్లు 2017 (పరిహారం బిల్లు)కు ఆమోదం పలికిందని అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ వారంలో ఈ బిల్లులను ద్రవ్యబిల్లుగా పార్లమెంట్‌లో ప్రవేశపెడతారని, సాధ్యమైతే ఈరోజే ప్రవేశపెడతారని ఆ ప్రతినిధి చెప్పారు. ఈ నాలుగు బిల్లులకు కలిపి ఒకేసారి చర్చ జరిగే అవకాశమున్నది మంత్రివర్గ సమావేశానికి ప్రధాని అజెండా జీఎస్‌టీ బిల్లులకు ఆమోదించడమేనని అధికార వర్గాలు తెలిపారు. దేశంలో పెద్ద సంస్కరణ ప్రక్రియగా భావిస్తున్న జీఎస్‌టీ బిల్లును సాధ్యమైనంత త్వరలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, జీఎస్‌టీని జులై ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకురావాలని జీఎస్‌టీ మండలి నిర్ణయించింది. ఈ నాలుగు చట్టాలకు ఈ నెలలో రెండు విడతలుగా జరిగిన జీఎస్‌టీ మండలి ఆమోదం పలికింది. సీజీఎస్‌టీ చట్ట ప్రకారం,అంతరాష్ట్రాలకు సరఫరా అయ్యే వస్తువులు, సేవలుకు సంబంధించి పన్ను విధించడం, వసూలు చేయడం కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. అలాగే, రాష్ట్రానికి, రాష్ట్రానికి మధ్య సరఫరా అయ్యే వస్తువులపై పన్ను విధింపు. వసూలు బాధ్యత రెండూ కేంద్రపైనే ఉంటాయి. కేంద్రపాలిత ప్రాంతాలకు సరఫరా అయ్యే వస్తువులపై రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు విధించే పన్ను వసూలు బాధ్యత కేంద్రంపై ఉంటుంది. జీఎస్‌టీని అమలు చేయడం వల్ల రాష్ట్రాల ఆదాయంలో కలిగే నష్టాన్ని భర్తీచేసేందుకు ఐదేళ్ల పాటు పరిహారం చెల్లించేందుకు పరిహార బిల్లు ఉద్దేశించారు. ఈ నాలుగు బిల్లులకు పార్లమెంట్ ఆమోదం లభించిన తరువాత ఆయా రాష్ట్రాల శాసనసభల ఆమోదం పొందాల్సి ఉంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత చేపడుతున్న అత్యంత పెద్దదైన ఈ సంస్కరణ బిల్లుల ఫలితంగా ఆర్థికాభివృద్ధిలో కనీసం 0.5 శాతం ఉంటుందని భావిస్తున్నారు. జీఎస్‌టీ బిల్లు సకాలంలో ప్రవేశపెడుతున్నారని, జులై ఒకటో తేదీ వాస్తవాలకు రూపమిస్తుందని ఖైతాన్ అండ్ కో భాగస్వామి అభిషేక్ రస్తోగి విశ్వాసం వ్యక్తంచేశారు.

టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా యాళ్ల నాగవెంకటసతీష్ ఏకగ్రీవ ఎన్నిక

రా.వా. ప్రతినిధి అమలాపురం -ఏ.తేజ : అమలాపురం పురపాలక సంఘ పరిధిలో గత పురపాలక ఎన్నికల్లో 4వ వార్డు నుండి కౌన్సిలర్‌గా గెలుపొంది మున్సిపల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన యాళ్ల మల్లేశ్వరరావు మృతి చెందడంతో ఆ వార్డుకు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఉప ఎన్నికల నేపథ్యంలో యాళ్ల మల్లేశ్వరరావు తనయుడు యాళ్ల నాగవెంకట సతీష్‌ను టిడిపి తమ అభ్యర్థిగా ఎంపిచేసి ఎన్నికల బరిలో దింపింది. అయితే తెలుగుదేశం పార్టీ అభ్యర్థికి అన్ని పార్టీలు మద్దతు పలకడంతో సతీష్ నామినేషన్ ఒక్కటే దాఖలు కావడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. 4వ వార్డు కౌన్సిలర్ ఎన్నికకు సంబంధించి తెదేపా 4వ వార్డు కమిటీ సమావేశం డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు స్వగృహం వద్ద జరిగింది. ఆ వార్డులోని తెదేపా నాయకులంతా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 4వ వార్డు తెదేపా కౌన్సిలర్ అభ్యర్థిగా దివంగత మున్సిపల్ ఛైర్మన్ యాళ్ల మల్లేశ్వరరావు తనయుడు యాళ్ల నాగసతీష్‌ను ఎమ్మెల్యే ప్రకటించారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మెట్ల రమణబాబు మాట్లాడుతూ మల్లేశ్వరరావు మరణానంతరం వారి కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు నాగ సతీష్‌ను కౌన్సిలర్ అభ్యర్థిగా ప్రకటించారు. యాళ్ల నాగసతీష్‌ను కౌన్సిలర్‌గా ఏకగ్రీవం చేసినప్పుడే దివంగత ఛైర్మన్ మల్లేశ్వరరావుకు ఘనమైన నివాళి అని, పార్టీలకతీతంగా ఈ కౌన్సిలర్ ఎన్నిక ఉండాలని సూచనప్రాయంగా రమణబాబు తెలియజేసారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ ఏకగ్రీవం చేసేందుకు నాగసతీష్‌తో పాటు తెదేపా కేడర్ అంతా పనిచేయాలని, అంతేకాకుండా ప్రధాన పార్టీలతో పాటు ఎవరూ పోటీకి దిగకుండా ఆయా పార్టీల నేతలందరినీ ముందస్తుగా తెదేపా తరపున ఒక బృందం కలిసి మంతనాలు జరిపారు. భారతీయ జనతాపార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల నేతలను కలసి దివంగత మ

ఎన్. గోపి 'జలగీతం' మానవీయ మహాకావ్యం

'నానీలకు నాన్న' గా గుర్తుకు వచ్చే 'ఎన్‌గోపి' నేను సమీక్షించిన ప్రతి నానీ గ్రంథ పరామర్శలోనూ ఆయన్ను ప్రత్యేకంగా పేర్కొనటం జరిగింది. సాదాసీదాగా ఉండే గోపీలో ఒక మహాకవి, విశ్వవ్యాప్తమైన కీర్తికాంతులతో ప్రభవిస్తున్నాడని అందరూ గుర్తించలేరు. అలా గుర్తించాలంటే ఆయన సాహిత్య తపోఫలాలు గా చెప్పదగిన గ్రంథాలను అధ్యయనం చేయాలి. మరీ ముఖ్యంగా 'జలగీతం' కావ్యం. సాహిత్యంలో ఇది చరిత్ర సృష్టించింది.ప్రముఖమైన ప్రపంచ భాషల్లోకి అనువదించ బడిన ఒకే ఒక భారతీయకావ్యంగా చెప్పవచ్చునను కొంటాను. ఈ రికార్డు ఒక 'ప్రపంచరికార్డు'గా గుర్తింపు పొందినా ఆశ్చర్యం లేదు.

'జలగీతం' 15 సం॥ల క్రింత గోపీ కవితాహృదిలోంచి అమృతధారలాగ ప్రపంచ సాహిత్యంలోకి ప్రవహించింది. ఇప్పటివరకు జలగీతం – హిందీ (జలగీత్ –ప్రొ ॥ మాణిక్యాంబ, హైదరాబాదు) , ఇంగ్లీషు (వాటర్ సాంగ్ – ప్రొ॥ అల్లాడి ఉమ, ప్రొ.ఎం. శ్రీధర్, హైదరాబాదు), మరాఠీ (పాణ్యాచగాణ – నిరంజన్ ఉజ్‌గరే, ముంబయి), గుజరాతీ (జళగీత్ – రమణిక్ సోమేశ్వర, బరోడ్రా), ఉర్దూ (నగమ్ –ఎ–ఆబ్, ప్రొ. రహమత్ యూసుఫ్‌జాయ్, హైదరాబాద్), కన్నడం (జలగీత్–డా ॥ మార్నాపురం శ్రీనివాస, బెంగుళూరు), మలయాళం (జలగీతం– ఎల్.ఆర్. స్వామి, విశాఖపట్నం), పంజాబీ (జళ్‌గీత్ – స్వరణ్‌జిత్‌సవి, లూథియానా), పర్షియన్ (నగమ –ఎ–ఆబ్, అజీజుద్దీన్ అహమద్ ఉస్మానీ), ఇవిగాక ఒరియా, సంస్కృతభాషల్లోకొ అనువాదం అయింది. ముందు ముందు మరెన్ని భాషల్లోకి జలగీతం ప్రవహిస్తుందో మనం వేచిచూడాల్సిందే. తాజా సమాచారం ప్రకారం రాజస్థానీభాలోకి అనువాదం చేయబడి, ప్రచురణకు సిద్ధంగా ఉంది. గోపి సాహిత్యవృక్షం బహుశాఖలతో విస్తరించింది. కవిత్వం, విమర్శ, పరిశోధనాత్మక రచనలు, యాత్రా చరిత్రలు, ఇతరాలు (వేమన్న వేదం, జ్ఞానదేవ, అక్షరయానం, తన్మయధూళి, పాళ్య పుస్తకాలు) .. ఆయన కాలాన్ని నిద్ర పోనివ్వడు. అక్షరం కూడా ఆయన్ను నిద్రపోనివ్వదు.

అక్షరాలు సాహిత్య జీవులకు తరగని సిరులు, అమృతబిందువులు. కవి భౌతికంగా లేకపోయినా – అక్షరాలు మళ్ళీ మళ్ళీ జీవింపజేస్తునే ఉంటాయి. గోపీ ఇప్పుడు విశ్వకవి. జలగీతం లాగానే ఆయన నానీలు పదకొండు భాషల్లోకి, కాలాన్ని నిద్రపోనివ్వను (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన గ్రంథం) – ఇరవై భాషల్లోకి, మరో నాలుగు భాషల్లోకి ఇతర రచనలు అనువదించబడ్డాయి. (ఉర్దూ–గోపీకీ సౌనజ్‌మే, హిందీ–గోపీకీ కవితా, ఇంగ్లీషు–యాన్‌అదర్ స్కై, హిందీ–గోవా, మై జౌర్, సముద్ర్)

గోపీ కవితా దృష్టి అంతా మానవీయతమీదనే కేంద్రీకరించి ఉంటుంది.నల్గొండలోని ఫ్లోరైడ్ కాలుష్య బాధితుల దయనీయ జీవితాలు, అతి పవిత్రంగా, పరిశ్రు భంగా ఆకాశం నుండీ నేలకు దిగివచ్చిన నీటి ముత్యాలు, పారిశ్రామిక కాలుష్యాల బారినపడి విషతుల్యంగా మారిపోవటం– గోపీని కలచివేసిన దృశ్యాలు.

వేదవ్యాసుడు అంతరిక్షంలో ఆత్మరూపంలో స్థితుడై, త్రికాల దర్శనంతో అద్భుత రచనలు చేసినట్టు, గోపీ అంతర్చక్షువులతో జలవిశ్వరూపాన్ని అణువణువు దర్శించి, అక్షరాలలో ఆవిష్కరించడం మనం 'జలగీతం'లో చూడవచ్చు. ఇరవై ఏడు నక్షత్రకాంతుల్లా 'జలగీతం' –27 అధ్యాయాల్లో వివిధ గమనరీతుల్లో మనకు సాక్షాత్కరిస్తుంది. ఏ అధ్యాయం చదివానా మనం జలగీతఝరిలో కలిసిపోతాం. అస్తిత్వం కోల్పోయి, అక్షరాలుగా మారిపోతాం. ఈ కావ్యంలోని ప్రత్యేకత ఇదే. ఆధునిక కావ్యాలలో 'జలగీతం' అగ్రపీఠం అలంకరించడానికి కారణాలు మనకు చాలా కనిపిస్తాయి. అవన్నీ 'జలగీతం' చదువుతున్నప్పుడు స్ఫురిస్తాయి.

నేను 'జలగీతం' అధ్యయనం చేశాను. అంటే పేజీలు తిరగెయ్యలేదు. చూపులను అక్షరాలమీద దొర్లించలేదు. ప్రతి అక్షరాన్నీ ఆత్మతో ఆస్వాదించాను. అలా చేశాను గనుకనే ఈ వ్యాసం రాయగలుగుతున్నాను.ఈ కావ్యంలో కమనీయ కవిత్వమొక్కటే లేదు. భావసౌందర్యం, పదచిత్రాలు, చమత్కృతులు, సరికొత్త వ్యక్తీకరణలు – ఇవన్నీ ఎవరైనా ప్రయత్నిసార్తు. కానీ, గోపి ఈ కావ్యంలో వైజ్ఞానిక అంశాల ప్రస్తావన అతి సూక్ష్మంగానేగాక, శాస్త్రజ్ఞులను సూటిగా ప్రశ్నిస్తూ, తట్టిలేపటంగా చూస్తాం. కావ్యం ముగింపు శిఖరాయమానంగా ఉంది. ఆకాశమంత విషయాన్ని అతి సునాయాసంగా అద్దంలో చూపగలిగిన గోపికి అనేక అవార్డులు, రివార్డులూ వరించడంలో ఆశ్చర్యం ఏముంది?'జలగీతం' గురించి విశ్లేషించాలంటే, ఆ కావ్యానికి రెట్టింపు గ్రంథం అవుతుంది. అలాగని కావ్య పరామర్శను విస్మరించలేము. ఎందుకంటే– రసరమ్య కావ్యాల గురించి తెలుసుకోవటం రసజ్ఞుల హక్కు. పరిమితులను దృష్టిలో ఉంచుకుంటూ 'జలగీతం' రసనాదాలను పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను.

'ఏ బ్రహ్మాండాల నుంచి/వొలికి పడ్డాయో నీళ్లు/ ఊహలో పట్టని/ ఏ వైశాల్యాల గుండా/ వీడి చిరంతన ప్రయాణమో/ ఏ విశ్వాంతరాళాల/ ఆదిమ శబ్దాలను మోసుకొచ్చాయొ..'ఇలా మొదలై, జలపాతంలా ఉన్నత భూమిక నుండీ ఉధృతవేగంతో దుమికి రమ్యంగా సాగిపోతుంది 'జలగీతం' కావ్యఝరి. గోపీది మానవీయ మమత. అందరూ నా వాళ్లే, అందరి బాధనాదే, అందరూబావుండాలి – అనుకోవడమే మానవీయత.

గోపి కవిత్వం చదువుతున్న కొద్దీ సహజత్వం ప్రస్ఫుటమౌతూ ఉంటుంది. గోపీకి సమాజం ఒక మహాలయం. మనసంతా ప్రేమ నింపుకుని సృష్టిలోని అణువణువునూ ప్రేమిస్తాడు. అంచులు నిండిన ప్రేమ ఉన్నప్పుడే అందమైన కవిత్వం ఉద్భవిస్తుంది. గోపి కవిత్వమంతా అందం , ఆనందాల విందే. ' ఈ నీలి నీలి గోళంతొ పాటు / అతిథిగా విచ్చేసిన / ఓ అపురూప జీవకణమా / అంటూ కని నేరుగా నీటితోనే సంభాషిస్తాడు. కొన్ని ప్రయోగాలు మన్నలి అబ్బురపరుస్తాయి. 'నవ్వు స్పృశించగానే / వసుంధర నిత్య బాలింతగా మరింది' తడి తగులున్నంతసేపూ పుడమి పచ్చదనాన్ని ప్రసవిస్తూనే ఉంటుంది. అదే 'నిత్యబాలింత ' అంతరార్థం.

ప్రతి జలాశయం / ఒక గర్భాశయం.. నీ విహారం.. భూమిని జలచర్మధాణిగా మార్చే సింది..' ఇది కవితాదృష్టికి మాత్రమే గోచరించే దృశ్యం.

'పేరుకే సప్తసాగరాలు / ఉన్నది ఒకే ఒక్క జలమహానిధి' – సముద్రల మధ్య సరిహద్దు లెక్కడున్నాయి భావరేఖలు తప్ప?!

'వాగుల గిన్నెలతో/ నదులు పెదవులు తడుపు కున్నాయి' – వాగులనీళ్లునదికి పెదవుల తడిలాం టివి. 'జలం ఒక సంస్కృతి / జలం ఒక చారిత్రక కృతులన్నీ జలానుబంధ జన జీవనగాథలే.

'మేఘాలు కడలికి పుట్టిన వెచ్చని బిడ్డలు / ఆకాశంపెంచిన నీలికురుల అమ్మాయిలు మేఘాలు' – ఎంత కళాత్మక భావనో చూడండి. 'వర్షాన్ని (ప్రసవించి) మేఘాలు తనువు చాలించాయి' – మేఘాలకు తనువు నిచ్చేది, తనివి తీర్చేది జలమే. 'మబ్బులు అల్పాయుష్కులేకాని/ భూమికి/ ఆయుష్షును త్యాగం చేసే మబ్బుల త్యాగం గురించి ఇంత కన్న గొప్పగా ఏమి చెప్పగలం?

'సతతం సంతానాన్ని పోగొట్టుకున్నా నిగనిగ లాడే నిత్య చూలింత సముద్రం' – చేపల్ని సముద్రంనుండీ వేరు చేస్తున్నా, కొత్త చేపలు పుడుతూనేఉంటాయి అనే వాస్తవానికిది రూపకల్పన. గోపి సముద్రాన్ని 'చలనయోగి' అంటాడు. మౌనగంభీరంగా, యోగిలా సముద్రాన్ని చూడగలగటం కవితాదృష్టి, కళాత్మకత కూడా.

గోపీకిసముద్రం 'ఒక మహాపద్యం' గా కన్పించిందంటే, అది అతడిలోని మహాకవి చూస్తున్న దృశ్యం. కవి ఎటుచూసినా చంధస్సు, అక్షర రూపాలు, లయాత్మక నిశ్శబ్ద సంగీతాలే విన్పిస్తాయి చిత్రకారుడికీ అంతే, కవిలో చిత్రకారుడుంటాడు. చిత్రకారుడిలో కవి ఉంటాడు. వీరిద్దరి మనసుల్లో లయబద్ధ సంగీతం ఉంటుంది.

'అప్పుడుప్పుడు / కెరటాలు గుర్రాలై / తాళ ప్రమాణ ఉత్తేజాలై/ వాయుఖడ్గ ప్రహారాలై / ఉద్రేకమూర్తిగా మారుతుంది సముద్రం'.

'ద్రవమే కదా అనుకుంటే ఎలా ? హద్దు దాటిందంటే / కబళించే ఉపద్రవం కూడా' – దివిసీమ ఉప్పెన , జపాన్ సునామీల విలయతాండవం యీ పదాల్లో ప్రత్యక్షమౌతాయి. 'స్వతహాగా సముద్రం / గతవర్తమానాలను / తీరిగ్గా కలిపి కుట్టుకునే విశ్వగృహిణి' – 'జలదర్పణంలో / గతించినజ్ఞాపకాలను చూసుకుంటూ / ఎవరూ దర్శించని / తన అట్టడుగు రహస్యాలను తడుముకుంటూ / నిరంతరం శ్వాసిస్తుంది సముద్రం / ఎగిసి పడే రొమ్ములోత్తో'

కవి మనసు ఒక విషయం మీద లగ్నమైతే, దానిని అన్ని కోణాల నుండీ దర్శించటం, దర్శింప జేయడం జరిగిపోతాయి.

కొన్ని ప్రత్యేక ప్రయోగాలు గోపికలానికే స్వంతం– మరకతాలహరితాలు / జలచక్రం / కర్మసాక్షి నక్షత్రం / సూర్యుడి జ్వాలానేత్రం / చక్రధారి భానుడు...

'జలగీతం' మనల్ని కలహంసలా మార్చేస్తుంది. మన ప్రమేయం లేకుండానే ఒక విస్మయాత్మక, ఆనందావర్ణవ, రసాత్మక జగతిలోకి మెల్ల మెల్లగా జారిపోతాం.

మార్పు ప్రకృతికి సహజ లక్షణం. మార్పులోని మార్పుని కూడా గోపి కవిత్వనేత్రాలు పసిగట్టడం విశేషం. మంచు గురించి చెబుతూ 'ఇంకా పసుపు పూయని తెల్లని బంగారం / ఆకాశం ముంగురుల నుండీ రాలిన ధవళపుష్పం' అంటూ మనల్ని తన భావలోకంలోకి నడిపిస్తూ 'కిటికీలకు లేసులల్లుతుంది, వాడిన చెట్ల ముఖాలపై ముత్యాలు చల్లుతుంది' అంటాడు గోపి.ఇంతటి సుందర హిమంగర్జిస్తే – భూమండలం ముక్కలౌతుంది. సంతులం తునాతునకలౌతుంది' – అంటూ మంచుతుపానుల బీభత్సాలను కళ్లకు కట్టిస్తాడు.

'నీటి స్వప్నం' ఒక విలక్షణ ప్రయోగం. కవిత్వ రచనా సమయంలో కవి ఒక తన్మయ ధ్యానస్థితిలో ఉంటాడు. పరిసరాల స్పృహ ఉండదు. తనదైన భావజగతిలో లీనమై ఉంటాడు. అక్షరాలు భావాల శ్వాసతో కలంలోంచి ప్రవహిస్తాయి. కవి అనుకుని ఏ పదప్రయోగమూ చెయ్యడు, చెయ్యలేడు. అవి ఆ క్షణంలో ప్రకటితమయ్యే సద్యోజాతాలు.గోపి పదవిన్యాసాలన్నీ యీ కోవకు చెందినవే.

'భూసారం/ వొంటినిండా ఇమిడిపోయి / బీజాక్షరాలతో / సస్య సంగీతాల సంగీతం వ్యాపిస్తుంది / నింగికి వలసబోయిన జీవసలిలం / ఇంటికి చేరి తొణికిస లాడుతుంది / అన్నం పెట్టిన చేయిని చూసుకొని /తీయని నిట్టూర్పు నీరు '.

– ఇదంతా కమనీయ జలచక్ర భ్రమణగీతం. నీటి వేలిముద్రలు, నిప్పు బంతి– గోపి కవిత్వంలో దొరికే తెలుగు వెలుగు జిలుగులు. మనల్ని మురిపించి, మైమరపించి, ఆర్ద్రతతో కరిగించి ప్రవహింపజేయగలదే మంచికవిత్వం.

'అదిగో భూమాత / ధగధగ మెరిసే వాతావరణ పరీత / ధవళ ధవళ జలదావృత / నీలినీలి సముద్ర సముపేత / హిమరత్న ఖచిత సంపత్సమేత' ఇలా ఉంటుంది గోపి కవిత్వ పటుత్వ సంపద, మంటల పెదవులు / మేఘాల పెదవులు – అరుదైన భావచిత్రాలు, సృష్టిగమనానికి నీళ్లే కాళ్లు. నిజమే కదా ?

× × × × ×

జలానికి చినుకులు బీజాక్షరాలు, చినుకుల అక్షరాలతో జలం కావ్యంగా మారిపోతుంది. గోపి అంటాడు – 'మబ్బు కొంగును వదిలేసి చినుకు అపార పారా వారాన్ని (దీన్నే గా చెబుతారు) చేరగానే అస్తిత్వం అదృశ్యమైపోతుంది. ముత్యపు చిప్పలో పడిన చినుకు శాశ్వతవ్యక్తిత్వాన్ని (మురిపించే ముత్యంగా) పొందుతుంది.

'అడవిలో రాలిన చినుకు చిగురై కులుకుతుంది / చినుకు రాగాన్ని మార్చుకుని పాటకు మరోచరణంలా మారిపోతుంది / చినుక్కు మరణం లేదు'.

చినుకుఅనేక రూపాంతరాలు చెందుతూ, చిరంజీవిగా ఉండిపోవడం స్ఫురింపజేస్తుందీ వాక్యం. 'వేల వేల కంఠాలనిర్వేల సంగీతం నీరు / తరగని స్వరనిధినీరు/ వొళ్లంతాపాదాలతో నర్తించే జలాంగణ నృత్యహేలను రెండుకళ్లు పట్టుకుంటాయా?' అని ప్రశ్నిస్తాడు కవి. 'ఏకకాలంలో పాడుతూ ఆడే విశ్వనాట్య మయూరి నీరు / క్షణ క్షణ పరివర్తిత వర్తన మీ జలనాట్యం – జలగీతం నాదబిందుమయం....' నీటి విశ్వరూపాన్ని కవి ఎంత రమ్యంగా ఆవిష్కరించాడో ఇక్కడ మనం చూడవచ్చు. జల సౌందర్యమంతా కవితా సౌందర్యంలో కలగలిసి పోయి, చదువుతున్న కొద్దీ రసరమ్యంగా, ఆహ్లాదంగా అలరిస్తుంది. జలరూపంలో గల స్వేదాన్ని కూడా కవి మర్చిపోలేదు. 'శ్రమలో పుట్టిన / ఈ లవణ మహాసముద్రం / ఏ శక్తిజలానికిప్రతీక? – చెమటనీరు చేతికందకపోతే / అది కన్నీరుగా పరిణామం చెందుతుంది... పదార్థ స్వభావంలో పరమార్థాన్ని గ్రహించండి...'శ్రమఫలం దక్కకపోతే బీద గుండె దు:ఖిస్తుంది కదా? కాబట్టి పదార్థ స్వభావంలో పరమార్థాన్ని గ్రహించమంటున్నాడు కవి. తొమ్మిదవ అధ్యాయంలో – 'ఆత్మ ప్రక్షాళనం చేసే / బోధ గురువునీరు/ నీటి తళుకులు ప్రసారంచేసే/ నిశ్శబ్దపుగుసగుసలు / గుండెఅడుగును స్పృశిస్తాయి / గొంతులోకి / మెత్తగా జారే జీవధార / నీరంటే సవసవల భాషేవా/ అనుభవంలోకి వచ్చిన / అవ్యక్త అద్భుత సౌందర్యకాంతికదా నీరు'

సవసవలభాష / సౌందర్యకాంతి – మనం గమనించాల్సిన కొత్త ప్రయోగాలు. వేళ్ల తాళ్లు పట్టుకుని / ఆకుల దాకా ఎగబాకి / పండ్ల కడుపులు నింపే ..ఇక్కడ కవి అదృశ్యంగా నీటితోబాటు పయనిస్తాడు. 'తడి దాని ఒడి / ఒడి నిండా స్పర్శానుభూతుల సందడి/ తేమ దుప్పటి కప్పుకుంటే / ఎండగుండె కొంత మెత్తబడుతుంది..' – సమస్త సృష్టిల్లోని ధ్వని సర్వస్వమంతా / నీటినోటిలో నిక్షిప్తమై ఉంది .... ' 'రాయి విసిరితే/ ఓ గుడ్రని నవ్వుని ప్రసాదించే / ఈ చిత్త ప్రశాంతత ఎక్కడిది?"

'గాయం చెయ్యకుండా/ రాతిని నునుపుగా చెక్కే / ఆ మెత్తటి ఉలి ఎప్పటిది ?' జలాన్ని 'అనుదిన వికసిత/ వినూత్న పుష్పాల వనవాటికవే' అంటాడు.

× × × × ×

ప్రతి అధ్యాయమూ అధ్యయనం చేయతగ్గదే! పదవ అధ్యాయంలో నీటికి ఆవాసమైన కుండతో – 'నీ మట్టికి తడిని దానం చేసింది నీరే' అంటాడు. నీటి స్పర్శతోనే మట్టి కుండగా రూపాంతరం చెందుతోంది మరి. ' నాగరికతను / సాలగ్రామంగా తీర్చిన క్రమం' – ఎంతో గూఢార్థం ఉంది ఇందులో. నదీ సూత్రం– మనుషుల్ని, పక్షులు, పశువులూ , కీటకాలూ అన్నింటినీ కలిపింది. అన్నీ జలాంకిత ప్రాణులే. సైబీరియా – కొల్లేటి కొంగలది జలానుబంధమే ! గోపి కవిత్వం చలనచిత్రంలా, సజీవగమనంతో, కావ్య వస్తువులోని అన్ని కోణాలనూ దర్శింపజేస్తుండటం మనం స్పష్టంగా చూడవచ్చు.

'మనిషి నవమాసాలు ఈదేది ఉమ్మనీటిలోనే ' – జన్మతోనే నీటితో అనుబంధం మనిషిది. అటుపైన అంతిమశ్వాస వరకు నీటితోనే మనిషి జీవితం. ' నదీతీరాల్లోనే కదా/ సాహిత్య కేదారాలు మొలకెత్తింది' అంటూ వాల్మీకి, కాళిదాసుల కవిత్వ ఘనతల్ని తనదైన శైలిలో నదీ జలాలతో అనుసంధిస్తూ అద్భుతంగా చెప్తాడు గోపి. కవి ఏ చిన్న విషయాన్నీ విస్మరించకుండా, జల స్వరూపాన్ని అణువణువు దర్శిస్తూ, దర్శింపజేస్తూ చేసిన కావ్యగానం అజరామరత్వాన్ని వరంగా పొందిందని చెప్పవచ్చు. కావ్యంలో ఏ వాక్యానికి ఆ వాక్యం, ఒక బంగారు జలతారులో ఏ తీగె లాగినా మెరిసిపోతు కన్పించినట్లు, ఆకట్టు కుంటుంది. కావ్యం ముగిస్తూ 'జలం ఎలర్టు' ప్రకటించమంటాడు గోపి. అంతరించి పోతున్న అమూల్య సంపదల్లో జలం ముఖ్యమైంది. అన్నిటికీ ప్రాణదానం చేసే జలాలు ప్రాణ ప్రమాదంలో పడ్డాయి. తక్షణం మానవజాతీ జాగృతం కావాల్సిన తరుణం ఇదే.

అందుకే సరైన సమయంలో సరైన కవితా వస్తువును స్వీకరించి చిన్న కవితతో సరిపెట్టకుండా, 'జలగీతం' గా ఒక మానవీయ మహాకావ్యాన్ని రచించి, గోపి పెనునిద్దుర నుండీ మానవాళిని ఉరుములు, మెరుపులతో ఉలిక్కిపడేలా మేల్కొలిపాడు. ఈ గీతం విశ్వజనీనం. సర్వకాలీనం సమస్త మానవజీవనానికి సంబంధించింది. ఇంకా చెప్పాలంటే సర్వ ప్రాణులకూ సంబంధించింది. అయితే, అసలు అపరాధి మనిషే.

మనిషిలోని నిర్లక్ష్యం, నేర స్వభావం తెలిసి తప్పులు చేయిస్తోంది. మనిషే తనను తాను సరిదిద్దుకోవాలి. సంకల్పం బలంగా ఉంటే జలసమస్యకి పరిష్కారం సుసాధ్యమే. ఇంత అద్భుతంగా 'జలగీతం' గానం చేయటం ఎంతో పరిణితి గల గోపీలాంటి కవి మాత్రమే చేయగలడు. బహుళ జలం గురించి చెప్పటానికి ఇంకేమీ మిగిలినట్లు లేదు. అక్షర తపస్సులైన అవధానులు ఎంత వేగంగా, చమత్కారంగా , ధాటిగా, మధురంగా, ఛందస్సు తప్పకుండా పద్యకవిత్వం చెప్పగలరో, గోపి అవతకు ఏమాత్రం తీసిపోని ప్రజ్ఞతో ఈ 'జల గీతం' కావ్యగానం చేశాడు. గోపి పద్యాలతోనే సాహిత్య జగత్తులో పౌరసత్వం తీసుకున్న విషయం చాలామందికి తెలియకపోవచ్చు. పద్యానికి ఛందస్సు చట్రం ఉంది. గద్యానికి పరిధులు లేని స్వేచ్ఛఉంది. మనసువెంటే భావాత్మకభాష పరుగులుతీస్తుంది. ఎన్నివిన్యాసాలు చేసినా అందరికీ అర్థం కాగల సౌలభ్యం ఉంది వచన కవిత్వానికి.

గోపి రచన 'కాలాన్ని నిద్రపోనివ్వను' గ్రంథం కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డును పొందడంతో పాటు, ఇరవై భారతీయ భాషల్లోకి అనువదింపబడింది. నానీలు పదకొండు భారతీయ భాషల్లోకి అనువదించబడినాయి. 'నానీ' ల స్ఫూర్తి ఎందర్నో కవులుగా రాణింపజేస్తోంది. వారంతా ఆయన కుటుంబమే. గోపీ కవిత్వంలో 'తనదైన ముద్ర' కన్పిస్తుంది. అది ఆకట్టుకుంటుంది. మళ్లీ మళ్లీ చదివిస్తుంది. ఆ పుస్తకాన్ని భద్రపరా దాచుకోవాలని పిస్తుంది. అప్పుడప్పుడు మనసు శూన్యంగా, బేలగా, ఏకాంతంగా వేదన చెందుతుంటే , మనకు గోపీ కవితలు చప్పున గుర్తొస్తాయి. వెంటనే చదవడం మొదలెడతాం. గోపి మన ఎదుటే కూర్చుని ఉంటాడు. కావ్యగానం మొదలెడతాడు.

కోయిలలా మనసులోకి వసంతాన్ని కమ్మగా కుమ్మరిస్తాడు. మళ్లీ మనసు కోలుకుంటుంది. 'ఫోనిక్స్‌పక్షి'లా రెక్కలు అల్లలార్చి ఉత్సాహంగా ఎగురుతుంది. సజీవకవిత్వంలో ఈ శక్తి ఉంటుంది. తెలుగువారు గర్వించే మహాకవి గోపీకి, ఈనెల 26న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ వారు ప్రదానం చేస్తున్న 'స్ఫూర్తి' అవార్డు (మూడున్నర లక్షల రూపాయలు) సందర్భంగా, ఆయనకు అభినందనలు పత్రికాముఖంగా అందజేస్తున్నాను.

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
చరవాణి : 9849568901

దరఖాస్తుల ఆహ్వానం

రా.వా.ప్రతినిధి మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు: పోస్టల్ డైరెక్టరేట్ ఉత్తర్వుల ప్రకారం మచిలీపట్నం పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులలో వివిధ మేయిల్ డెలివర్ ఖాళీలను భర్తీ చేయడానికి అర్హులైన వారిని ఆన్‌లైన్‌లో ఈ నెల 18 నుంచి వచ్చే నెల 19వ తారీకు వరకు దరఖాస్తు చేసుకోవలసిందిగా మచిలీపట్నం పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ కె.ఏడుకొండలు తెలిపారు. మచిలీపట్నం సబ్ డివిజన్ పరిధిలోని kanchadam b.o, manjulurus.o, lock b.o, nadupuru b.o లో 4 ఎండి పోస్టులు ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులకు సంబందించిన వయోపరిమితి, విద్యార్హతలు అప్లికేషన్ రుసుము, ఇతర వివరముల కొరకు www.appost.in/gdonline వెబ్‌సైట్‌లో చూడగలరు.

కార్మికులకు మేడే క్రీడా పోటీలు

రా.వా.ప్రతినిధి, కొత్తపేట : మేడే పురస్కరించుకుని ఉయభ గోదావరి, కృష్ణా జిల్లాల కార్మికులకు ఏప్రిల్ 3, 4 తేదిల్లో వివిధ క్రీడా సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక సహాయ కార్మిక అధికారి ఉదయభాస్కరరావు తెలిపారు. పురుషుల విభాగంగాలో కార్మికులకు కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, జావలిన్‌త్రో, మహిళా విభాగంలో కార్మికులకు టెన్నికాయిడ్ డబుల్స్, 50మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సాంస్కృతిక పోటీల్లో భాగంగా పాటల పోటీలు, విచిత్ర వేషధారణ, ఏకాపాత్రిభినయం, ఏకాంకిక(ప్లేలేట్) పోటీల్లో స్త్రీలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. కర్మాగారాలు, షాపులు, మోటారు, రవాణా సంస్థల్లో పనిచేసే కార్మికులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

ఏప్రిల్ 3 నుండి 12 వరకు వెంకన్న కల్యాణోత్సవాలు

రా.వా.ప్రతినిధి, అమలాపురం –ఏ.తేజ : అమలాపురం పట్టణం మహిపాల వీధిలో వేంచేసియున్న భూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని దేవస్థానం పాలకమండలి, ఆలయ అధికారులకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి,హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. ఏప్రిల్ నెల 3 నుండి 12వ తేది వరకు నిర్వహించనున్న కల్యాణోత్సవాలను పురస్కరించుకుని ప్రచురించిన గోడ పత్రికను అమలాపురం ఎమ్మెల్యేతో కలసి చినరాజప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ ఈవో వివివిఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ ఏప్రిల్‌లో నిర్వహించే కల్యాణోత్సవాల వివరాలను తెలియజేస్తూ 3వ తేది ఉదయం అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగాను, స్వామివారిని పెండ్లికుమారుడు గాను చేసి కార్యక్రమం, 6వ తేది ఉయదం 9.32 గంటలకు స్వామివారి కల్యాణం, 7వ తేది మధ్యహ్నం ఉదయం నుండి ఆలయం వద్ద తీర్థం, అదేరోజు మధ్యహ్నం 3గంటలకు పట్టణ పురవీధుల్లో రథోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కర్రి రామస్వామి(దత్తుడు), ఉప్పలగుప్తం జడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మెట్ల రమణబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు తోట విశ్వేశ్వరరావు, బసవా సింహాద్రి, సంగినీడి గణేష్, ఆచంట మూలాస్వామి, పేరూరి విజయలక్ష్మి మరియు కర్రి వీరరాఘవులు, కర్రి పద్మనాభనాయుడు, కర్రి విష్ణువర్ధనరావు, తిక్కిరెడ్డి నేతాజీ, తోరం రాము, అబ్బిరెడ్డి నరసింహారావు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ టిడిపి విప్ నల్లా స్వామి, టిడిపి నాయకులు నిమ్మకాయల చెల్లయ్యనాయుడు తదితరలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 'అమలాపుర'పాలక సంఘం

రా.వా. ప్రతినిధి,కోనసీమ–జిఎన్.రావ్ : అమలాపురం పురపాలక సంఘాన్ని ఉంచడమే ధ్యేయంగా పనిచేస్తూ అత్యున్నత స్థానంలో 6 నెలల్లో అంచలంచెలుగా రూ. 6 కోట్ల అభివృద్ధి సాధించామని మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు అన్నారు. అమలాపురం సూర్య రెసిడెన్సీలో పాత్రికేయుల సమావేశంలో అమలాపురం పురపాలక సంఘ చైర్మన్ చిక్కాల వినాయకరావు ఆరు నెలల ప్రగతిపై విశ్లేషణ ఇచ్చారు. పురపాలక సంఘంలో టి.డి.పి అధికారంలోకి వచ్చిన నాటి నుండి రూ.15 కోట్ల మేర అభివృద్ధి జరిగిందని చెప్పారు. ప్రభుత్వం ప్రతీ నెలా పురపాలక సంఘాలకు ఇచ్చే ర్యాంకింగ్‌లలో భాగంగా దివంగత మున్సిపల్ చైర్మన్ యాళ్ళ మల్లేశ్వరరావు హయాంలో 8వ ర్యాంక్‌లో ఉన్న మున్సిపాలిటీ తదనంతరం 26వ స్థానానికి చేరుకుందన్నారు. నవంబరులో తాను పదవిని చేపట్టిన తరువాత ఈ ర్యాంకింగ్ డిసెంబర్‌లో 3వ ర్యాంక్‌కు, జనవరిలో 2వ ర్యాంక్ సాధించి ఫిబ్రవరి నెలలో రాష్ట్రంలో ప్రథమ స్థానానికి చేరుకున్నామని అన్నారు. రాష్ట్రంలో కనీసం మొదటి పది స్థానాల్లో ఎప్పటికీ నిలబడేలా తాను కృషిచేస్తానని అన్నారు. మున్సిపాలిటీలో పన్నులు వసూళ్ళు 62 శాతానికి వచ్చామని, తమ ముందు 85 శాతం వసూళ్ళు లక్ష్యం ఉందన్నారు. రూ.4 కోట్ల 76 లక్షలు పన్నులు రూపేణా వసూలు చేసామని, ఇంకా రూ.1.7 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని, వాటిని ఈ నెలాఖరులోపు వసూలు చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. పట్టణంలో పెండింగ్‌లో వున్న మేజర్ డ్రెయిన్‌లను 13, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2 కోట్ల 12 లక్షలతో నిర్మించామని, 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలోని 3 స్మశాన వాటికలను అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. పట్టణంలో ప్రధాన కూడలి అయిన గడియార స్తంభం సెంటర్‌ను అందరి ఆమోదంతో అత్యాధునిక డిజైన్‌తో రూ.47 లక్షలతో అభివృద్ధి

చేస్తున్నామన్నారు. తామరచెరువు అభివృద్ధికి రూ. 2 కోట్ల అంచనాలు రూపొందించి పురపాలక శాఖామంత్రితో శంకుస్థాపన కూడా చేయించామని, దీనికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 లక్షలు కేటాయించి ఎర్త్‌వర్క్, కాంపౌండ్

మేషరాశి

(అశ్విని : 1,2,3,4 పాదములు భరణి : 1,2,3,4 పాదములు కృత్తిక : 1 పాదము)
ఆదాయం -5 వ్యయం -5
రాజపూజ్యం -3 అవమానం-1

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 6ట లోహమూర్తి, తదుపరి 7ట రజితమూర్తి. శని వత్సమంతయు 9ట రజితమూర్తి, ఆగష్టు 17 వరకు రాహువు 5ట, కేతువు 11ట సువర్ణమూర్తులు తదుపరి రాహువు 4ట, కేతువు 10ట తామ్రమూర్తులు.వీరికి గురుడు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు కన్యారాశి యందు, తదుపరి వత్సరాంతము వరకు తులారాశి యందు సంచరించును. శనివత్సరాది నుండి జూన్ 19 వరకు ధనుస్సు నందు, జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు వృశ్చికము నందు తదుపరి వత్సరాంతం వరకు ధనూరాశి యందు సంచరించును. రాహువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు సింహారాశిలోనూ తదుపరి వత్సరాంతము వరకు కర్కాటకరాశిలో, కేతువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు కుంభరాశిలోనూ తదుపరి వత్సరమంతయు మకరరాశిలోను సంచరించును. ఈ రాశివారికి గురుని షష్ఠ రాశి సంచారము భార్యా పుత్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులతో విరోధము, అధికారులతో ద్వేషము, అగ్ని, శత్రు,చోర భయము మొదలగు వ్యతిరేక ఫలములు నిచ్చును. గురుని సప్తమ రాశి సంచారం ఆరోగ్యదాయకము. సర్వకార్య విజయము,శని భాగ్యరాశి సంచారం అసౌఖ్యం- అష్టమ రాశి సంచారం స్థానచలన సూచనలు అనారోగ్యం, వృధా ప్రయాణం. ఇంటా బయట విరోధం. తిరిగి అక్టోబరు నుండి ధనూరాశి సంచారం అసౌఖ్యం. రాశి వారికి అదృష్ట సంఖ్య 9.1,2,3,6 తేదీలు ఆది, బుధ, గురు వారములు కలసిన మంచి జరుగును. శని, రాహు కేతువుల వలన కలుగు అరిష్టములు తొలగుటకు ఈశ్వరాభిషేకం, శనివారం శివదర్శనం చేయవలయును. రాహు, కేతు దోషములు తొలగుటకు దుర్గాస్తోత్ర, సుబ్రహ్మణ్య స్తోత్ర పారాయణలు చేయవలయును.

వృషభరాశి

(కృత్తిక : 2,3,4 పాదములు రోహిణి : 1,2,3,4 పాదములు మృగశిర : 1,2 పాదములు)
ఆదాయం -14 వ్యయం-11
రాజపూజ్యం-6 అవమానం -1

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 5ట తామ్రమూర్తి,తదుపరి 6ట సువర్ణ మూర్తి, శని వత్సరమంతయు 8ట లోహమూర్తి ఆగష్టు 17 వరకు రాహువు 4ట, కేతువు 10ట రజితమూర్తులు తదుపరి రాహువు 3ట, కేతువు 9ట రజితమూర్తులు.

వీరికి గురుడు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు కన్యారాశి యందు, తదుపరి వత్సరమంతయు తులారాశి సంచారము.శని వత్సరాది నుండి జూన్19 వరకు ధనుస్సునందు,జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు వృశ్చికము నందు తిరిగి అక్టోబరు 26 నుండి వత్సరాంతం వరకు ధనూరాశి యందు సంచరించును. రాహువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు సింహరాశిలోను, తదుపరి వత్సర మంతయు కర్కాటకరాశిలోను, కేతువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు కుంభరాశిలోను, తదుపరి 17 నుండి సంవత్సరమంతయు మకరరాశిలోను సంచరించును. ఈ రాశివారికి గురుని కన్యారాశి సంచార కాలములో సకల సంపదలను, తులారాశి సంచారము అనారోగ్యము,శత్రుభయము క్లేశములను కలిగించును. రాహువు అర్ధాష్టమ స్థాన సంచారము వ్యాధి భయమును, కర్కాటక సంచారము సౌఖ్యము కలిగించును.కేతువు దశమస్థాన సంచారము కలహములను, తదుపరి భాగ్యస్థాన సంచారము శుభములను కలిగించును. సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు గురుబటము కలదు. శని బలము లేదు. సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు రాహు బటము లేదు. ఆగష్టు 17 నుండి రాహు బలము కలదు. సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు కేతు బలము లేదు. ఆగష్టు 17 తదుపరి సంవత్సరాంతము వరకు కేతుబలము కలదు.

మిథునరాశి

(మృగశిర : 3,4 పాదములు ఆరుద్ర: 1,2,3,4 పాదములు పునర్వసు : 1,2,3 పాదములు)
ఆదాయం -2 వ్యయం -11
రాజపూజ్యం -2 అవమానం - 4

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 4ట సువర్ణమూర్తి.తదుపరి 5ట లోహమూర్తి.శని వత్సరమంతయు 7ట తామ్రమూర్తి ఆగష్టు 17 వరకు రాహువు 3ట,కేతువు 9ట లోహమూర్తులు తదుపరి రాహువు 2ట, కేతువు 8ట సువర్ణమూర్తులు.

ఈ రాశివారికి గురుడు వత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు కన్యారాశిలోనూ, తదుపరి వత్సరమంతయు తులరాశిలోను సంచరించును. శని వత్సరాది నుండి జూన్ 19 వరకు ధనూరాశి యందు, జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు వక్రముచే వృశ్చికము నందు అక్టోబరు 26 నుండి వత్సరాంతము వరకు ధనూరాశి సంచారము. రాహువు ఆగష్టు 17 వరకు సింహరాశి యందు 17 నుండి సంవత్సరమంతయు కర్కాటకరాశి యందు, కేతువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు కుంభరాశి యందును, తదుపరి వత్సరాంతము వరకు మకరరాశి యందును సంచరించును. గురుని అర్ధాష్టమ సంచారం మాతృమూలక క్లేశములు,సుఖలోపం తదుపరి వత్సరాంతము వరకు తులారాశి సంచారం, సంపదలకు,పుత్రమూలక సుఖం. శని సంవత్సరాది నుండి జూన్ 19 వరకు సప్తమరాశిలో సంచారం, ధైర్యం తదుపరి జూన్ 20 అక్టోబరు 25 వరకు వక్రముచే షష్ఠరాశి సంచారం ధనలాభమును, తదుపరి అక్టోబరు 26 నుండి వత్సరాంతము వరకు ధనూరాశి సంచారం ధైర్యము, వత్సరాది నుండి ఆగష్టు 17 వరకు తృతీయ రాశి సంచారం. సౌఖ్యమును తదుపరి ఆగష్టు 17 నుండి ధనస్థాన సంచారం కలహం. పాడి పరిశ్రమ,ఫైనాన్స్,చేతి వృత్తుల వారు, శిల్పులు, అన్ని రంగాల వారికి లాభదాయకం. రాజకీయనాయకులకు సన్మానములు. ఈ రాశి స్త్రీ - పురుషులకు వివాహములు కావలసినవారికి వివాహములు జరుగును.

కర్కాటక

(పునర్వసు : 4వ పాదము పుష్యమి :1,2,3,4 పాదములు అశ్లేష : 1,2,3,4 పాదములు)
ఆదాయం -11 వ్యయం- 8
రాజపూజ్యం- 5 అవమానం-4

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 3ట రజితమూర్తి. తదుపరి 4ట సువర్ణమూర్తి. శని వత్సరమంతయు 6ట సువర్ణమూర్తి, ఆగస్టు 17 వరకు రాహువు 2ట, కేతువు 8ట తామ్రమూర్తులు తదుపరి రాహువు 1ట కేతువు 7ట లోహమూర్తులు.

ఈ రాశి వారికి గురుడు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు తృతీయ స్థానముందు తదుపరి సంవత్సరాంతము వరకు అర్ధాష్టము స్థానము నందు సంచరించును శని వత్సరాది నుండి జూన్ 19 వరకు షష్ఠ స్థానమందు జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు వక్రముచే పంచమస్థానములోను తదుపరి అక్టోబరు 26 నుండి వత్సరాంతము వరకు షష్ఠ స్థానములోను సంచరించును. రాహువు వత్సరాది నుండి ఆగస్టు 17 వరకు ధనస్థానములోను తదుపరి వత్సంరాతమువరకు జన్మరాశిలోను సంచరించును. కేతువు వత్సరాది నుండి ఆగస్టు 17 వరకు అష్టము స్థాన, తదుపరి వత్సరాంతము వరకు సప్తమస్థానములోను సంచరించను. గురుని తృతీయరాశి సంచారం ఆపదలను కలిగించును. తదుపరి అర్ధాష్టము స్థాన సంచారం, వ్యయము, సౌఖ్య లోపము- మాతృవర్గ మూలక క్లేశములు. శని షష్ఠరాశి సంచారం ధనలాభము, పంచమరాశి సంచారం, పుత్రమూలక క్లేశములు, బుద్ధిమాంద్యము. రాహువు కుటుంబ రాశి సంచారము కలహమును, ధన నష్టమును, జన్మరాశి సంచారం శారీరక కష్టములను, భయమును కేతువు అష్టమరాశి సంచారం పీడను, సప్తమరాశి సంచారం భయము, కళత్ర మూలక క్లేశములు.

సింహరాశి

(ఉత్తర : 2,3,4వ పాదములు హస్త : 1,2,3,4 పాదములు చిత్త : 1,2 పాదములు)
ఆదాయం -2 వ్యయం -11
రాజపూజ్యం-4 అవమానం -7

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 1ట తామ్రమూర్తి, తదుపరి 2ట రజితమూర్తి. శని వత్సరమంతయు 4ట లోహమూర్తి ఆగష్టు 17 వరకు రాహువు 12ట, కేతువు 6ట సువర్ణమూర్తులు, తదుపరి రాహువు11ట, కేతువు 5ట తామ్రమూర్తులు.

ఈ రాశివారికి ఆర్థిక, పుత్ర, దేహపుష్టి కారకుడైన గురువు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు జన్మరాశిలోను తదుపరి సంవత్సరాంతము వరకు కుటుంబ స్థానములోను సంచరించును. శని సంవత్సరాది నుండి జూన్ 19 వరకు అర్ధాష్టమ స్థానములోను జూన్ 20 నుండి వక్రముచే తృతీయములోను అక్టోబరు 25 వరకును, తదుపరి 26 నుండి ధనూరాశిలోను సంచరించును. రాహువు వత్సరాది నుండి ఆగష్టు 17 వరకు వ్యయములోను తదుపరి 17 నుండి లాభములోను సంచరించును. కేతువు వత్సరాది నుండి షష్ఠ స్థానములోనూ తదుపరి పంచమంలోను సంచరించును. పరిశీలించగా ఈ రాశివారికి గురుడు సెప్టెంబరు 12 నుండి, శని జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు, రాహువు ఆగష్టు 17 నుండి కేతువు వత్సరాది నుండి ఆగష్టు 17 వరకు యోగింతురు. ఈ రాశివారికి గురు, రాహుబలము పూర్తిగా కలవు. శని, కేతువుల బలము సామాన్యము. గురుని జన్మరాశి సంచారంలో శారీరక మానసిక రుగ్మతులు, అధిక ఖర్చులు, స్థానచలన సూచనలు , ధన స్థాన సంచార కాలములో ధనలాభం, కుటుంబ సౌఖ్యము. రాహువు లాభరాశి సంచారం అపూర్వ ధనలాభం, విజయప్రాప్తి. ఈ రాశి స్త్రీ పురుషాదులకు వివాహము కావలసినవారికి వివాహము జరుగును. ఉద్యోగప్రాప్తి, రాహు బలముచే రావలసిన ధనము చేతికి అందును.

నవనాయక ఫలితాలు

భవిష్య భారతం (2017-18)

● **రాజు-కుజుడు :** కుజుడికి రాజ్యధిపత్యం రావడం మంచిది కాదు."యుద్ధ కారకో కుజ:" అన్నారు. ఈ సూత్రాన్ని అనుసరించి ప్రపంచ దేశాల మధ్య భేదాభిప్రాయాలు ఎక్కువవుతాయి. దేశాల మధ్య ఆధిపత్య పోరు అధికమవుతుంది., భారతదేశం కొన్ని సంచలనాత్మక,కఠినమైన నిర్ణయాలను తీసుకొనవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. కందులు,మిరప వినియోగదారులకు ధర కలిగి ఉంటాయి. రైతులకు సామాన్యఫలితాలు మాత్రమే వస్తాయి. వ్యవసాయం లాభసాటిగా ఉండది. శ్రమకు తగిన ఫలితం లభించడం కష్టమవుతుంది. భారత్, పాక్ దేశాల మధ్య నెలకొన్న పరిస్థితులు ప్రజలకు తీవ్రమైన సంకటంగా మారుతుంది. శాంతికాముకుల మనసులు రోదిస్తాయి. ప్రతి విషయాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం మనం చూసిన చరిత్ర. ప్రజలకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు అడ్డంకులు ఏర్పడతాయి. కులం ప్రాతిపదిక దిశగా అన్ని పనులు నడుస్తాయి.

● **మంత్రి - గురువు :** బ్రహ్మణ గ్రహమైన బృహస్పతికి మంత్రిత్వం రావడం మంచిది. కీలకమైన, విషయాల్లో మేధావుల సలహాలు ప్రజలకు, ప్రభుత్వానికి మంచి చేస్తాయి. ఆర్థిక, రక్షణ, తీవ్రవాద విషయాల్లో మంచి వ్యూహాలు, మంచి ఫలితాలనిస్తాయి. బంగారం ధర పెరుగుతుంది- నిలకడగా. మేధావుల సూచనలను రాజకీయ నాయకులు, అధికారులు పెడచెవిన పెట్టి వినాశనాన్ని కొనితెచ్చుకుంటారు. సభ్య సమాజం సిగ్గుపడే విధంగా ప్రభుత్వాలు కొన్ని రాజకీయ పార్టీలు ప్రవర్తిస్తాయి. ఆర్థిక సంస్కరణల ఫలితం ఎలా ఉంటుందో గానీ, సామాన్యుడి మాడు పగులుతుంది. ముఖ్య నాయకులు ప్రతిష్టను కోల్పోతారు.

● **సేనాధిపతి - బుధుడు :** దేశసేవకు బలం దృఢంగా ఉంటుంది. వ్యూహ ప్రతివ్యూహాలతో పెద్ద నష్టాలు రాకుండా కాపాడుతాయి.కొత్త వ్యాపారాలు విజయవంతం అవుతాయి. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. మహా విధ్వంసక ఆయుధాలను ఉపయోగించవలసివస్తుంది,భరించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. రక్షణ వ్యయం అధికమై రహస్యంగా అప్పులు తేవాల్సి వస్తుంది. రౌడీలు టీచర్లుగా మారి విద్యార్థినీ, విద్యార్థులను డబ్బు కోసం వేధిస్తారు. పిల్లలపై అత్యాచారాలు చేస్తారు. ఈ సంవత్సరం కూడా అనుమానస్పద మృతులు, కిడ్నాప్‌లు, నీళ్ళలో పడి చనిపోయే వాళ్ళు ఎక్కువవుతారు. ఈతలు, ఫిక్నిక్‌లు నూటికి 90% విషాదాన్నే మిగులుస్తాయి. మనుషులకు మనుషులకు మధ్య వాణిజ్య సంభాషణలు తప్ప ఇతర సంబంధాలు లేవని స్పష్టంగా నిరూపితమవుతుంది. ప్రశ్నాపత్రాల లీకేజీ మళ్ళీ తప్పదు.

● **సస్యాధిపతి - రవి :** నకిలి విత్తనాలు రైతుల పాలిట పెనుశాపంగా పరిణమిస్తుంది. ఎన్ని రకాల చర్యలు తీసుకున్న రైతులకి చేతిదాక వచ్చిన వంట నోటికి అందదు. తుపానుల వల్ల ఈ సంవత్సర పంట నష్టం జరుగుతుంది. ప్రాజెక్టులకు నీళ్ళు వస్తాయి. అకాల వర్షాలే ప్రధాన సమస్య అవుతుంది.సకాల వర్షాలు ప్రశ్నార్థకం. వ్యవసాయ సంబంధమైన ఖర్చులు అధికమవుతాయి. సూర్యుడు- అంటే రవికి సస్యాధిపత్యం రావడం వల్ల రైతులను పట్టించుకునే వారు ఉండరు. రైతులు నూటికి తొంబైశాతం అడుగడుగునా మోసపోతారు.

● **ధాన్యాధిపతి - శుక్రుడు :** ధాన్యం, అపరాలు ధర కలిగి ఉంటాయి. ధాన్యం ఉత్పత్తి మధ్యస్తంగా ఉంటుంది. ప్రతి విషయంలోను స్త్రీల అధిపత్యం ఎక్కువవుతుంది. నల్ల నువ్వులు, తెల్ల నువ్వులు, సుగంధ ద్రవ్యాలు ధర కలిగి ఉంటాయి. తుపాను వల్ల ధాన్యానికి నష్టం. వ్యాపారులకు అనుకూలంగా ఉంది. శుక్రునకు ధాన్యాధిపత్యం వచ్చిన కారణంగా స్త్రీలు వ్యాపార రంగంలో బాగా రాణిస్తారు. వృద్ధ స్త్రీలకు, వితంతువులకు ఇప్పుడు వస్తున్న పెన్షన్ డబ్బులు పెంచబడతాయి. స్త్రీల వల్ల దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుంది.

● **అర్ఘాధిపతి -బుధుడు :** అనారోగ్యకరమైన ఆహారపదార్థాలు ఆదరించబడతాయి. నిర్జన ప్రదేశాలలో, పట్టణాలలో అధిక వర్షపాతం. సముద్రగర్భ అగ్నిపర్వతాలు వంటివి విస్ఫోటనం చెందుతాయి. సముద్ర ఉగ్రస్వరూపం వల్ల ధననష్టం, విశేష జననష్టం కలుగుతుంది. సునామీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

● **మేఘాదిపతి-రవి :** వాతావరణం అస్తవ్యస్తంగా ఉంటుంది. పట్టణాలలో మేఘాలు బాగా వర్షిస్తాయి. రెండుసార్లు ఎండాకాలం ఋతుపవనాల దయ నామమాత్రమే. పిడుగుపాట్ల వల్ల జననష్టం. అకాల వర్షాల వల్ల పంటనష్టం సంభవిస్తుంది. సహాయ కార్యక్రమాలలో అవినీతి తాండవిస్తుంది. వ్యవసాయ సంబంధిత ప్రకటనలు నమ్మి రైతులు నష్టపోతారు. కొన్ని సందర్భాలలో వ్యవసాయ ఖర్చులు కూడా రావు. రైతులను ఆదుకుంటామనే ప్రకటనలు, భరోసాలు నీటి మూటలుగానే మిగిలిపోతాయి. దౌర్జన్యంగా రైతుల పొలాలను లాక్కుంటారు.

● **రసాధిపతి - కుజుడు :** రక్షణ కోసం ఏర్పరచుకున్న ఆయుధాలు మందుగుండు సామాగ్రి నేరస్థులకు ఆయుధాలుగా మారుతాయి. సైనికులు,పోలీసుల వద్దన్ను ఆయుధాల కన్నా ఉగ్రవాదుల దగ్గర శక్తివంతమైన ఆయుధాలు ఉంటాయి. ముఖ్యమైన పదవుల్లో ఉన్నవారు తప్పుడు పనులు చేసి ఇక్కట్లను గురి అవుతారు. కంచే చేను మేస్తుంది. సమాజంలో స్త్రీల మీద అత్యాచారాలు అధికమవుతాయి. ధర్మానికి కానికాలం దాపురించింది. న్యాయం గాఢ నిద్రలో ఉంటుంది. క్రుంగిన రథచక్రాల చెంత నిస్సహాయుడైన కర్ణునివలె భరతమాత దీనవదన అవుతుంది.

● **నీరసాధిపతి -రవి :** యువతీ యవకులు అద్భుత విజయాలు సాధిస్తారు. మేధారంగంలో అంతర్జాతీయ ఖ్యాతి తేస్తారు. దేశకాలమాన పరిస్థితుల వల్ల యువశక్తి నిరాశకు గురి అవుతుంది. వ్యసనాలకు బానిసవుతుంది. కుల,మత, ప్రాంతీయ ద్వేషాలు, పేదరికం యువతకు ఆటంకం అవుతాయి. ఎర్రబారిన మబ్బులతో పడమటి సూర్యాస్తమయం కర్ణుని మరణానంతరం అస్తమించిన సూర్యుడుని గుర్తు చేస్తుంది.

కన్యారాశి

(మఖ : 1,2,3,4 పాదములు పుబ్బ :1,2,3,4 పాదములు ఉత్తర : 1వ పాదము)
ఆదాయం - 14 వ్యయం- 2
రాజపూజ్యం - 1 అవమానం - 7

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 2ట లోహమూర్తి. తదుపరి 3ట తామ్రమూర్తి, శని వత్సరమంతయు 5ట రజితమూర్తి, ఆగస్టు 17 వరకు రాహువు 1ట, కేతువు 7ట రజితమూర్తులు తదుపరి రాహువు 12ట కేతువు 6ట సువర్ణమూర్తులు.

ఈ రాశివారికి గురుడు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు కుటుంబ స్థానంలోను తదుపరి వత్సరాంతము వరకు తృతీయమందు సంచరించను. శని వత్సరాది జూన్ 19 వరకు ధనుస్సు నందును తదుపరి వక్రముచే అక్టోబరు 25 వరకు అర్ధాష్టము స్థానము. తదుపరి అక్టోబరు 26 నుండి సంవత్సరాంతము వరకు ధనూరాశి యందును సంచరించును. రాహువు వత్సరాది నుండి ఆగస్టు 17 వరకు జన్మస్థానమందు తదుపరి వ్యయమందు కేతువు వత్సరాది నుండి ఆగస్టు 17 వరకు సప్తమ స్థాన, తదుపరి షష్ఠ స్థానమందు సంచరించును. గురుడు కన్యారాశి సంచారం ధనలాభము, కుటుంబ సౌఖ్యమును, తులారాశి సంచారకాలం ఆపదలను కలిగించును. శని ధనూరాశి సంచారం పుత్ర మూలక క్లేశములను, బుద్ధిమాంద్యం, వృశ్చికరాశి సంచార కాలం మాతృమూలక క్లేశములు, బంధు విరోధము, సౌఖ్యహాని. రాహువు సింహరాశి సంచార కాలం శరీర కష్టములు, భయాందోళనలు, కర్కాటక రాశి సంచారం కాలం ధనహాని, స్థానచలన సూచనలు. కేతువు కుంభరాశి సంచార కాలం మానసిక భయాందోళనలు, మకరరాశి సంచార కాలం సుఖ సంతోషములు.

తులారాశి

(చిత్త : 3,4 పాదములు స్వాతి : 1,2,3,4 పాదములు విశాఖ : 1,2,3 పాదములు)
ఆదాయం -14 వ్యయం - 11
రాజపూజ్యం -7 అవమానం - 7

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 12ట రజితమూర్తి. తదుపరి 1ట లోహమూర్తి. శని వత్సరమంతయు 3ట తామ్రమూర్తి, ఆగష్టు 17 వరకు రాహువు 11ట, కేతువు 5ట లోహమూర్తులు, తదుపరి రాహువు 10ట, కేతువు 4ట రజితమూర్తులు.

ఈ రాశివారికి గురుడు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు వ్యయస్థానమందు, తదుపరి వత్సరమంతయు జన్మరాశియందు సంచరించును. శని వత్సరాది నుండి జూన్ 19 వరకు తృతీయము నందు జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు వక్రముచే ధనస్థానమున అక్టోబరు 26 నుండి సంవత్సరాంతము వరకు ధనూరాశి యందును సంచరించును. రాహువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు లాభమున తదుపరి రాజ్యస్థానమున సంచరించును. కేతువు సంవత్సరాది నుండి ఆగష్టు 17 వరకు పంచమస్థానమున ఆగష్టు 17 నుండి అర్ధాష్టము స్థానమున సంచరించును. పరిశీలించగా గురుని వ్యయరాశి సంచారము శుభమూలక ధనవ్యయం, పుణ్యక్షేత్ర దర్శనం, స్థానచలన సూచనలు తదుపరి జన్మరాశి సంచార కాలంలో శారీరక మానసిక అనారోగ్యము స్థానచలనం, శని తృతీయరాశి సంచారకాలం సంపద, ద్వితీయరాశి సంచార కాలము కుటుంబ మూలక సమస్యలు. రాహువు లాభస్థాన సంచారంలో ధనాగమము, రాజ్యస్థాన సంచారము మానహాని, తగవులు, కేతువు పంచమస్థాన సంచారము ధనహాని, బుద్ధిమాంద్యము, అర్ధాష్టము స్థాన సంచారము సుఖలోపము, మాతృవర్గ మూలక క్లేశములు ఈ రాశివారికి వత్సరారంభం నుండి ఆగష్టు 17 వరకు రాహువు, జూన్ 19 వరకు శనిల బలము కలదు.

వృశ్చికరాశి

(విశాఖ : 4వ పాదము, అనూరాధ: 1,2,3,4 పాదములు జ్యేష్ఠ : 1,2,3,4 పాదములు)
ఆదాయం -5
వ్యయం -5
రాజపూజ్యం -3
అవమానం -3

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 11ట సువర్ణమూర్తి, తదుపరి 12ట తామ్రమూర్తి. శని వత్సరమంతయు 2ట రజితమూర్తి ఆగష్టు 17 వరకు రాహువు 10ట, కేతువు 4ట సువర్ణమూర్తులు, తదుపరి రాహువు 9ట, కేతువు 3ట లోహమూర్తులు.

ఈ రాశివారికి గురుడు వత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు లాభంలోను తదుపరి వత్సరమంతయు వ్యయంలోను సంచరించును. శని వత్సరాది నుండి జూన్ 19 వరకు కుటుంబ స్థానంలోను జూన్ 20 నుండి వక్రముచే అక్టోబరు 25 వరకు జన్మరాశిలోను తదుపరి అక్టోబరు 26 నుండి వత్సరాంతము వరకు ధనూరాశిలోను సంచరించును. రాహువు వత్సరాది ఆగష్టు 17 వరకు రాజ్యస్థానము నందు తదుపరి వత్సరమంతయు భాగ్యంలోను సంచరించును. కేతువు వత్సరాది నుండి ఆగష్టు 17 వరకు అర్ధాష్టమం తదుపరి వత్సరమంతయు తృతీయంలో సంచరించును. ఆరోగ్య భంగం, స్థానచలనం, ధననష్టం విద్యార్థులు గ్రేడులను సాధించలేరు. ఉపాధ్యాయులు అధికారుల ఆగ్రహమునకు గురికావలసి వచ్చును. స్థానచలనములు పొందెదరు. వ్యవసాయదారులకు రెండు పంటలు లాభించవు. న్యాయవాదులకు , వైద్యులకు, వడ్డీ వ్యాపారులకు, ఫైనాన్స్ పొల్టీలవారికి, పాడి పరిశ్రమ, వృత్తి పనివారలకు నామమాత్ర ఆదాయము. జీవనము పరీక్షా కాలముగా నుండును.

ధనస్సురాశి

(మూల : 1,2,3,4 పాదములు పూర్వాషాఢ : 1,2,3,4 పాదములు ఉత్తరాషాఢ : 1వ పాదము)
ఆదాయం -8 వ్యయం - 11
రాజపూజ్యం -6 అవమానం - 3

వీరికి సెప్టెంబర్ 12 వరకు గురుడు 10ట లోహమూర్తి. తదుపరి 11ట సువర్ణమూర్తి. శని వత్సరమంతయు 1ట సువర్ణమూర్తి ఆగష్టు 17 వరకు రాహువు 9ట, కేతువు 3ట తామ్రమూర్తులు తదుపరి రాహువు 8ట, కేతువు 2ట తామ్రమూర్తులు

ఈ రాశివానికి విద్యా సంపత్కరుడైన గురుడు సంవత్సరాది నుండి 2017 సెప్టెంబర్ 12 వరకు రాజ్యస్థానంలో తదుపరి వత్సరాంతమంతయు లాభంలోను సంచరించును. శని వత్సరాది నుండి జూన్ 19 వరకు జన్మరాశి తదుపరి వక్రంచే జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు వ్యయరాశి తదుపరి అక్టోబరు 26 నుండి వత్సరాంతము వరకు జన్మరాశిలోను సంచరించును. రాహువు వత్సరాది నుండి 2017 ఆగస్టు 17 వరకు భాగ్యస్థానంలోను సంచరించును. కేతువు వత్సరాది నుండి ఆగస్టు 17 వరకు తృతీయంలో తదుపరి సంవత్సరాంశము ధనస్థానములోని సంచరించును. పరిశీలించగా వీరికి గురుడొక్కడే యోగించును. రాహువు ఆగస్టు 17వరకు అనుకూలుడు. శనిబలము, కేతు బలము లేవు. గురుని రాజ్యస్థాన సంచార కాలము సకల కార్యసిద్ధి. పుత్రమూలక లాభం. శని జన్మ, ద్వాదశ రాశుల సంచారకాలంలో త్రిప్పట, ధన వ్యయము, కాలయాపన, చింత, ఆరోగ్యభంగము. రాహువు భాగ్యరాశి సంచారకాలంలో పుత్రమూలక సుఖం, ధనలాభం, నీచ దేవతోపాసన, అష్టమరాశి సంచార కాలములో మనోవ్యాకులము, స్థానచలనము, ఆరోగ్యభంగం. ధననాశనం. కేతువు తృతీయ రాశిసంచారం దు :ఖం. సోదర మూలక కలహం, ద్వితీయరాశి సంచారకాలం మానసిక ఆందోళనలు, భయం. పరిశీలించగా వీరు గురుబలముచే ఎంతటి కార్యమునైనను పూర్తి చేయగలరు.

మకరరాశి

ఆదాయం- 11 వ్యయం- 5
రాజపూజ్యం- 2 అవమానం- 6

విరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 9ట సువర్ణమూర్తి. తదిపరి 10ట రజిత మూర్తి. శని వత్సరమంతయు 12ట లోహమూర్తి, ఆగష్టు 17 వరకు రాహువు 8ట, కేతువు 2ట రజితమూర్తులు తదుపరి రాహువు 7ట కేతువు 1ట సువర్ణమూర్తులు.

ఈ రాశివారికి పుత్రకారకుడైన సంపత్కారకుడైన గురువు సంవత్సరాది నుండి సెప్టెంబర్ 12 వరకు భాగ్యంలోనూ తదుపరి రాజ్యంలోను సంచరించును.శని సంవత్సరాది నుండి జూన్ 19 వరకు వ్యయములో, జూన్ 20 నుండి వక్రముచే అక్టోబరు 25 వరకు లాభంలోను తదుపరి సంవత్సరాంతము వరకు వ్యయంలో సంచరించును. రాహువు వత్సరాది నుండి ఆగష్టు 17 వరకు అష్టమంలో తదుపరి వత్సరమంతము సప్తమరాశిలోను సంచరించును. కేతువు వత్సరాది నుండి ఆగష్టు 17 వరకు ధనస్థానములో తదుపరి వత్సరమంతయు జన్మరాశిలో సంచరించును. పరిశీలించగా ఈ రాశివారికి గురుడొక్కడే యోగించును శని బలము జూన్ 20 నుండి అక్టోబరు 25 వరకు కలదు. రాహువు, కేతువుల బలము లేదు. గురుని భాగస్థాన సంచారం ధనలాభం, దైవభక్తి, రాజ్యస్థాన సంచారకాలం యత్న కార్యసిద్ధి సంతోషము,సన్మానములను పొందుట. ఏలినాటి శని వ్యయ సంచారము మనోవ్యాకులము.రాహువు సప్తమ సంచారమ, భయము. కేతువు ధన స్థాన సంచారం కుటుంబ కలహము, ధననష్టం, జన్మరాశి సంచారం భయం.ఈ రాశి విద్యార్థులు గురుబలముచే ఉన్నత శ్రేణులను సాధింతురు. ఫైనాన్స్, వడ్డీ, బ్యాంక్ రంగములవారికి కొంత నష్టములు, ధననష్టం ఆరోగ్యభంగం, వాగ్వివాదములు, న్యాయస్థానమందు అపజయము, ఉద్యోగులకు స్థానచలనములు, అధికారుల ఆగ్రహములకు గురియగుట జరుగును.

కుంభరాశి

(ధనిష్ట : 3,4 పాదము శతభిషం : 1,2,3,4 పాదములు పూర్వాభాద్ర : 1,2,3 పాదములు)
ఆదాయం - 11 వ్యయం - 5
రాజపూజ్యం - 5 అవమానం - 6

వీరికి సెప్టెంబరు 12 వరకు గరుడు 8ట తామ్రమూర్తి. తదుపరి 9ట లోహమూర్తి. శని వత్సరమంతయు 11ట సువర్ణమూర్తి ఆగస్టు 17 వరకు రాహువు 7ట, కేతువు 1ట లోహమూర్తులు తదుపరి రాహువు 6ట, కేతువు 12ట రజితమూర్తులు.

ఈ రాశివారికి గురుడు సంవత్సరాది నుండి సెప్టెంబరు 12 వరకు అష్టమంలోను తదుపరి వత్సరమంతయు భాగ్యంలోను సంచరించును. శని సంవత్సరాది నుండి జూన్ 19వరకు లాభంలో తదుపరి 20 నుండి అక్టోబరు 25 వరకు వక్రంచే రాజ్యస్థానములోను తదుపరి సంవత్సరాంతము వరకు లాభములో సంచరించును. రాహువు వత్సరాది నుండి ఆగస్టు 17 వరకు సప్తమంలో తదుపరి వత్సరమంతయు షష్ఠ స్థానములోను సంచరించును. ఈ కేతువు సంవత్సరాది నుండి ఆగస్టు 17 వరకు జన్మరాశిలోను తదుపరి వత్సరమంతయు వ్యయంలోను సంచరించును. ఈ రాశివారికి గురుడు అష్టమరాశి సంచార కాలములో ధన నష్టము, ఆరోగ్యభంగము, స్థానచలనమును, భాగ్యరాశి సంచారకాలములో ధలాభం, పితృవర్గ మూలక సుఖమును కలిగించును. శని లాభస్థాన సంచారకాలములో ధనలాభమును, సకల కార్యసిద్ధిని కలిగించును. రాజ్యస్థాన సంచార కాలములో కార్య విఫలత్వమును, గౌరవ భంగమును కలిగించును. రాహువు సప్తమరాశి సంచార కాలములో సుఖములను, శత్రు నాశనమును కలిగించును. కేతువు జన్మరాశి సంచార కాలంలో భయమును, వ్యయరాశి సంచార కాలములో దు:ఖమును కలిగించును.

మినారాశి

(పూర్వభాద్ర : 4వ పాదము ఉత్తరాభాద్ర : 1,2,3,4 పాదములు రేవతి : 1,2,3,4 పాదములు)
ఆదాయం -8 వ్యయం -11
రాజపూజ్యం - 1 అవమానం - 2

వీరికి సెప్టెంబరు 12 వరకు గురుడు 7ట రజితమూర్తి. తదుపరి 8ట తామ్రమూ

ఆఫ్రికాలో అత్యంత ఎతైన మసీదు నిర్మాణం

ఆఫ్రికా : ఆఫ్రికాలో చైనా బృందం అత్యంత ఎతైన మసీదు నిర్మాణానికి పూనుకుంది. అల్జీరియా నిర్మించనున్న ఈ మసీదు మినరాల ఎత్తు సుమారు 265 మీటర్లు. చైనా స్టేట్ కన్‌స్ట్రక్షన్ ఇంజినీరింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించే ఈ మసీదు ఆఫ్రికాలో నిర్మించే . ఈ మసీదులో ఒక మిలియన్ పుస్తకాలకు సంబంధించిన లైబ్రరీ కూడా చోటుచేసుకోనుంది. 500 ఏళ్లపాటు ఎటువంటి ప్రకృతి వైపరీత్యాలకు లొంగకుండా అత్యంత పటిష్టంగా ఈ మసీదు నిర్మాణం జరుగుతోంది. ఈ మసీదు ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద మసీదుకానుంది.

ఫాస్టింగ్‌లో మోడీ కంటే తక్కువేమి కాదట

న్యూఢిల్లీ : దసరా నవరాత్రులు సందర్భంగా గత 43 ఏళ్లుగా ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న దీక్షలకు తక్కువేమీ కాకుండా ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఫాస్టింగ్ చేస్తారట. వచ్చే వారం ఆదిత్యనాథ్ తొమ్మిది రోజుల ఫాస్ట్ నిర్వహించనున్నారు. మార్చి 28 నుంచి చైత్ర నవరాత్రి ప్రారంభం కాబోతున్న తరుణంలో ఆయన ఈ దీక్షను చేపడతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ దీక్ష సమయంలో యోగి ఆదిత్యనాథ్ కేవలం బంగాళదుంపలను, పండ్లను మాత్రమే స్వీకరిస్తారని చెప్పారు. దీక్షా సమయంలో యోగి ఆదిత్యనాథ్ ఎంతో భక్తితో విశేష్ పూజలో పాల్గొంటారని తెలిపారు. సంస్కృత మహావిద్యాలయ స్కాలర్స్ ఈ పూజను నిర్వహిస్తారని యోగి ఆదిత్యనాథ్ కు అతి సన్నిహితుడు చెప్పారు. మంగళవారం సీఎంగా బాధ్యతలు స్వీకరించిన యోగి ఆదిత్యనాథ్ ఈ పూజ కోసం వచ్చే వారం గోరఖ్ పూర్ వెళ్లనున్నారు. ఆ సమయంలోనే తొమ్మిది రోజుల దీక్షను చేపడుతున్నారు. అక్టోబర్ లో వచ్చే మరో నవరాత్రులకు గోరఖ్ పూర్ మఠ్ లో వివిధ ప్రార్థనలు, ఏకాగ్రత కార్యక్రమాలు నిర్వహిస్తారు. యోగి ఆదిత్యనాథ్ తన గురువు దగ్గర్నుంచి 1984లో ఈ దీక్షను చేపట్టారట.

పన్నీర్‌సెల్వానికి విద్యుత్ స్తంభం,శశికళకు టోపీ

న్యూఢిల్లీ: అన్నా డీఎంకే పార్టీ రెండాకుల చిహ్నాన్ని ఎన్నికల సంఘం స్తంభింపచేసింది. పార్టీకి చెందిన రెండు వర్గాలకు వేరు వేరు చిహ్నాలను కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. ఎన్నికల సంఘం నిర్ణయం మేరకు మాజీ ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం వర్గానికి విద్యుత్ స్తంభం గుర్తు ప్రధాన కార్యదర్శి శశికళ వర్గానికి టోపీ గుర్తు లభించింది. అలాగే ఇక నుంచి పన్నీర్ సెల్వం గ్రూప్‌ను పురచ్చితలైవి అమ్మ అన్నా డీఎంకే అనీ, శశికళ గ్రూపును అమ్మ అన్నాడీఎంకే అని వ్యవహరిస్తారు. ఇంతకుముందు రెండు వర్గాలతోను ఎన్నికల సంఘం సమావేశమైంది. రెండు వర్గాల పార్టీ ఎన్నికల చిహ్నం రెండాకుల కోసం పట్టుబడ్డాయి. దివంగత ముఖ్యమంత్రి జయలలిత మృతితో ఆర్‌కే నగర్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ స్థానంలో వచ్చే నెల 12 వ తేదీన పోలింగ్ జరగనుంది. ఓట్ల లెక్కింపు ఏప్రిల్ 15వ తేదీన ఉంటుంది. దీంతో రెండు వర్గాలకు ఎన్నికల చిహ్నాన్ని కేటాయించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. శశికళ వర్గం తరపున టీటీవీ దినకరన్ పోటీచేస్తుండగా, పన్నీర్ సెల్లం గ్రూప్ తరపున ఈ మదుసూదన్ పోటోలో ఉన్నారు.

అమెరికాలో ముస్లిం క్రీడాకారిణిపై ఆంక్షలు

వాష్టింగ్టన్ : ఉన్నత విద్యాపాఠశాలలో చదువుతున్న ముస్లిం విద్యార్థిపై కూడ ఆంక్షలు విధించారు. జీనం హేయస్ అనే విద్యార్థిని మంచి క్రీడాకారిణి, అయితే ఆమె తలకు హిజాబ్ (ముసుగు) ధరిస్తున్నారన్న ఒకే ఒక కారణంతో ప్రాంతీయ బాస్కెట్‌బాల్ ఫైనల్స్ పోటీలో పాల్గొనరాదని ఆంక్ష పెట్టారు. మేరీల్యాండ్ గెయిథర్స్ బర్గ్‌లను వాట్కిన్స్ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థిని గతంలో దాదాపు 24 క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మంచి క్రీడాకారిణి అయినప్పటికీ హిజాబ్ ధరిస్తున్న కారణతో బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు నిరాకరించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. గతంలో తాను ఇలాంటి ఆంక్షలను ఎప్పుడూ ఎదుర్కోలేదని ఆ విద్యార్థి వాపోయారు. ఆ విద్యార్థికి శిక్షణ ఇచ్చిన డొనిటా ఆడమ్స్ కూడా స్కూల్ యాజమాన్యం చర్యను తీవ్రంగా ఖండించారు.

బీజేపీకి ప్రత్యామ్నాయంగా మహాకూటమి అవసరం

అహ్మదాబాద్ : బీజేపీకి కౌంటర్‌గా భావ సారూప్యతగల పార్టీలన్ని మహా కూటమిగా ఏర్పడాల్సిన అవసరం ఉందని ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్ సూచించారు. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అయినందున వల్ల 'మందిరం –మసీదు ' రాజకీయాలు పెరగవచ్చునని ఆందోళన వ్యక్తంచేశారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కూడగట్టుకున్న మద్దతు దృష్ట్యా భావసారూప్యతగల పార్టీలు ఏకం కావాల్సిందే అనిపిస్తోంది అని పవార్ అన్నారు. ఎన్‌సీపీ నూతన కార్యాలయ ప్రారంభం సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ యేతర పార్టీన్ని ఆత్మవిమర్శ చేసుకొని లోపాలను అంచనా వేసుకోవాలని, బీజేపీకి బలమైన త్ర్యామ్నాయంగా ఆవిర్భవించాలని పవార్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా చర్చలు మొదలయ్యాయో లేదో తనకు తెలియదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.' ఇది సూచన మాత్రమే. ప్రస్తుతానికి వివరణాత్మక చర్చలేమీ జరగలేదు. ఇలాంటి కూటమి ప్రతిపాదన వస్తే ఎన్‌సీపీ సానుకూలంగా స్పందిస్తుంది' అని ఆయనన్నారు. ఆదిత్యనాథ్ నాయకత్వంలో యూపీలో మతరాజకీయాలఉ రాజ్యమేలే అవకాశం ఉందని పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ' పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ అభివృద్ధి అజెండాల అమలుకు స్పష్టమైన వైఖరి గల సరైన న్యాయకత్వం అవసరం యూపీ ప్రజల పరిస్థితి ఏమిటని భయమోస్తోంది. కొత్త నాయకత్వం అసలైన అభివృద్ధిపై కాకుండా 'మందిరం–మసీదు' సంబంధిత అంశాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టే అవకాశం ఉంది' అని శరద్ పవార్ అన్నారు.

15 ఏళ్ల తర్వాత రైలెక్కారట..

ముంబై : దాదాపు పదిహేనళ్ల తర్వాత బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ లోకల్ రైలులో ప్రయాణించారు. తన డ్రీమ్‌ప్రాజెక్టు' కర్మ్ బ్రహాండ్ హౌజింగ్ ప్రాజెక్టు ' ను ప్రారంభించేందుకు వివేక్ లోకల్ రైలులో ప్రయాణించారు. ప్రజల అతి తక్కువ ధరే ఇంటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ముంబైలోని బీచ్ పక్కనే ఐదు వేల నివాసాల నిర్మాణానికి శ్రీకారం చుట్టేందుకు వెళుతున్నానన్నారు. ఇది తన జీవిత కల అని తెలిపారు. ఆయన 2002లో సాతియా అనే చిత్ర షూటింగ్ సమయంలో చివరిసారిగా లోకల్ రైలు ఎక్కారట. 'ఎంతో మంది పేదవారు, సామాన్యులు అసురక్షితమైన జీవితాన్ని కఠిన పరిస్థితుల మధ్య బతికేస్తున్నారు.కెల్వ్ రోడ్డు మాదిరాగానే షాపూర్ కూడా మారిపోయింది. 2018 నుంచి దాదాపు 14,000 వేల కుటుంబాలు నాణ్యమైన జీవితాన్ని ప్రారంభిస్తారు' అని వివేక్ చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ ఏరియాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి : చైర్మన్

రా.వా.ప్రతినిధి,మచిలీపట్నం, వి.నాగేశ్వరరావు: 27వ వార్డు టైలర్స్ కాలనీలో సి.సి.రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు దృష్ట్యా త్వరితగతిన పూర్తి చేయాలని, పట్టణములో మారుముల ప్రాంతములను, ముఖ్యంగా యస్‌సి, యస్‌టి. ఏరియాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ పంచపర్వాల కాశీ విశ్వనాధం, సనకా ధనలక్ష్మీ, సనకా నాగులు, బత్తుల రమేష్, డి.ఇ సాంబశివరావు, ఎ.ఇ.శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు రూ.2000

- ఓట్ల కొనుగోలు అభివృద్ధి
- ఇటువంటి పాలన మార్పిడే అజెండా
- సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ రామకృష్ణ

అనంతపురం : ఎంతో అభివృద్ధి చేశామని అధికారంలో ఉన్న పార్టీలు చెప్పుకుంటున్నాయని, అయితే చేసిన అభివృద్ధి ఏమీ లేదని, ఓట్లు కొనుగోలు చేయటమే వారు చేసిన అభివృద్ధి అని సామాజిక హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ కె.రామకృష్ణ విమర్శించారు. 2019లో జరగనున్న ఎన్నికల్లో ఓటుకు రూ.2000 ఇచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారని, ఇదే వారు సాధించిన అభివృద్ధి అని ఎద్దేనా చేశారు. సామాజిక హక్కుల వేదిక నేతలతో కలసి అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బు సంపాదించడం ఎన్నికల్లో పెట్టుబడి పెట్టడం అధికారంలోకి రాగానే తిరిగి సంపాదించడం లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఇలాంటి రాజకీయాలు మారాలని తాము కోరుతున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కూడా డబ్బులిచ్చి ఓట్లు కొనుగోలు చేయటం, హెలీకాప్టర్‌లో తరలించి క్యాంపు రాజకీయాలు నడపడం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేయడమేనన్నారు. ఎన్నికల్లో ఓటుకు నోటు ఇచ్చి గెలుపొందాలనుకునేవారికి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపిలో అధికార పక్షం,ప్రతిపక్షం డబ్బు చుట్టూ రాజకీయాలను తిప్పుతున్నాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు సంపాదనపై పూర్తిగా నిమగ్నమయ్యారన్నారు. ఒక్కొక్కరు 50 నుంచి వంద కోట్లు సంపాదించుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రతిపక్ష నేత జగన్ రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం నీతులు వల్లించే చంద్రబాబు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులకు కూడా ప్రలోభపెట్టి వారిని అవినీతి పరులుగా చేసేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉన్నా 21 మంది ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ప్రలోభ పెట్టి చంద్రబాబు ఫిరాయింపులను ప్రోత్సహించారన్నారు. రాష్ట్రంలో అధికార మార్పిడే తమ అజెండా అని స్పష్టం చేశారు. పేదలు అధికారంలోకి రావాలని, స్వాతంత్ర్యం 70 ఏళ్లల్లో అణగారిన, వెనుకబడిన మైనారిటి వర్గాలకు జరిగిన అన్యాయాలను సరిదిద్దాలనేది తమ లక్ష్యంగా పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అణగారిన వర్గాలకు అధికారం అప్పగించాలని, అందుకు ప్రఉ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీలు,మహిళలను సమీకరించి అణగారిన వర్గాలకు అధికారం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యామ్నాయ రాజకీయలను ముందుకు తీసుకెళ్తామని, ఆ క్రమంలో తమతో కలసివచ్చే వారితో చేతులు కలుపుతామన్నారు. ఆదిఫత్య కులాలు ఇంత వరకు చేసిందేమి లేదన్నారు. 70 ఏళ్లలో సంపాదించుకుని వారు బాగుపడ్డారన్నారు. అణగారిన వర్గాల కోసం 2019 లో అసెంబ్లీని ఖాళీ చేయాల్సిందేనన్నారు. ఏపిపిఎస్సీ నిర్వహించే స్క్రీనింగ్ టెస్టులో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీకు రిజర్వేషన్లు తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.570 జారీ చేయడం అన్యాయమన్నారు. దీని వల్ల ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలు ఉద్యోగ అవకాశాలను కోల్పోతాయన్నారు. వీరికి చట్టపరంగా ఉన్న రిజర్వేషన్‌ను వర్తింపం చేయాలని డిమాండు చేశారు. రాష్ట్రంలో దాదాపు 2 లక్షల ఉద్యోగ ఖాళీలుంటే కేవలం 10 వేలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడాన్ని రామకృష్ణ తప్పుపట్టారు.

లౌకికవాదం పరిరక్షణకు, మైనారిటీలకు అండగా ఉండేందుకు త్వరలో కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు. దేశంలో,రాష్ట్రంలో ప్రమాదకరమైన రాజకీయాలు సదస్సున్నాయన్నారు. ఉత్తరప్రదేశ్ఓ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆ రాష్ట్ర అసెంబ్లీలో 403 స్థానాలుంటే బీజీపీ ముస్లింలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. ఆ రాష్ట్రంలో ముస్లింల జనాభా 20 శాతం ఉందన్నారు. బీజేపీ 325 స్థానాలల్లో గెలుపొందిందన్నారు. ఎమ్మెల్యేలను కాకుండా ఎంపీ అధిత్యనాథ్‌ను ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేశారన్నారు. ఆధత్యనాథ్ కరుడగట్టిన ఆర్ఎస్ఎస్ వాది, ముస్లిం వ్యతిరేకి అని చెప్పారు. మోడీ పాలనలో దళితులు, మైనారిటీలు అభద్రత భావానికి గురౌతున్నారన్నారు. వారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో సామాజిక హక్కుల వేదిక లౌకిక పరిరక్షణకు, మైనారిటీలకు అండగా ఉండేందుకు కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. సామాజిక హక్కుల వేదిక జిల్లా అధ్యక్షులు డి.జగదీష్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీ వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులకు హక్కులు,అధికారులు,నిధులు ఇవ్వకుంటే ఆందోళన చేస్తామన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు నష్టపరిహారం చెల్లించాలని, పంట రుణాలు రద్దు చేయాలని,పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సామాజిక హక్కుల వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ఆర్ నాగభూషణం, రాయలసీమ కురుబ సంఘం అధ్యక్షులు బోరంపల్లి ఆంజనేయులు,ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడారు.

ఎస్బీఐ విలీనంతో పాట్లు

- అనుబంధ బ్యాంకుల సగం శాఖల మూసివేత తథ్యం
- కీలక నిర్ణయం వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచంలో అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా వెలుగొందేందుకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా చేపట్టే ఐదు అనుబంధ బ్యాంకుల విలీన ప్రక్రియ ఇక త్వరలోనే ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. విలీనం తర్వాత అనుబంధ బ్యాంకుల సగం కార్యలయాలను మూసివేయాలని నిర్ణయించింది. దీనిలోనే మూడు ప్రధాన కార్యాలయాలను కూడా ఉన్నాయట. ఏప్రిల్ 24 నుంచి ఈ మూసివేసే ప్రక్రియను ప్రారంభించబోతుంది. అనుబంధ బ్యాంకుల ఐదు ప్రధాన కార్యాలయాల్లో కేవలం రెండింటిని మాత్రమే ఉంచాలనుకుంటున్నామని, అనుంబంధ బ్యాంకులకు సంబంధించి 27 జోనల్ ఆఫీసులు, 81 రీజనల్ ఆఫీసులు, 11 నెట్ వర్క్ ఆఫీసులతో పాటు మూడు ప్రధాన కార్యాలయాలను మూసివేస్తామని ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ దినేష్ కుమార్ ఖరా చెప్పారు. ఏప్రిల్ 24 వరకే ప్రస్తుత నమూనాను ఇలా ఉంచుతామాని, అనంతరం అనుబంధ బ్యాంకుల కంట్రోలింగ్ ఆఫిసులను, రీజనల్ ఆఫీసులను, జోనల్ ఆఫీసులను, నెట్ వర్క్ ఆఫీసులను, తగ్గించే ప్రక్రియను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ మైసూర్ స్టేట్ బ్యాంకు ఆఫ్ ట్రావన్‌కోర్ స్టేట్ బ్యాంకు ఆఫ్ పటియాలా, స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ లను ఎస్‌బీఐ తనలో విలీనం చేసుకోనుంది. సోమవారమే భారతీయ మహిళా బ్యాంకు ఎస్‌బీఐలో విలీనమైంది. ఈ విలీనంతో రూ.40 లక్షల కోట్ల ఆస్తులను ఈ బ్యాంకు సంపాదించుకోనుంది. ప్రస్తుతం 550 ఎస్‌బీఐ ఆఫీసులు, అనుబంధ బ్యాంకులు 259 ఆఫీసులు కలిగి ఉన్నాయి. విలీనం తర్వాత 687 ఆఫీసులనే కంట్రోలింగ్ ఆఫీసులుగా పరిమితం చేయాలని నిర్ధేశించుకున్నామని ఖరా చెప్పారు. ఈ ప్రభావం 1107 ఉద్యోగులపై పడనుందని ఎస్‌బీఐ అంచనావేస్తోంది. కస్టమర్ ఇంటర్‌ఫేస్ ఆపరేషన్స్ లో వారిని నియమిస్తామని ఖరా తెలిపారు.

1 నుంచి అనుబంధ శాఖలన్నీ ఎస్‌బీఐ శాఖలే

ఎస్‌బీఐలో విలీనం కానున్న 5 అనుబంధ బ్యాంకుల శాఖలన్నీ ఏప్రిల్ 1 నుంచి ఎస్‌బీఐ శాఖలుగా కార్యకలాపాలను నిర్వహిస్తాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ బికనీర్ అండ్ జైపూర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంకు ఆఫ్ మైసూర్, స్టేట్ బ్యాంకు ఆఫ్ పాటియాలా, స్టేట్ బ్యాంకు ఆఫ్ పాటియాలా డిపాజిటర్లతో పాటు వినియోగదార్లుగా పరిగణిస్తామని ఆర్‌బీఐ ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. ఉద్యోగులు (ఆయా బ్యాంకుల బోర్డు డైరెక్టర్లు ఎగ్జిక్యూటివ్ ట్రస్టులు తప్ప) ఎస్‌బీఐ ఉద్యోగులుగా మారుతారు. విలీనానంతరం ఎస్‌బీఐ రూ. 37 లక్షల కోట్లు (555 బిలియన్ డాలర్లు) 22,500 శాఖలు, 58,000 ఏటీఎమ్‌లు, 50 కోట్ల మంది వినియోగదార్లను కలిగి ఉంటుంది.

రాజధాని వాసుల ఫీజు రీయింబర్స్‌మెంట్

దరఖాస్తు గడువు ఏప్రిల్ 15

రా.వా.ప్రతినిధి– అమరావతి : అమరావతి రాజధాని నగర పరిధిలోని గ్రామాల వారికి ఉచిత విద్య హామీ అమలులో భాగంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి ఏప్రిల్ 15వ తేదీ వరకు ధరఖాస్తులు చేసుకోవచ్చుని రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందాలనుకునే రాజధాని గ్రామాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు epass.ap.gov.inకు లాగిన్ అయి ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 5,383 కళాశాలల్లో వృత్తి విద్య అభ్యసిస్తున్న రాజధాని నగర పరిధిలోని గ్రామాల విద్యార్థులు ఉచిత విద్య హామీ అమలులో భాగంగా ఈ పథకం కోసం ధరకాస్తు చేసుకోవచ్చున్నారు. వెబ్‌సైట్‌లో పేర్ల నమోదు చేసుకునే విషయంలో ఏదైనా సమస్య ఉంటే సంబంధిత డాక్యుమెంట్లతో తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయంలో సంప్రదించాలని శ్రీధర్ తెలిపారు.

పాట్ట కాట్టేస్తున్నారు...

- ఇదీ రాజధాని దుస్థితి...
- యంత్రాలతో ఇసుక తీయడంపై తిరగబడ్డ కూలీజనం

రా.వా. ప్రతినిధి– అమరావతి : రాజధాని నిర్మాణాలకు వేలాది ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగాలను అన్యాపదేశంగా కీర్తించే రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి వర్గం వారికి జీవనోపాధి కల్పించటంలో పూర్తిగా విఫలం చెందటమే కాకుండా, బతుకు పోరాటం కోసం ఉద్యమించాల్సిన పరిస్థితులు నెలకొన్నట్లు లింగాయపాలెంలో చోటు చేసుకున్న సంఘటన మరోసారి రుజువు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానదిలోని ఇసుకను ఆదివారం ఇరిగేషన్ అధికారులు భారీ యంత్రాలతో తవ్వి తీయిస్తుండగా రైతులు, రైతు కూలీలు తమ జీవనోపాధి కోల్పోతున్నామంటూ ఆందోళనకు దిగారు. ఈ విషయంపై అధికారులు, రాజధాని ప్రాంత కూలీల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిపి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అంతే కాకుండా అధికారులను అడ్డుకొనేందుకు రైతు, రైతు కూలీలు రహదారిపై గంటల తరబడి నిరసన వ్యక్తం చేస్తూ భైఠాయించారు. అయినప్పటికీ పోలీసు అధికారులు ఇరిగేషన్ అధికారులకు వత్తాసుగా నిటబడి ఇసుకను తరలించేందుకు పూనుకోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. లింగాయపాలెం సమీపంలో ఉన్న కృష్ణానదిలో ఇరిగేషన్ అధికారులు భారీ యంత్రాలతో ఇసుకను తీయించి లారీల్లో రవాణా చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇసుక పాలసీ ప్రకారం ఇసుక తీసేందుకు భారీ యంత్రాలను ఎట్టి పరిస్థతులలో వాడకూడదు. ఇదే అంశంపై గుంటూరు జిల్లా కలెక్టర్ కాంతీలాల్ దండే ఇసుక రీచ్‌ల వద్ద వాహనాలను వినియోగిస్తున్న సమయంలో స్వయంగా పరిశీలించి యంత్రాల వాడకం నిషేధమంటూ గతంలోనే హెచ్చరికలు జారీ చేశారు. పోలీసులు కూడా అనేకమార్లు ఇసుకరీచ్‌ల వద్ద వాహనాలతో ఇసుకను నదిలో నుంచి తీయటాన్ని వ్యతిరేకిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గత వారంలో ఇసుక రీచ్‌లను గుంటూరు జిల్లా రూరల్ ఎస్పీ కె.నారాయణ నాయక్ స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ ఇరిగేషన్ అధికారులే ఆధునిక యంత్రాలతో ఇసుకను తీయిస్తుంటే కడుపు మండిన కూలీలు అడ్డం తిరిగినప్పటికీ పోలీసులు అధికారులకు అండగా నిటబడటం అనేక విమర్శలకు దారి తీసింది. రాజధాని ప్రాంతంలో కట్టడాలు నిర్మిస్తున్న సమయంలో కూడా అక్కడే నివాసం ఉంటున్న కూలీలకు ఉపాధి కల్పించకుండా బడా కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల నుండి కూలీలను రప్పించి రాత్రింబవళ్ళు తాత్కాలిక సచివాయం, తాత్కాలిక శాసనసభ తదితర నిర్మాణాలను పూర్తి చేస్తున్న సమయంలో సీపీఐ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం ఒంటెద్దు పోకడతో ముందుకు వెళ్ళడాన్ని గమనిస్తున్న రైతులు,రైతు కూలీలు, కమ్యూనిస్టు నేతలు పెద్ద ఎత్తున ఉద్యమం చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక సర్వేలో 29 గ్రామాలకు సంబంధించి1.06 లక్షల మంది రైతు కూలీలు ఉన్నట్లు ఉపాధి అవకాశాలు, ఉచిత వైద్యం, వారి పిల్లలకు ఉచిత విద్య అందిస్తామంటూ కురిపించిన వరాలు అమలు చేయమని సీపీఐ నేతలు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విజ్ఞాపన రూపంలో ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వీసమెత్తైనా స్పందించకపోగా ఉన్న అవకాశాలను కూడా భారీ యంత్రాలతో బడా బాబుల జేబులు నింపేందుకు కొనసాగుతున్న కుట్రను అడ్డుకొనే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే చూస్తూ ఊరుకోబోమని సీపీఐ నాయకులు హెచ్చరిస్తున్నారు.

ఈ- ఫైలింగ్‌గా ఎక్కడ...!

- సచివాలయంలో కానరాని కాగిత రహిత విధానం
- అన్ని ఫైళ్ళు కాగితాల మీదనే

రా.వాప్రతినిధి, అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో టెక్నాలజీకి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. కార్యాలయాల్లో కాగిత రహిత ఫైళ్ళు నడుపుతున్నామని ఘనంగా చెప్తుంటారు. ఒక్క ఆయన కార్యాలయానికి వెళ్ళే ఫైళ్ళు ఆన్‌లైన్‌లో వెళుతున్నాయేమోగాని సచివాలయంలో ఈ ఫైలింగ్ విధానం అమలు కావటం లేదు. పాతరోజుల లాగానే కాగితాలతో ఫైళ్ళు నడుస్తున్నాయి. ఈ ఫైలింగ్ (ఈ – ఆఫీసు) అంటే ఏ శాఖ అధికారికైనా ఓ దరఖాస్తుకాని, ఓ ప్రతిపాదన కాని వచ్చినప్పుడు దానికి సంబంధించిన వ్యవహారమంతా ఆన్‌లైన్‌లోనే జరపాలి. ఇది ముఖ్యమంత్రి ఆదేశం దానివల్ల ఫైళ్ళలో అవకతవకలు జరగకుండా ఉంటుందన్న ఆలోచనతో ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. కాని అది సచివాలయంలోనే అమలుకు నోచుకోవటం లేదు. ఏ శాఖలోనైనా దరఖాస్తు రాగానే అది సెఓన్‌కు వెళుతుంది. ఈ సెక్షన్‌లో ఆ దరఖాస్తు పరిశీలన జరిపి రూల్ పొజిషన్‌ను పేర్కొంటూ ఆసిస్టెంట్ సెక్రటరీ, ఆ తర్వాత డిప్యూటీ సెక్రటరీ, మంత్రి, ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి వరకు వెళ్ళే ఫైలంతా ఇలా ఆన్‌లైన్‌లోనే పంపాల్సి ఉంటుంది. దీనివల్ల ఉన్నతాధికారులు ప్రటోభాలకు గురై, రాజకీయ వత్తిళ్ళకు లొంగి క్రింది ఉద్యోగుల గొంతు మీద కత్తిపెట్టి ఫైలును తిరగరాయించే వ్యవహారాలకు చెక్ పెట్టాలనేది పాలకులు చెప్పే మాట. ఈ విధానంలో ఏ తప్పుడు నిర్ణయం జరిగినా, ఎక్కడ తప్పు జరిగింది, ఎవరు బాధ్యులు అనేది నిమిషాలలో తేలిపోతుంది. అయితే ప్రస్తుతం సచివాలయంలో ఈ విధానం అమలు కావటం లేదు. చాలా శాఖల్లో సెక్షన్ నుండి ఉన్నతాధికారుల వరకు పాత పద్ధతిలోనే ఫైళ్ళు నడుస్తున్నాయి. ముఖ్యమంత్రి వద్దకు వెళ్ళే ఫైళ్లను మాత్రం చాలా వరకు స్కాన్ చేసి ఆన్‌లైన్ ద్వారా పంపుతున్నారు. ఇదే విధానం కొనసాగితే కింది స్థాయి ఉద్యోగులపై అధికారుల పెత్తనం యధావిధిగా నడిచే ప్రమాదం ఉంది. ఉదాహరణకు వైయస్. రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో మైనింగ్‌శాఖలో శ్రీ లక్ష్మీ కార్యదర్శిగా ఉన్నప్పుడు క్యాప్టిన్ మైనింగ్ అన్న పదం నోట్ ఫైలులో లేదు. కాని డ్రాఫ్ట్‌లో ఆ పదం ఉంది. ఈ వ్యవహారంలో సిబిఐ వి

ప్రమాదంలో లౌకికవాదం

స్వాతంత్ర్య ఉద్యమంలో అనేకులు పాల్గొన్నారు. అక్కడి కులం,మతం అడ్డుకాలేదు. అందరూ ఈ దేశపు ముద్దుబిడ్డలుగానే భరతమాత దాస్యశృంఖలాలను విడిపించడానికి రక్తతర్పణం, ప్రాణార్పడం చేసినవారే.. అయితే ఈ మహోద్యమంలో పాల్గొనని వారే ఈనాడు కులాలు, మతాలుగా ఈ దేశాన్ని విడగొడ్డడానికి శక్తివంచనలేకుండా ప్రయత్నిస్తున్నారు. స్వాతంత్ర్య ఫలాలను ప్రజల నుంచి బలవంతంగా లాక్కుంటానికి మతవాదాన్ని ముందుకు తెచ్చి మనువాదం అమలును నడుం కట్టారు. అందులో భాగంగానే అతిపెద్దరాష్ట్రం అయిన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం మతోన్మాద వికృత వ్యాఖ్యలతో ముందుండే యోగి ఆదిధ్యనాథ్‌కు బీజేపీ పట్టంకట్టింది.

కరడుగట్టిన హిందుత్వవాదికి యూపీ పగ్గాలు

ఈయన అసలు పేరు అజయ్‌సింగ్, ఉత్తరాఖండ్ నుంచి మాథ్స్‌లో డిగ్రీ చేపట్టారు. యోగిగా మారినతర్వాత మాత్రమే యోగి ఆదిత్యనాథ్ అయ్యారు. ఉత్తరప్రదేశ్‌నుంచి యావద్భారత దేశాన్ని హిందూ దేశంగా, దేశ ప్రజలందరినీ హిందువులుగా మార్చడమే జీవిత ధ్యేయంగా చెప్పుకునే ఆదిత్యనాథ్‌ను యూపీకి ముఖ్యమంత్రిగా చేయడం ద్వారా బీజేపీ తన మతతత్వమూలాలను , అనుసరించబోయే అజెండాను చాటింది. 26 ఏళ్ల వయస్సులో ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌నుంచి పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందారు. 2007లో గోరఖ్‌పూర్ అల్లర్ల సమయంలో నిషేధాజ్ఞలు ధిక్కరించి మరీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో ఆయనపై చట్టంలోని 146, 147,279, 506 సెక్షన్లతో కేసులు బనాయించారు. వివాదాస్పద వ్యాఖ్యలపై ఆయన్ను జైల్లో నిర్బంధించిన సంఘటనలూ ఉన్నాయి. అనేక క్రిమినల్ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్నారు. హత్యాయత్నం, శ్మశానాల్లోకి బలవంతంగా ప్రవేశించడం వంటి నేరాభియోగాలు ఆయనపై అనేకం నమోదయ్యాయి. ప్రజలను ఉద్రేకాలకు లోను చేసే ప్రసంగాలు చేయడంలో ఆయనకు ఆయనేసాటి. **హిందువులను క్రైస్తవంలోకి మార్చేందుకే మదర్ థెరీసా భారత్‌కు వచ్చారని , షారుఖ్‌ఖాన్ పాక్ ఉగ్రవాది హఫీజ్ సయూద్ భాషలో మాట్లాడుతున్నాడు, ప్రజలు నీ సినిమాలు చూడకపోతే రోడ్డున పడతావని, యూపీని భారత్‌ను హిందూ రాష్ట్రంగా మార్చేంతవరకు విశ్రమించనని 2005లో ఘర్‌వాపసీ కార్యక్రమంలో మాట్లాడుతూ విషాన్ని వెళ్లగ్రక్కడం ఆయనకే చెల్లింది.**

రాజపుత్రవర్గానికి చెందిన ఆదిత్యనాథ్‌ను ఎంపిక చేయడం 2019 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చేశారని తెలుస్తోంది. అయితే చర్చల్లో ముఖ్యమంత్రి అభ్యర్థులుగా కేశవ్ ప్రసాద్ మౌర్య, దినేష్ శర్మలు ఉండగా ఆర్‌ఎస్‌ఎస్ హఠాత్తుగా యోగి పేరును తెరపైకి తీసుకు వచ్చింది. కేశవ్ ప్రసాద్ మౌర్య బీసీ వర్గానికి చెందినవారుకాగ, దినేష్ శర్మ బ్రాహ్మణుడు మొత్తంమీద అన్ని వర్గాలకు సమన్యాయం జరుపుతామనే సందేశాన్నివ్వడం కోసం వారు వారిద్దరినీ ఉపముఖ్యమంత్రులుగా నియమకాలు చేపట్టారు. హిందూ యువవాహినికి యోగీ నాయకుడు కాగా, తండ్రి మహంత్ అవైద్యనాథ్ మహరాజ్ బాబ్రీమసీదును కూల్చిన వ్యక్తుల్లో ఒకరు. హిందూ ముస్లింల ప్రేమలను నిషేధించాలని 'లవ్ జీహాద్'ను ఉద్యమంలోకి తీసుకువచ్చిన వ్యక్తి యోగి. ఘర్‌వాపసీ పేరుతో ఇతర మతాల్లో చేరిన 1800 మంది హిందువులను వెనక్కు రప్పించారు. గోరఖ్‌పూర్‌లో మతకలహాలు జరిగినప్పుడు ఆయనను అరెస్టు చేశారు. ప్రత్యర్థులను హత్యచేయించారని ఆయనపై అభియోగాలున్నాయి. సూర్యనమస్కారాలు వ్యతిరేకించేవారని సముద్రంలో కలిపేస్తానని హూంకరించారు. ఎన్నికల ప్రచారంలో తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని లేదంటే హిందూ యువవాహిని పేరుతో తూర్పు యూపీలో తిరుగుబాటు అభ్యర్థులను పోటీకి దించుతానని హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. ఏది ఏమైనా రాష్ట్రంలో 22 శాతం ఉన్న దళితులను కులాల వారీగా చీల్చి, 21 శాతం ఉన్న ముస్లింలను కాదని, యాదవేతర, దళిత కులాలతో యూపీలో బీజేపీ జెండా ఎగురవేసిన మోడీ అమిత్‌షాలు రాష్ట్ర పాలకుడిగా అత్యంత హిందూత్వవాదిని నియమించడం క్షమార్హం కాదు.

ఒక వర్గానికి చెందిన వారికి అభ్యర్థిత్వాన్ని కట్టబెట్టకుండా, వారి ఓట్లను కనీసం తలవకుండా వారికి ఈ దేశ ప్రజలుగా ఏ మాత్రం గుర్తింపు గౌరవం లేకుండా పాలన చేపట్టడం ఏ విపత్తుకు దారి తీస్తుందోనని శాంతికాముకులు కలవరపడుతున్నారు. ఆదిత్య నియామకం లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికి, సమసమాజానికి పెనుసవాలు.

- ఖాన్

ఉన్మాదం మొదలైంది

ఉత్తరప్రదేశ్‌లో ఉన్మాదం మొదలైంది. అక్కడ ప్రభుత్వం నెలకొన్న కొన్ని గంటల్లోనే దాడులు మొదలయ్యాయి. బీఎస్పీకి చెందిన మహ్మద్ షమీపై కాల్పులు జరిపి హత్యచేశారు. షమీకి స్థానిక బీజేపీ, వీహెచ్‌పీ నాయకులతో విభేదున్నాయని పోలీసులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో నివసించే మైనార్టీలను ఖాళీ చేయాల్సిందిగా, ఆర్‌ఎస్‌ఎస్ విభాగాలైన వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సంస్థలు హుకుం జారీ చేశాయి. నాడు నాలుగు మటన్ షాపులను తగులబెట్టారు. కబేళాలు తొలగించాలన్నారు. మైనార్టీలంతా క్షణం క్షణం భయం, భయంగా బ్రతుకుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా లౌకికవాదులంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

నిదానమే ప్రదానం : దినేష్‌శర్మ

లక్నో : నిదానమే ప్రదానంగా మేయర్ దినేష్‌శర్మ (53) విజయాన్ని సొంతం చేసుకున్నారు. లక్నో వర్సిటీలో కామర్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సుదీర్ఘకాలంగా బీజేపీతో సత్‌సంబంధాలు ఉన్నాయి. 2014 ఆగస్టులో పార్లమెంటు ఎన్నికల తర్వాత ఆయనను జాతీయ ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. అంతకుముందే గుజరాత్ బీజేపీకి ఇన్‌చార్జ్‌గా పనిచేసి పార్టీ ఎదుగుదలకు కృషి చేశారు. దినేష్ అంటే ప్రధానిమోడీ, అమితాషాలకు గురి. ఎర్ర బుగ్గకారు ఎన్నటికి నీ నుండి ఎన్నటికీ దూరమవ్వదంటూ మోడీ ఆయనకు దండవేసి దీవించారు. పార్టీ వర్గాలు చెబుతుంటాయి. 2008లో ఆయన లక్నో మేయర్‌గా ఎన్నికయ్యారు. 2012లో ఆయన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన నీరజ్ బోరాపై 1.71 లక్షల ఓట్లతో మెజార్టీ సాధించారు. ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యంలో దినేష్ ఇంటిని సంఘ్ సిద్ధాంత కర్త దీన్‌దయాళ్ ఉపాధ్యాయ తరచూ సందర్శించేవారు. దినేష్ ఎంపికతో 2019 లోక్‌సభ ఎన్నికలు ఫలవంతమవుతాయని బీజేపీ వర్గాలు నమ్ముతున్నాయి. అక్టోబర్‌లో లక్నోలో 10 కోట్ల సభ్యత్వాలను చేర్యడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

మౌర్య మరో చాయ్‌వాలా..

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఓబీసీ, దళిత ఓటర్లను ఒకతాటిపై తెచ్చి బీజేపీ అఖండవిజయంలో పాలుపంచుకున్న కేశవ్ ప్రసాద్ మౌర్య (47), బ్రాహ్మణులను సంఘటితం దినేశ్ శర్మ (53)లకు ఉపముఖ్యమంత్రి పదవులతో అధిష్టానం సముచితంగా గౌరవించింది. ప్రధాని మోడీకి కేశవ్ ప్రసాద్‌కు దగ్గర పోలికలున్నాయి. ఇద్దరు పేద కుటుంబాలకు చెంది, టీ అమ్మడంలో తండ్రికి సాయం చేసేనవారు. పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన కేశవ్, ఫుల్‌పూర్ లోక్‌సభనుండి గెలుపొందారు. 2012లో ఆయన మొదటిసారి యూపీలో అలహాబాద్ అసెంబ్లీ నుండి గెలుపొందారు. 2016లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి మొన్న జరిగిన ఎన్నికల్లో మూడొంతుల మెజారిటి సాధించడానికి కారణమయ్యారు. ఉత్తరప్రదేశ్ కేశంభి జిల్లాలో ఒక సాధారణ రైతుకుటుంబంలో జన్మించిన కేశవ్ బాల్యం పేదరికంతో గడిచింది. మోడీలా ఆయనకూడా టీకొట్టులో పనిచేసి, వార్తాపత్రికలు వేస్తూ కుటుంబానికి ఆర్థిక చేయూతనిస్తూనే విద్యాభ్యాసం కొనసాగించారు. చిన్నతనంలో టీలు అమ్మడాన్ని ఆయన మోడీలా గర్వంగా చెప్పుకుంటారు. ఆర్‌ఎస్‌ఎస్ విభాగం బాల స్వయం సేవక్‌లో బాల్యదశలోనే చేరారు. 12ఏళ్ల వయస్సులో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌లకు చెందిన అశోక్ సింఘాల్‌కు దగ్గరయ్యారు. అయోధ్య, గోరక్షణ పేరుతో ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో జైలుకు వెళ్లారు. 2014లో భారత ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నియోజకవర్గం ఫుల్‌పూర్ నుండి ఎన్నికయ్యారు. ఈయన ఓబీసీ వర్గానికి చెందినవారు. యాదవేతర ఓబీసీలను కూడకట్టి ఓట్లు వేయించడంలో ఆయన సఫలీకృతులయ్యారు. మాజీ ముఖ్యమంతి, ప్రస్తుత రాజస్థాన్ గవర్నర్ కల్యాణ్‌సింగ్ తర్వాత ఓబీసీ, దళితుల్లో మంచి పట్టున్ననాయకుడు కేశవ్.

యోగీనా... విదేశీ పత్రికలు

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన యోగి ఆదిత్యనాథ్ పేరు విదేశీ పత్రికల్లో కూడా ప్రముఖంగా కనిపిస్తోంది. ముస్లింలకు వ్యతిరేకిగా కనబడేందుకే ప్రాధాన్యమిచ్చే వ్యక్తికి అత్యంత ప్రముఖ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని ఎలా కట్టబెట్టారని విదేశీ పత్రికలు తూర్పారపట్టాయి. తన వైఖరితో ముస్లింలకు వ్యతిరేకిననే ఆయనే ప్రకటించుకుంటారని, అటువంటి వివాదాస్పద వ్యక్తిని అత్యంత ప్రఖ్యాతి గాంచిన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎంపిక చేయడం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తించింది. ఈ ఎంపిక పట్ల మీడియాలోనూ, రాజకీయ వర్గాల్లోను, ప్రజల్లోను మిశ్రమ స్పందన వెల్లడైంది.

న్యూయార్క్ టైమ్స్ (అమెరికా)

తరచూ ముస్లింలపై ఒంటికాలిపై లేచే అదిత్యనాథ్‌ను యూపీ ముఖ్యమంత్రిగా ఎంపికచేయడం పట్ల న్యూయార్క్‌లోని రాజకీయ పండితుల్ని విస్మయానికి గురిచేసిందని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. అభివృద్ధి నినాదంతో అంతర్జాతీయ నేతగా ఎదిగిన మోడీ ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రపంచదేశాలు సందేహ పడుతున్నాయని ఆ పత్రిక పేర్కొన్నది. భారత్‌ను హిందూదేశంగా మార్చాలన్న ఆదిత్యనాథ్ బహిరంగ వ్యాఖ్యల్ని పత్రిక ఈ సందర్భంగా గుర్తుచేసింది.

ఆల్ జజీరా (ముస్లిం దేశాలు)

ప్రధాన వార్తల్లో నిలిచే ఫైర్‌బ్రాండ్‌గా ఆదిత్యనాథ్‌ను "అల్ జజీరా" పత్రిక అభివర్ణించింది. ఆయన అనుసరించే ముస్లిం వ్యతిరేకధోరణిని ప్రస్తావించింది. ముస్లిం మైనార్టీటీ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన ఆంక్షల్ని ఆయన సమర్థించారన్న విషయాన్ని పత్రిక గుర్తు చేసింది. గోవధ నిషేధానికి గట్టి చట్టాలుండాలని, యోగీపై వ్యతిరేకించే మైనార్టీలు దేశాన్ని విడిచిపెట్టి వెళ్లిపోవాలని, లేకపోతే వారిని సముద్రంలో ముంచేస్తానని, హెచ్చరించారని కూడా పత్రిక గుర్తుచేసింది.

బీబీసీ (లండన్)

ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ నియామకాన్ని బీబీసీ తప్పుపట్టింది. విపక్షాలు ఈ నిర్ణయాన్ని తప్పుపట్టినా బీజేపీ ఎంపీలు మాత్రం సమర్థించారని బీబీసీ పేర్కొంది. "ముస్లిం వ్యతిరేక వ్యాఖ్యలతో ఆదిత్యనాథ్ ప్రఖ్యాతిగాంచారు. హిందూ మెజారిటీ ఓట్లు తమకు వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు చెక్కుచెదరకుండా ఉంటాయని బీజేపీ నేతలు భావిస్తున్నట్టున్నా"రని కాంగ్రెస్ నాయకుడు మనీశ్ తివారీ చెప్పిన మాటల్ని బీబీసీ గుర్తుచేసింది.

డాన్ (పాకిస్తాన్)

డాన్ పత్రిక కూడా ఆదిత్యనాథ్ హిందూత్వ పోకడలను ప్రముఖంగా ప్రస్తావించింది. యోగీ ఆదిత్యనాథ్ నేపథ్యాన్ని ప్రస్తావిస్తూ, ఆయన మహంత్ ఎలా అయ్యారోనని సందేహం వ్యక్తంచేసింది. అంతేగాక రామజన్మభూమి ఉద్యమంలో ఆయన పాత్రను కూడా ప్రస్తావించింది. "నాలుగు కోట్ల మంది ముస్లింలున్న రాష్ట్రలో, అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ముస్లింకు కూడా టికెట్ ఇవ్వని బీజేపీ ఇప్పుడు ముఖ్యమంత్రి పదవిని కూడా ఒక వివాదాస్పదుడికి అప్పగించడం చూస్తుంటే ఇతర విషయాల కంటే యోగికి ఉన్న ముస్లిం వ్యతిరేకవైఖరే ముఖ్యమంత్రి అభ్యర్థిత్వానికి ప్రముఖ కారణమని స్పష్టమవుతోంది" అని డాన్ పత్రిక పేర్కొంది.

స్థానిక సంస్థల 3 ఎమ్మెల్సీలు టీడీపీకే...

రా.వా. ప్రతినిధి : రాయలసీమలోని కడప, కర్నూలు, నెల్లూరుజిల్లాల స్థానిక సంస్థల నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు గెలిచారు. ఈ మూడు నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య పోరు ప్రతిష్టాత్మకంగా జరిగింది. కర్నూలు, నెల్లూరు నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీలు శిల్పా చక్రపాణి,వాకాటినారాయణ రెడ్డి,వైసీపీ అభ్యర్థులు గౌరువెంకటరెడ్డి,ఆనం విజయ్ కుమార్‌రెడ్డిపై విజయం సాధించారు. కడపజిల్లాలోవైసీపీ అభ్యర్థి మాజీ మంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరుడు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ వివేకానందరెడ్డిపై పులివెందులకు చెందిన బీటెక్ రవిటీడీపీ అభ్యర్థిగా గెలుపొందడంలో టీడీపీ శ్రేణులు తబ్బిఉబ్బిబయ్యాయి.

ఈనెల 29న, దాదాపు 20 మంది సిట్టింగ్ ఎమ్మెల్సీలు రిటైర్ కానున్నారు. వారి స్థానంలో ఎమ్మెల్యేల కోటానుంచి స్థానిక సంస్థల నుంచి 13 మంది ఏకగ్రీవంగా ఎన్నికకాగా, వీరిలో 14 మంది టీడీపీకి చెందినవారుకాగా, ఇద్దరువైసీపీకి చెందినవారు. ప్రస్తుతం శాసన సభ్యుల సంఖ్య 58 వీరిలో 1ఉ3వ వంతు ఎమ్మెల్యేల ద్వారా1/3 వంతు స్థానిక సంస్థల ద్వారా పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల నుంచి 10 మంది, గవర్నర్‌కోటాలో 8 మంది నియమింప బడతారు. ఈనెల 29న పదవీవిరమణ పొందేవారిలో మహ్మద్‌జాని, చెంల్రాయుడు, రామచంద్రయ్య, సుధాకర్‌బాబు, టీడీపీకి చెందిన ప్రతిభాభారతి, మండలి వైస్ ఛైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి, సీపీఐకి చెందిన పీజే చంద్రశేఖరరావు, ఉండగా, మండలి ఛైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, ఆర్‌రెడ్డపరెడ్డి గవర్నర్ కోటా నుంచి రిటైర్ కానున్నారు. ఈసారి అందరికంటే చిన్నవారు ముఖ్యమంత్రి కుమారుడు నారాలోకేష్. ఎమ్మెల్యేల కోటా నుంచి మంత్రి పదవి చేపట్టనున్నారు. ఈయనతోపాటు దొక్క మాణిక్యప్రసాద్, కరణంబలరామ్, పోతుల సునీత, బచ్చుల అర్జునుడు, శత్రుచర్ల విజయరామరాజు, చిక్కాల రామచంద్రరావు, అంగర రాంమోహన్, మంతెన సత్యన్నారాయణ, దొరబాబు, దీపక్‌రెడ్డి, వైసీపీ సభ్యులుగా ఆళ్లనాని, గంగుల ప్రభాకర్‌రెడ్డిలు ఈనెల 30న ప్రమాణ స్వీకారం చేస్తారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజేతలు

రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం కలసి టీచరు ఎమ్మెల్సీలో వామపక్షాల మద్దతుతో పోటీ చేసి అత్యధిక మెజార్టితో గెలుపొందిన కత్తి నరసింహారెడ్డి,ప్రతిపక్షపార్టీ వైసీపీ మద్దతుతో పోటీచేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డిల విజయంతో వైసీపీ కుదుట పడింది. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయవిరపుబాలసుబ్రహ్మణంపీడీఎఫ్,తూర ప్పరాయలసీమపట్టభద్రులు,యండపల్లి శ్రీనివాసులు రెడ్డి పీడీఎఫ్, ఉత్తరాంధ్ర పీవీఎన్ మాధవ్ బీజేపీలు విజయం సాధించారు.

అనంతపురం జిల్లాలో 12 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరుఎంపీలు, నలుగురు ఎమ్మెల్సీలు వీరంతా ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి సాగు,తాగునీటికి ప్రధాన్యత, నిధులు తీసుకురావడంలో వెనుకబడ్డారని ప్రజలు భావిస్తున్నారు.

జర్నలిస్టులకు కొత్త వేజ్‌బోర్డు అవసరం

న్యూఢిల్లీ : జర్నలిస్టులు, నాన్- జర్నలిస్టుల కోసం కొత్త వేజ్‌బోర్డును ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల 'నిర్బంధ్య తొలగింపు'ను నివారించేందుకు పత్రికారంగంలో కార్మిక చట్టాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని లోక్‌సభలో ఆర్ఎస్‌పీ సభ్యులు కోరారు. విజుల్స్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు, నాన్- జర్నలిస్టులకు వర్కింగ్ జర్నలిస్టుల చట్టం - 1955 పరిధిలోకి తీసుకురావాలని, వేజ్‌బోర్డును అమలు చేయాలని ఆర్ఎస్‌పీ ఎంపీ ఎన్‌కే ప్రేమచంద్రన్ సూచించారు. కార్మిక చట్టాలను పట్టించుకోకుండా అనేక పత్రికలు జర్నలిస్టులు, నాన్ - జర్నలిస్టులను నిర్బంధ్యంగా తొలగిస్తున్నాయన్నారు. వార్తా పత్రికలు, మీడియా సంస్థల్లో కార్మిక చట్టాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. జీరో అవర్‌లో మాట్లాడిన ఆయన 1955, వర్కింగ్ జర్నలిస్టుల చట్టం కింద వేతనాలపై ఐదేళ్లకొకసారి సమీక్ష జరగాల్సి ఉండగా కమిటీ ఏర్పాటు చేసి పదేళ్లు, అయిందన్నారు. ఫ్రింజ్ మీడియాలో వర్కింగ్ జర్నలిస్టులు, నాన్ - జర్నలిస్టుల వేతనాలు, సర్వీసులను సమీక్షించేలా తక్షణమే వేజ్‌బోర్డును ఏర్పాటు చేయాలని కార్మికశాఖను కోరారు. 2007లో ఏర్పాటు చేసిన మజీతియా వేజ్‌బోర్డు సిఫార్సులను చాలా పత్రికలు అమలు చేయడం లేదని ప్రేమచంద్రన్ తెలిపారు.

న్యాయం చేస్తాం



- మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు
- ప్రతి పైసా రికవరీ చేసి తీరుతాం
- కోరితే కేసు సీబీఐకి అప్పగిస్తాం
- శాసనసభలో ప్రకటన చేసిన చంద్రబాబు

రా.వా. ప్రతినిధి : అగ్రిగోల్డ్ వ్యవహారంలో బాధితులందరికీ న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ సంస్థ అధిక వడ్డీ రేటు ఆశచూపించి రియల్ ఎస్టేట్,డిపాజిట్ల సేకరణ చేపట్టి పలువురిని నిలువుగా ముంచేసిందన్నారు. ఈ కంపెనీ గ్రూప్ కింద పేర్కొన్న మూడు కంపెనీలు ఇతర బోగస్ కంపెనీల ద్వారా రూ.6380.48 కోట్లను సేకరించినట్లు సీఐడీ దర్యాప్తులో తేలిందన్నారు. ఈ మొత్తాలను 87 కంపెనీలకు మళ్లించారని ఆయన తెలిపారు. అగ్రిగోల్డ్ అంశంపై శాసనసభలో స్పీకర్ కోడెల శివప్రసాద్ అనుమతితో సీఎం ప్రకటన చేశారు. ఈ సందర్భంగా కేసు పూర్వపరాలు ఆయన వివరిస్తూ 2014లో ఈ సంస్థపై తొలి కేసు నమోదైందన్నారు.సీఐడీ తెలిపిన వివరాలు ప్రకారం అన్ని రాష్ట్రాల్లో32,02,607 మంది నుంచి సుమారు 6300 కోట్ల మేరకు మోసపోయినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఏపీ కి చెందిన సుమారు 19 లక్షల మంది డిపాజిటర్లకు దాదాపు రూ.4, వేల కోట్ల మేరకు మోసపోయినట్లు ఆయన తెలిపారు.బాధితులను ఆదుకునే క్రమంలో అగ్రిగోల్డ్ ఆస్తుల వేలాన్ని హైకోర్టు నియమించిన కమిటీ ద్వారా 2016 ఏప్రిల్ ప్రారంభించిందన్నారు. మూడు దశల్లో ఈ కమిటీ ద్వారా 16.05 కోట్లను వసూలు చేయడం జరుగుతుందన్నారు.ఆస్తుల అమ్మకాలపై హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కాగా ఈ సంస్థ వలన మోసపోయిన ఆత్మ హత్య చేసుకున్న వారి కుటుంబాలకు రూ.3 లక్షల పరిహారం అందించాలని మంత్రి వర్గాలలో నిర్ణయించానని. అయితే ఈ మొత్తాన్ని రూ. 5 లక్షలకు పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. అరెస్టు కాకుండా తప్పించుకు తిరుగుతున్న వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐడీని కోరుతామన్నారు. అలాగే నిందితుల ఆచూకీ తెలిపిన వారికి రూ.10 లక్షల బహుమతిని ప్రకటించాలని సూచిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1999కు సవరణ చేసి దర్యాప్తు సంస్థకు విశేష అధికారులను కల్పిస్తామన్నారు. అవసరమైతే ఇంకా కఠిన చట్టాలను తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే బాధితులు కోరినట్లయితే ఈ కేసును సీబీఐకి బదలాయించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎం ప్రకటించారు. ఇటువంటి ఆర్థిక నేరాలను వేగంగా విచారించేందుకు ఒక ప్రత్యేక సెల్‌ను కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆర్థిక నేరాగాళ్లపై చట్ట ప్రకారంకృతనిశ్చయతోచర్యలు తీసుకుంటామన్నారు. ఈ వ్యవహారంలో మోసపోయి బాధితులందరికి న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టబడి ఉందన్నారు. ప్రతిపైసా రికవరీ చేసి బాధితులకు న్యాయం చేస్తామని అందరు ధైర్యంగా ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

సబ్‌ప్లాన్‌కు సున్నం

- కటాయింపులే.. ఖర్చు లేదు
- సీపీఐ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు

రా.వా ప్రతినిధి- అమరావతి : తెలుగుదేశం ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాజిక, ఆర్థిక ప్రాధాన్యాలు కొరవడ్డాయని సీపీఐ ఎమ్మెల్సీ పిజి.చంద్రశేఖర్‌రావు విమర్శించారు. శాసన మండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలు ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో సామాజిక న్యాయం లోపించిదని వాఖ్యానించారు. రాష్ట్రంలో 52శాతం ఉన్న బిసిలకు 25శాతం నిధులు కూడా బడ్జెట్‌లో కేటాయించలేదని అన్నారు. గతేడాది బడ్జెట్ కన్నా ఈఏడాది బడ్జెట్‌లో 18.3 శాతం అధికంగా ఉందన్నారు. మున్సిపాలిటీలకు కేటాయించిన నిధులు 22శాతం తగ్గయన్నారు. రుణమాఫీ కోసం 3600 కోట్లు కేటాయించారని, ఉత్తర ప్రదేశ్‌లో ఓట్ల కోసం రుణమాఫీ ప్రకటించిన ప్రధాని మోదీ మన రాష్ట్రంలో రుణమాఫీకి నిధులు ఎందుకు ఇవ్వటం లేదో ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిస్కంలు అప్పుల్లో ఉన్నాయని, ఇవి కోలుకోగ పోగా ప్రతి ఏడాది విద్యుత్ ఛార్జీలను రెగ్యులేటరీ కమిషన్ పెంచుకుంటూ పోతోందని, విద్యుత్ ఛార్జీలు పెంచుకుంటూ పోవటం సమంజసం కాదని చంద్రశేఖర్‌రావు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా ఇళ్ళపై సోలార్ ప్యానెళ్ళు ఏర్పాటుపై ప్రజల్లో అవగాహన పెంచి ఏర్పాటు చేయిస్తే ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, దీనివల్ల ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం తగ్గుతుందని చెప్పారు. నీటి పారుదల రంగంపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు అల్లావుద్దీన్ అద్భుత దీపం ప్రభుత్వం వద్ద ఉన్నట్లుగా చెబుతున్నారని, 2015లో పూర్తి కావాల్సిన వెలుగొండ ప్రాజెక్టు ఇప్పటివరకు పూర్తి కాలేదన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టును 2018, 19 కల్లా పూర్తి చేసి నీరు ఇస్తామని చెబుతున్నారని, పోలవరం ప్రాజెక్ట్ పనుల పూర్తికి కాల పరిమితిని ఏవిధంగా నిర్ణయించారని, ఆ ప్రాజెక్ట్‌కు 50వేల కోట్లు నిధులు అవసరమయ్యేలా ఉందని, ఈ నిధులు ఏ విధంగా సమీకరిస్తారో ప్రభుత్వం స్పష్ట చేయలేదన్నారు. గృహ నిర్మాణంలో గత ప్రభుత్వ హయాంలో భారీ అవినీతి జరిగిందని ఈ ప్రభుత్వం హయాంలో ఎన్ని ఇళ్ళు కట్టంచిందీ తెలియదన్నారు.10లక్షల ఇళ్ళు కట్టిస్తామంటున్నారు. 240 కోట్లు కేటాయించామంటారు. ఈరెండుకీ పొంతన కుదరటం లేదన్నారు. దీనికి సంబంధించి పున:సమీక్ష జరపాలన్నారు. ఎస్టీ, ఎస్సీ, బిసిలకు కేటాయింపులు గమనిస్తే సామాజిక న్యాయాన్ని నిర్లక్ష్యం చేసినట్లుగా కనిపిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాల మౌలిక లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించటం తగదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన నిధులు ఖర్చుకాకపోతే మరుసటి ఏడాది ఖర్చు పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది కేటాయించిన ఎస్సీ, ఎస్టీ నిధులో తొమ్మిది రంగాల్లో రూపాయి కూడా ఖర్చు పెట్టకపోవడం ప్రభుత్వం ఆ వర్గాలను ఎంత నిర్లక్ష్యం చేస్తోందో స్పష్టం అవుతోందన్నారు. భారతీయ కార్పోరేట్ రంగంలో కూడా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఈ రంగంలో 8387 మంది బోర్డు మెంబర్లు ఉంటే 3.8శాతం బిసిలు 3.5 శాతం ఎస్సీ,ఎస్టీలు ఉన్నారని మిగిలిన 92 శాతం అగ్రవర్ణాల వారేనని ఇది గమనిస్తే దేశంలో సామాజిక న్యాయం పెరిగిపోతోందని అర్థమవుతోందన్నారు. పబ్లిక్ రంగం కుంచించుకుపోతోంది. ప్రవేటు రంగం బలపడుతోంది. గ్లోబలైజేషన్ (ప్రపంచీకణ) ఫెయిల్డ్ ఫినామినా అన్నారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, బాధితులకు న్యాయం చేయాలంటూ ఉద్యమాలు చేస్తే పోలీసులు దౌర్జన్యంగా అణచివేస్తున్నారని పేర్కొంటూ హాయ్‌ల్యాండ్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. బడ్జెట్ పేద వర్గాల వారిని విస్మరించినట్లుగా ఉందని చంద్రశేఖర్‌రావు వ్యాఖ్యానించారు.

ఉగాది శుభాకాంక్షలు
ఎస్. మాస్టిన్ వలి
సెల్: 9246167248
9966487226
ఎస్.కె. మెడికల్ & ఫ్యాన్సీ స్టోర్స్
Opp. UC Tea సెంటర్, సోల్‌వెన్ట్ రోడ్డు, సనట్ నగర్, విజయవాడ - 520 007.

అతి త్వరలో దినపత్రికగా రానున్న
రాజధాని వార్తలు
పత్రికకు రాష్ట్రవ్యాప్తంగా
విలేకరులు కావలెను
సంప్రదించవలసిన నెం:9440662699
Email : Info@rajadhanivartalu.com

సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక
రాజధాని వార్తలు
క్లాసిఫైడ్స్ - రూ.500/- మాత్రమే
94406 62699, 96768 44442

శ్రీ కల్కి అందరివారు
ఎం.బేగ్
విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి, లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి
కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు 3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి
అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు
కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో
హా హా 1 లా ఇలాహ
హూ హూ 2 ఇల్లల్లాహు
హీ హీ 3 మొహమ్మదుర్ రసూలుల్లాహి
8143307812
ఎవరూ నరకానికి పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.

వెల్లివిరిసిన సహకారానికి అభివందనం
జవహర్ ఆటోనగర్ ఆటోమోబైల్ టెక్నికల్ అసోసియేషన్ (ఏటీఏ)
అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన మీ అందరికీ నా అభివందనం.
నైతిక విలువలతో కూడిన సమర్ధవంతమైన నాయకత్వంతో
ఏటీఏ పురోభివృద్ధికి కృషి చేస్తూ,వేల మంది జీవితాల్లో
ఆనందం నింపేందుకు
అహరహం శ్రమిస్తామని వాగ్దానం ఇస్తూ.....
ఏటీఏ క్లాక్ నెవర్ స్టాప్స్
ప్రియమైన సభ్యులకు, క్షేత్ర సిబ్బందికి, మిత్రులకు, శ్రేయోభిలాషులకు యావన్మందికీ
ఉగాది శుభాకాంక్షలు
రాజనాల వేంకట రమణారావు(బాజ్జి)
సెల్ : 93941 39239,81434 44459

Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan, Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18